- సాహితీవేత్తల తాత్త్విక దృక్పథాలు - బుచ్చిబాబు దృక్కోణం
- ప్రబంధ కవుల చాటుపద్య చమత్కృతి
- ప్రొ.ఎస్వీ సత్యనారాయణ విమర్శనా దృక్పథం
- తిరుపతిలో ఘటికా యంత్రాలు
- తొలి తెలుగు స్వతంత్ర కవి-పాల్కురికి సోమనాథుడు
- గుడిదీపం
- నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము
- చిల్లర దేవుళ్ళు - మరుపురాని పాత్రలు


# మూసీ
# MUSI


- Samputi : 28 • Sanchika : 10 • Pages : 64 • Rs. 20
- August 2025




Scanned with OKEN Scanner





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 10
ఆగస్టు - 2025
'విశ్వావసు' శ్రావణ మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

## ఈ సంచికలో ...

సాహితీవేత్తల తాత్విక దృక్పథాలు - బుచ్చిబాబు దృక్కోణం ... డా. జె.నీరజ - 7
ప్రబంధ కవుల చాటుపద్య చమత్కృతి ... డా. బోయినిపల్లి ప్రభాకర్ -13
ప్రొ.ఎస్వీ సత్యనారాయణ విమర్శనా దృక్పథం ... డా. ఇమ్మిడి మహేందర్ - 19
తిరుపతిలో ఘటికా యంత్రాలు ... ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి - 23
పరిశోధనలో ప్రశ్నా రూపకల్పన : ప్రాధాన్యత, లక్షణాలు, పద్ధతులు ... ఆచార్య గంపా వెంకటరామయ్య - 27
తొలి తెలుగు స్వతంత్ర కవి - పాల్కురికి సోమనాథుడు ... డా. మరపతి మాంతయ్య-32
గుడిదీపం ... డా. పఠాన్ ఖాసింఖాన్ - 36
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము ... డా. గంగ్ర లక్ష్మణరావు - 39
చిల్లర దేవుళ్ళు - మరపురాని పాత్రలు ... డా. ఎల్. సుజాత - 41
చారిత్రక కావ్యరాజం - శ్రీ శివభారతం ... డా. శంకర్ అనంత - 47
'అక్షరాకాశం' ఆవిష్కరణ - డా. మంత్రి శ్రీనివాస్ - 59

### కవిత్వం

వసంతం ... అల్వాల లక్ష్మణమూర్తి - 5; తుకారాం అభంగం - డా. మంత్రి శ్రీనివాస్ - 6; ఐతరేయోపనిషత్తు ... జక్కని వేంకటరాజం - 12; విభావరి - కె.ఎల్. నారాయణ - 21; ఆడపిల్ల పుడితే.. హర్షించేదెవరు - పోలయ్య కూకట్లపల్లి - 38; వెనక్కి తిరిగిన కాలం - పద్మపుత్ర మల్లికార్జున్ కర్నె - 46; కన్నీటి పట్టాలు - బింగి శ్రీకాంత్ - 58; ఎంత బావుంది - డా. టి. శ్రీవల్లీ రాధిక - 62; ఒక మథనం తర్వాత - డా. తిరునగరి శరత్ చంద్ర-62.

### సమీక్ష

మనోహరాచారి కథలు - మానవత్వపు వారధులు ... డా. ముత్యంపేట గంగాధర్ 50
రసరమ్యం - శ్రీరామశతకం ... సుప్పని సత్యనారాయణ ... 53; వదనకొండవ శతాబ్దము నాటి తెనుగు భాష ... ఘట్టమరాజు 55; శతక నైవేద్యం - గడ్డం సులోచన - 57;

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (4) హైదరాబాద్ ఆగస్టు : 2025

## సంపాదకీయం



**వ్యక్తి శక్తి కావాలి**

**మనిషి మనీషి కావాలి**

**మానవుడు**
**మహనీయుడు కావాలి**

**ఉన్న స్థానం నుండి**
**ఉన్నత స్థానానికి చేరాలి**

**పరిమితుడు**
**అపరిమితుడు కావాలి**



**స్థాయి విస్తరించాలి**

**దైవత్వం మేల్కొనాలి**

**తనను తాను నిరంతరం**
**ఉద్ధరించుకోవాలి**

**అందరికీ ఆదర్శంగా**
**ఆమృతమూర్తిగా**
**మారాలి**

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# దీపం

దీప్యతే అనేన దీపః, ప్రదీపశ్చ, దీపీ దీప్తౌ, దీనిచే ప్రకాశింపజేయబడును. దీప శబ్దం సూర్యుని నుండి మొదలు పెట్టి అనేక రూపాల్లో సామాజిక అవసరాల రూపంలో వినియోగిస్తూనే ఉన్నాం. దీపం వెలగడానికి మరోదీపం యొక్క సహకారం కావాలి. పత్తితో చేసిన వత్తి కావాలి. అన్నింటినీ మించి కావలసినంత నూనె కూడా కావాలి. ఈ మూడు ఉన్నప్పుడే ఒక దీపం లోకానికి వెలుగు నిస్తుంది. ఈ మూడింటిలో ఏది లేకున్నా దీపం వెలగడం సాధ్యం కాదు. నూనె లేని పత్తిని దీపం వెంటనే కాల్చివేస్తుంది. నూనె మాత్రమే ఉన్నా వత్తి లేకుంటే దీపం వెలిగే అవకాశం ఉండదు.

మనిషి బాహ్య జీవనం ద్వారా వెలుగు కనిపిస్తుంది. మనిషి బాహ్య రూపము మరియు చేసే పనులు అన్నీ దీపంగా భావించాలి. మనస్సును వత్తిగా భావిస్తే, లోపలి చైతన్యం అంతా నూనె అవుతుంది. ఎంత నూనె ఉంటే అంతకాలం దీపం వెలుగుతుంది. దీపానికి, నూనెకు మధ్యవర్తిగా పత్తితో చేసిన వత్తి నిలుస్తుంది. ఆధ్యాత్మిక శాస్త్రాల ప్రకారం శరీరానికి సహజమైన జ్ఞానం లేదు. జ్ఞానం అంతా లోపల అంతటా నిండిన చైతన్యానిదే. ఈ చైతన్యం దీపంగా మారడానికి మధ్యలో ఉన్నది వత్తి మాత్రమే. ఈ వత్తి కూడా బాగా దానిని వడికి, వడికి, పేని తయారు చేయాలి. ఎంత దానిని గట్టిగా నలిచివేస్తే అంత జాగ్రత్తగా నూనెను స్వీకరిస్తుంది. దీపిస్తుంది. దానికి బాగా వడి పెట్టక పోతే త్వరగా దాని శక్తిని కోల్పోయి కొడిగట్టుతూ ఉంటుంది. నూనెను ఎక్కువ స్వీకరించి త్వరగా పాడు అవుతుంది. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించాల్సిన అవసరం ఉంది.

మనిషి వికసించాలన్నా, తన తర్వాత కూడా దీపించాలన్నా, వెలుగై వ్యాపించాలన్నా మన మనస్సుకు ఎన్నో పద్ధతులు, బాధ్యతలు నేర్పించాలి. ఒద్దికగా పెంచాలి. సామాజిక, ప్రకృతి, బంధుమిత్ర వర్గ స్ఫురణ కల్గించాలి. సంస్కార మార్గాలు చూపించాలి. అధ్యయనం జాగ్రత్తగా చేయించాలి. ప్రాంతానికి, దేశానికి, భూమికి, ప్రకృతికి, విశ్వానికి తనకున్న పరిమిత సమయంలో తాను చేయగలిగిన బాధ్యతలేవో తెలుసుకునే ప్రయత్నం చేయించాలి. వినియోగపడే సంస్కృతిని మేల్కొల్పాలి. ఏదో రూపంలో యోగదానం చేసేవిధంగా ప్రోత్సహించాలి. ఇన్ని రూపాల్లో ఇచ్చే అభ్యాస మార్గాలే వత్తిని వడి పెట్టే సాధనాలు.

వత్తి, దీపం ఉన్నా నిండుగా ఉండే నూనె వల్లనే అన్నీ సాధ్యం. అందరికీ కావలసినంత నూనె ఉన్నా వినియోగించుకునే విధానం తెలియకపోవడం వల్లనే లోపాలన్నీ వస్తున్నాయి. సరియైన వత్తి కాకుంటే త్వరగా నూనె అయిపోతుంది. లేదా నూనె ఎంతో ఉన్నా వత్తి త్వరగా కొడిగట్టి పోయి పాడవుతుంది. అప్పుడు ఆ దీపపు వెలుగులోనే ఆ వత్తి కాలిపోతుంది. నూనె సహకారం ఎప్పటికీ ఉంటుంది. వత్తి యొక్క ప్రభావాలే వేరు వేరుగా ఉంటాయి.

మనిషి మనస్సును జాగ్రత్తగా పెట్టుకొని శక్తితో అనుసంధానం చేసుకుంటే తాను దీపిస్తాడు, శోభిస్తాడు, లోకాన్ని శాసిస్తాడు. శాశ్వతుడవుతాడు. ఈ అనుసంధానం సరిగా లేకుంటే తనను తాను కోల్పోతుంటాడు. త్వరలో తన జీవిత ప్రస్థానాన్ని ముగించుకుంటాడు. అందరూ గొప్ప దీపాలే. అందరిలోనూ తేజస్సు ఉంది. జాగ్రత్తగా వినియోగించుకున్నవాడే శాశ్వతుడు అవుతున్నాడు. వినియోగించుకునే జ్ఞానం సరిగా లేనివాడు మరీ తాత్కాలికుడౌతాడు.

దీపం వెలిగించి చూస్తే ఎన్నో ఇటువంటి భావాలనే అందిస్తుంది. దీపించే విధానం అర్థం అయితే వ్యాపించే విధానం తెలుస్తుంది. మనస్సుకు ఇచ్చే శిక్షణ విధానం వల్లనే వ్యాపనం సాధ్యం. లేకుంటే తన వెలుగు తనకు కూడా వినియోగపడదు. శిక్షణ పొందిన మనస్సుతోనే లోకాలను వెలిగించడం సాధ్యం అవుతుంది.

# వసంతం (మత్తకోకిలా వృత్తములు)





నీవు రాగదె కొత్త నన్నుల నేమకంబుగఁ బాడగన్
తావులన్నియు చిత్తవృత్తిని తత్తరించుచు నుండగా
ధావనంవబులు వేగమైనవి దాపరించగ నామనే
భావ గీతిక స్వాగతంబులు పల్కుచుందురు ముందుగా
ఈ వసంత సమాగమంబున నేల బాడవు కోయిలా?

(నన్ను = అనురాగం, తత్తరించు = తొందరపెట్టు, ధావనము = పరుగు, శుద్ధి చేయు, దాపరించు = ప్రాపించు)

క్రొత్త యూహలు సందడించెను కొంటెగా యువజంటనే
మత్తు చూపుల మంత్రముగ్ధులు మర్మభాషణ మాటుగా
చిత్తకైతలు పల్లవించెను చిత్రమే యవి కొత్తలై
మెత్తనౌ సుమ బాణముల్ యెద మీటకుండగ గుచ్చునే

ఎంతటందము నూతనత్వము యేమి వైభవ మీయెడన్
చెంత నృత్యము సల్పుచున్నవి చేతనంబుగ తేటులున్
వింత సౌరభ వాహకంబులు వీచుచుండెను మంద్రమై
పొంతనంబులు పెక్కునున్నవి పుష్టి గూర్చగ లోకమున్

మత్తకోకిల పాడకున్నది మండుటెండల క్రుంగెనో
కొత్తరాగము లాలపించక కొమ్మచాటున దాగునే
చిత్తమేలకొ స్తబ్ధమైనది చేతనంబులు దక్కియున్
తత్తరించెనొ వృత్తభావము తంత్రముల్ పాడసూపకన్

చింతపండును దిన్న చెల్కలు చేర రమ్మనె ఆమనిన్
సంతసించుచు మత్తకోకిల సామగానము చేసెనే
వంత పాడుచు గండు తుమ్మెద వచ్చి యాడెను పూవుపై
పొంతున్న వసంతు డప్పుడు పుష్పబాణము వేసెనే

మత్తుకోకిల గొంతు నెత్తుచు మార్దవంబుగ పాడెనే
క్రొత్తరాగము పంచమంబగు కోర్కెలన్నియు రేగగన్
ఎత్తు వచ్చున దాని పాటకు నెంతరాగము దీసినన్
కృత్తివాసుని దీవనంబులె కీర్తికెక్కగ మూలమౌ
(కృత్తివాసుడు = ఈశ్వరుడు)

అల్వాల లక్ష్మణ మూర్తి
కల్వకుర్తి, ఫోన్ : 9550 467 431

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యథాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యథాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

అంతము అనంతము ఆది దైవము
విఠలరాయ నీదే పరివారము
నిన్ను నమ్ముకున్నవారము
నిన్ను సొమ్ము చేసుకున్నవారము

రాత్రి పగలు నీ ధ్యానము
చేయునట్లు నొసగు వరములు
క్రోధ మద మత్సరాంధకారము
పడనీకుమయ్య మమ్ము కాచుము

పరుల మాటలంటనీయకు
మనసు తెరలు నలగనీయకు
నింద్యుడను అనింద్యులిద్దరిని
సమదృష్టి బుద్ధి చూడనీయుము

తుకా మాయ గప్పుకున్నది
సంసార సంధి బందీయైనది
మాయ తెరలు తెరచి చూడుము
పాండురంగ విఠలు గాంచుము




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (7) హైదరాబాద్ ఆగస్టు : 2025

# సాహితీ వేత్తల తాత్త్విక దృక్పథాలు - బుచ్చిబాబు దృక్కోణం

✍ **డా. జె. నీరజ,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, సిటీ కళాశాల, ఫోన్ : 7660020730




తెలుగు రచనలకు తాత్విక అనుభూతి గాఢతను అద్దిన నవలాకారుడు, కథకుడు, నాటకకర్త బుచ్చిబాబు. వీరి రచనల్లోని మానవ మనస్తత్వ సూక్ష్మ చిత్రీకరణ, వినూత్న కథన శైలి, పాత్ర చిత్రణ పాఠకులను సమ్మోహనపరుస్తుంది. బుచ్చిబాబు రచనలన్నీ సామాజిక, తాత్విక అంశాలను చిన్న సంఘటనల ద్వారా విశాలమైన జీవన దృక్పథంతో ఆవిష్కరిస్తాయి. **'చివరకు మిగిలేది'** నవల మానసిక సంఘర్షణ, జీవన రహస్యాలను, స్వీయ ఆత్మావిష్కరణలను మార్మికంగా వ్యాఖ్యానిస్తుంది. సౌందర్యాన్వేషిగా పేరొందిన బుచ్చిబాబు కథలు అనుభూతి కావ్యంలా పాఠకులను మళ్లీ మళ్లీ చదివిస్తాయి. సోమర్‌సెట్ మామ్, ఓ హెన్రీ, బర్ట్రాండ్ రస్సెల్ వంటి ఆంగ్ల రచయితల ప్రభావంతో, ఆయన రచనలు అభ్యుదయ భావాలు, ఆధునిక దృక్పథంతో తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానం పొందాయి. విశ్వసాహిత్యాన్ని విస్తృతంగా చదివిన బుచ్చిబాబు తెలుగు కథకులు, కవులైన చలం, అడవి బాపిరాజు, గోపీచంద్, కృష్ణశాస్త్రి, తిలక్ సాహిత్యాన్ని, సృజన విలక్షణతను విశ్లేషిస్తూ వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలలో ఆయన ఆయా రచయితల సాహిత్యాన్ని పరామర్శిస్తూ తాను చదివిన ప్రసిద్ధ పాశ్చాత్య రచయితలతో తులనాత్మక విశ్లేషణ చేస్తారు. ప్రముఖ రచయితలను మరో ప్రముఖ రచయిత ఎలా అర్థం చేసుకున్నాడు, చేసుకోవడం వెనకున్న ప్రమాణాలు, తులనాత్మక అంశాలు, అంచనా స్థాయి అనేది ఈ వ్యాసాలను చదివితే అర్థమవుతుంది. బుచ్చిబాబు తన కథల్లోని పాత్రల్లోకి పరకాయ ప్రవేశం చేస్తాడు. ఇక్కడ కూడా రచయితల అంతరంగంలోకి బుచ్చిబాబు మనోవిశ్లేషణకారుడిలా పరాత్మ ప్రవేశం చేశాడు, వారిని ఎలా మూల్యాంకనం చేశాడో తెలుసుకోవాలంటే ఈ వ్యాసాలను చదివి తీరవలసిందే.

గుడిపాటి వెంకటాచలం, తెలుగు సాహిత్యంలో కాలం చెల్లిన సంప్రదాయాల పట్ల నిరసన, ధిక్కారం, తిరుగుబాటు స్పృహతో ఆలోచనల్లో విప్లవాత్మకతను ప్రవేశపెట్టిన తొలి రచయిత. చలం రచనలు, ముఖ్యంగా 'మైదానం', 'స్త్రీ', సమాజంలోని మహిళల జీవన సమస్యలను, పితృస్వామ్య భావజాలాన్ని విమర్శిస్తూ వ్యక్తిగత స్వేచ్ఛను ప్రోత్సహిస్తూ సంచలనాన్ని సృష్టించాయి. సరళమైన, హృదయోద్వేగ పూరితమైన శైలి చలం ప్రత్యేకత. వారి సాహిత్యం తెలుగు నవల, కథానికా సాహిత్యంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. 'చలం' పై వ్యాసం రాస్తూ రచయితగా, సంస్కర్తగా చలం సమాజంపై చూపిన ప్రభావాన్ని విశ్లేషించారు బుచ్చిబాబు. ఆయన వ్యక్తిత్వం, రచనల శైలిని నిశితంగా పరిశీలించారు. చలం మాటలు, ప్రవర్తన, నిజాయితీ, ఆలోచనలలో సమన్వయం ఉ ండటం వల్లనే ఆయన వ్యక్తిత్వం గొప్పతనాన్ని సంతరించుకుందని అంటారు. ఆయన చలం రచనల్లోని సాహిత్య విలువలను, సామాజిక సంస్కరణ భావాలను సమతూకంతో వివరించారు. చలం రచనలలోని కవితాత్మక శైలి, సామాజిక ప్రభావాన్ని స్పష్టంగా వెల్లడించడం బుచ్చిబాబు విమర్శలోని స్పష్టతను చూపిస్తుంది. చలం రచనలను వీరేశలింగం, గురజాడ, గిడుగు వంటి సంస్కర్తలతో పోల్చి, చలం సాహిత్య, సామాజిక స్థానాన్ని ఉన్నతస్థాయిలో నిలుపుతారు. ఈ వ్యాసం బుచ్చిబాబు సాహిత్య విమర్శలో ఆలోచనాత్మకత, సమకాలీన సమాజ దృక్పథాన్ని స్పష్టంగా అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది.

గుంటూరులో జరిగిన నవ్య సాహిత్య పరిషత్ సభలో అందరూ చలం గురించే మాట్లాడుతుండగా ఆయన సభలోకి రాకుండా గది వెలువల చేసిన చర్చలు తనను ఆకర్షించాయని చెప్తారు. ఒక స్నేహితుడు **'విద్యార్థులకు ఇచ్చే సందేశం'** అడిగితే, **'డబ్బు సంపాదించి, ప్రేమించిన స్త్రీ సిద్ధమయ్యే వరకూ పెళ్లి చేసుకోవద్దు'** అని ఆయన చెప్పిన సమాధానం చలం ఉదాత్త ఆదర్శనీయతను, వాస్తవిక దృక్పథాన్ని చూపుతుంది అంటారు. ఆ తరువాత ఇరవయ్యేళ్ళకి పది నిమిషాలు ఆయనతో సంభాషించినప్పుడు ఆయన మాటలు, చేష్టలు, ఆలోచనల్లో తాత్విక నిజాయితీ, సమన్వయం తనను ఆకర్షించాయని అంటారు. భావజగత్తులో విహరించేవారికి స్థూల జగత్తు, లోకంలో మునిగేవారికి ఆలోచనా సమయం దొరకదు. కానీ చలంగారు ఇహం, పరం రెంటినీ సమన్వయం చేసి, పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సాధించారన్న బుచ్చిబాబు మాటలకు సమానమైన వ్యాఖ్య **'చలం తాను స్వయంగా మండుతూ తన రచనల్లో వెలిగాడ'**ని యువభారతి వారు ప్రచురించిన **'చలం ఆలోచనలు'** కి రాసిన పీఠికలో ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం వ్యక్తం చేశారు.

ఆయన చేయాలనుకున్న పనులు చేశారు, చెప్పాలనుకున్నవి చెప్పారు, పొందాలనుకున్నవి



సాధించారు. మిగిలిన కొన్ని లక్ష్యాలను సాధిస్తున్నారని, ఆ సమన్వయం ఆయన జీవితానికి అందమైన ఆకృతిని, పరిపూర్ణతను తెచ్చిందని అంటారు. నిజం చెపితే ప్రజాబాహుళ్యానికి అంత భయం. **'వర్ణనాతీతమైన దాన్ని వర్ణిస్తాయి కనక కళలన్నీ అమానుషాలే'** అని హెర్బర్టు రీడ్ అన్నట్లుగా ఆనాటి సమాజానికి అశ్లీలాలుగా కనిపించిన వాటిని చలం గారు సాహసంతో చెప్పారని అంటారు బుచ్చిబాబు.

చలం రచనలు, ముఖ్యంగా **'స్త్రీ'**, స్త్రీలకు శారీరక, మేధో, హృదయ సంబంధిత అవసరాలను గుర్తించి, వాటికి వ్యాయామం, జ్ఞానం, అనుభవాలు అవసరమని వాదించాయని, చలం వ్యక్తిత్వం, శైలి, నైతిక తృష్ణ, ఆదర్శం, ప్రతిభ అన్నీ **'స్త్రీ'** నవలకి ఆయన రాసిన అంకిత వాక్యంలోనే ఉన్నాయంటారు బుచ్చిబాబు. తన ప్రచారం పూర్తిగా ఫలించిందని చలంగారు నమ్మినట్టు లేదని **'స్త్రీ'** గ్రంథానికి 1930లో వ్రాసిన ఉపోద్ఘాతాన్ని, తిరిగి ఇరవై ఏళ్ళ తర్వాత అదే పుస్తకానికి వ్రాసిన ఉపోద్ఘాతాన్ని పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుందంటారు బుచ్చిబాబు. **'అత్త అధికారం నుంచీ, భర్త అధికారం నుంచీ తప్పించుకుంటున్న నవీన స్త్రీ షోకులకు, సంఘ గౌరవానికి బానిసవుతోంద'**ని చలం బాధపడ్డాడని అంటే ఆయన సంకల్పం పూర్తిగా సిద్ధించలేదన్న బాధ గ్రహించవచ్చని, పెద్ద కార్యం తల పెట్టిన ప్రతి వ్యక్తిలోనూ కొంత అసంతృప్తి వుండడం సహజమని అంటారు.

మధ్య తరగతి వారి మనస్తత్వాలను, వాంఛలను అలవాట్లను చలంగారంత బాగా అర్థం చేసుకొని స్పష్టంగా చర్చించిన మరొక వ్యక్తి తనకు కనబడలేదని, చలంగారంతటి ప్రతిభతో మధ్యతరగతి సంసార జీవితాలను చిత్రించిన మరొక రచయిత లేరనుకొంటున్నానని ప్రకటించారు.

చలం రచనలను బహిరంగంగా విమర్శించినప్పటికీ, యువతీ యువకులు ఆయన కథలను రహస్యంగా చదివేవారు. సమాజం ఆంక్షలు విధించినా చలంగారి ఉద్యమ ప్రభావం హెూరెత్తింది. కాలక్రమేణా నైతిక ఆదర్శాల కోసం చలం రచనలు చదివేవారు తగ్గిపోయారని, ఉద్యమం విజయవంతమైన తర్వాత, దాన్ని ప్రేరేపించిన రచన విలువ తగ్గుతుందని, ఫ్రెంచి విప్లవాన్ని ఉత్తేజ పరిచిన రూసో గ్రంథాలను విప్లవం తర్వాత చర్మంతో బైండు చేస్తామని ఫ్రెంచి ప్రజలన్నట్లు చలం ప్రభావం కూడా అలాంటిదే అంటారు.

చలం కథలు, నవలలు రాయకుండా కేవలం స్త్రీ, మ్యూజింగ్స్, కొన్ని లేఖలు మాత్రమే రాసి ఉంటే ఒక సంస్కర్తగా పరిగణింపబడి ఉండేవారని బుచ్చిబాబు అభిప్రాయం. రచయితగా చలం తన పట్ల, భవిష్యత్తు పట్ల బాధ్యత నిర్వర్తించటంకోసమే రచనలు చేశారని స్త్రీ, మ్యూజింగ్స్, ఒక పువ్వు పూసింది అలాంటి రచనలేనని అభిప్రాయ పడ్డారు. చలం గారి రచనలలో తనకి ఇష్టమైన రచనగా **'నవీన సారంగధరుడు'** పేర్కొంటానంటారు. **'ఒక పువ్వు పూసింది'**లో వాడిపోయిన పుష్పాన్ని చలం వర్ణించిన తీరు వర్ణనల్లో ఆయనకున్న అపూర్వమైన శక్తి, సమయస్ఫూర్తి, దిగ్భ్రమ కలిగించే ఉద్వేగాన్ని చాటుతాయని అంటారు బుచ్చిబాబు. ఈ వర్ణనను అద్భుతమైన కళాఖండంగా ప్రశంసిస్తారు, చలం రచనల్లో కవిత్వం, హాస్యం, విషాదాల సమన్వయాన్ని గుర్తిస్తారు.

చలం మరిన్ని రచనలు చేయలేదని విచారించకుండా, ఉన్న వాటితో తృప్తిచెంది, వాటిలోని ఆనందానికి కృతజ్ఞతలు చెప్పడం మన కర్తవ్యం. కాలం గడిచేకొద్దీ కొన్ని వస్తువులు దూరమైనా, మరికొన్ని సన్నిహితమవుతాయి. దృక్కోణాలు, స్థానాలు మారుతూ, కొన్ని రచనలు శిఖరాలుగా నిలిచిపోతాయి. చలంగారి గొప్పతనాన్ని మనం పూర్తిగా గుర్తించలేకపోయినా, భావితరాలు దాన్ని గ్రహించే వాతావరణాన్ని సృష్టించడం మన బాధ్యత అంటారు బుచ్చిబాబు.

చలం ఒక సంస్కర్తగా, సాహితీవేత్తగా ఆంధ్ర సమాజ చరిత్రలో వీరేశలింగం, గురజాడలతో సమాన స్థానం కలిగిన వ్యక్తిగా చిత్రీకరిస్తారు బుచ్చిబాబు. చలం రచనలు మధ్యతరగతి మానసిక దృక్పథంలో మార్పు తెచ్చాయని, ఆయన శైలిలోని సౌందర్యం ఆ రచనలకు శాశ్వత విలువలను నిలిపిందని బుచ్చిబాబు చలాన్ని ఉన్నతస్థాయిలో నిలబెట్టారు.

సాంఘిక, చారిత్రక నవలల్లో గాఢమైన వర్ణనలు, ఆంధ్ర సంస్కృతి, గ్రామీణ జీవన వైవిధ్యానికి తన రచనలలో చిత్రిక పట్టిన రచయిత అడవి బాపిరాజు. బహుముఖ ప్రతిభాశీలిగా కవిత్వం, చిత్రకళ, నాటక రచనల్లోనూ సృజనాత్మకతతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. బుచ్చిబాబు **'జీవితంపట్ల బాపిరాజుగారి దృక్పథం'** వ్యాసంలో బాపిరాజు గురించి రాస్తూ, ఆయన జీవిత దృక్పథాన్ని సౌందర్యం, స్వేచ్ఛ, ఆనందంతో ముడిపడినదిగా వర్ణిస్తారు. బాపిరాజు రచనలు, చిత్రలేఖనం గొప్పవైనా, వాటిని మించిన వ్యక్తిత్వం ఆయనదని అంటారు. ఆయనతో తన పరిచయం కేవలం పదిహేనేళ్లలో పన్నెండు గంటలే అయినా, ఆయన కళారంగంలో స్థిరమైన కీర్తిని సమీక్షిస్తూ, ఆయన ఏ ఉద్యమాన్నీ లేవదీయలేదని, సిద్ధాంతాలను ప్రచారం చేయలేదని పేర్కొంటారు.

బాపిరాజుని గెథె, విట్మన్‌లాంటి మహనీయులతో పోల్చుతాడు. సమాజంతో నిమిత్తం ఉంటూనే, రాజకీయాలు, సంసారం, ఉద్యోగం వంటి బంధనాలకు లొంగకుండా, సౌందర్యంతో కూడిన స్వచ్ఛమైన

ఆనందాన్ని అన్వేషించారని బుచ్చిబాబు అభిప్రాయపడతారు. **"గోదావరి ఒొడ్డున ఆకాశం చూస్తూ గడిపిన క్షణాలు"** ఆయనకు అపారమైన ఆనందాన్నిచ్చాయని, ఈ ఆనందాన్ని పద్యం, ఉత్తరం, నవల రూపంలో పంచుకునేవారని చెప్పారు. ఆయన ఆనందాన్ని దాచుకోలేరని, దాన్ని అందరితో పంచాలని కోరేవారని వివరిస్తారు.

బాపిరాజు రచనలు అజంతా శైలిని అనుసరించాయని, కళోపాసన, ప్రేమ కలాపం వంటి వస్తువులు ఆయన కథలు, నవలల్లో కనిపిస్తాయని బుచ్చిబాబు గుర్తిస్తారు. **"కళ కోసం సౌకర్యం త్యాగం చేయాలి"** అనే సూత్రం ఆయన దృక్పథంలో కీలకమని అంటారు. అయితే, స్థిరమైన ఆదర్శాలు, సిద్ధాంతీకరణ లేకపోవడంతో, ఆయన రచనలు సమాజం ఆశించిన గొప్పతనాన్ని సాధించలేదని స్పష్టంగా చెప్తారు. బాధలను ఎదుర్కోకుండా, ఊహాలోకంలో విహరిస్తూ బొమ్మలు గీసేవారని, ఇది తాత్కాలిక ఉపశమనమేనని అనుమానిస్తారు.

బాపిరాజు అనుకరణ ప్రతిభ అసాధారణమని, జానపద గేయాలు, నాట్యం, ఇతరుల చేష్టలను సహజంగా అనుకరించేవారని చెప్పారు. **'రావోయి సిన్నివాడా'** వంటి గేయాలు బాల్యం, యవ్వనంలోని సౌకుమార్యాన్ని చిత్రిస్తాయని, ప్రకృతి సౌందర్యంతో ఆయనకు గాఢమైన అనుబంధం ఉందని వివరిస్తారు. బాపిరాజు నిత్య యవ్వనంతో, స్వేచ్ఛగా జీవించిన మహావ్యక్తిగా, సమాజానికి స్ఫూర్తినిచ్చిన చల్లని నీడగా బుచ్చిబాబు అభివర్ణిస్తారు.

భావోద్వేగాలు, ప్రకృతి సౌందర్యం, లాలిత్యంతో కూడిన భావకవిత్వ శైలికి ప్రసిద్ధి చెందింది దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వం. ఆయన రచనలు, ముఖ్యంగా 'కృష్ణపక్షం' వంటి కవితా సంపుటిలో, మానవ జీవన భావనలను సూక్ష్మంగా, సహజంగా ఆవిష్కరించాయి. ఆయన పాటలు, లలిత గీతాలు సంగీతాత్మకత, భాషా సౌకుమార్యంతో తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించాయి. కృష్ణశాస్త్రి కవిత్వం రవీంద్రనాథ్ టాగూర్ ప్రభావంతో ఆధునికత, సాంప్రదాయ హృదయ సౌందర్యాల సమ్మేళనంగా నిలిచింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వాన్ని **'లోభి బంగారం ముద్ద దాచుకుని చూసుకున్నట్లు',** రహస్యంగా దాచుకుని చదువుకుంటానని అపురూపంగా కృష్ణశాస్త్రి కవిత్వంపట్ల ఇష్టాన్ని ప్రకటిస్తారు బుచ్చిబాబు. ఆ కవితల్లో ఏదో గొడవ, తనతో మొరపెట్టుకునే భావన ఉందని భావిస్తారు. **"వింతగాఁదోచు నాదు జీవితము"** వంటి పంక్తులు జీవితంలోని అసంతృప్తిని, అంతరంగ సంఘర్షణను వ్యక్తం చేస్తాయని, ఆ గొడవ ఏమిటో స్పష్టంగా తెలియకపోయినా, అది హృదయాన్ని కదిలిస్తుందని అంటారు. కవిత్వం గుంపులను కదిలించాలని, జనులని కార్యోన్ముఖుల్ని చేయాలని అంటారు కానీ కృష్ణశాస్త్రి కవిత్వాన్ని మాత్రం తాను ఏకాంతంగా ఆస్వాదిస్తానని, ఆ కవిత్వంలోని దైన్యం, విషాదం, ఒంటరితనం తనకొక్కడికే సొంతమని, ఎవరూ ఈ బాధను పంచుకోలేరని నమ్మినట్లు కనిపిస్తుందని అంటారు.

కృష్ణశాస్త్రి కవిత్వంలో 18-19 శతాబ్దాల ఆంగ్ల కవులైన షెల్లీ, కీట్స్ ఛాయలు కనిపిస్తాయని బి.ఎ.చదివిన విద్యావంతుడిగా, పాశ్చాత్య సాహిత్య ధోరణులను ఆయన తెలుగు కవిత్వంలో సమన్వయం చేశాడని తులనాత్మకంగా పరిశీలన చేసి చెప్తాడు. **'ఆంగ్లకవిత తెలుగుకవిత అద్భుతంగా సమ్మిళితమైన ఒక అపూర్వమైన సాహిత్య సమ్మేళనం కృష్ణశాస్త్రి'** అంటారు రచయిత, విమర్శకులు ఆచంట జానకీరామ్. యవ్వనంలో ఉత్సాహం, ఉద్వేగం, ఆశ, ఆనందాలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. కానీ ఆనాడు దేశం పరాయిపాలనలో ఉండటంతో స్వేచ్ఛ లేదు, అనువైన ఉద్యోగం లేదు, ప్రేమించిన స్త్రీ తనకు దొరకకపోవటంతో కృష్ణశాస్త్రి కవిత్వం బాధ, దుఃఖం, నిరాశలతో నిండింది.



తన బాధను జిజ్ఞాసతో సమాలోచన చేస్తూ రాసిన కవిత్వం అందంగా, ఆధునిక ధోరణిలో సాగిందంటాడు బుచ్చిబాబు. కృష్ణశాస్త్రి కవిత్వంలో **'ఏను మరణించుచున్నాను'** అన్న పంక్తి అస్తిత్వ సంక్షోభాన్ని చూపిస్తుందని, జీన్-పాల్ సార్త్రే ఎక్సిస్టెన్షియలిజంతో పోల్చదగిందంటారు.

పాఠకుడు నాలుగైదేళ్ళకోసారి చదివి తానెంతవరకు ఎదిగానో గ్రహించుకోవలసిన కవిత్వం కృష్ణశాస్త్రిదని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తారు బుచ్చిబాబు. ఒకనాడు చదివినవి ప్రస్తుతంలో రుచించకపోవచ్చని, అప్పుడు పట్టించుకోని ఖండకావ్యం ఇప్పుడు ప్రధానమైనదిగా కనిపించవచ్చు. అంతరంగ జీవితంలోని ఉద్రేకపూరిత ఆటుపోట్లకు కృష్ణశాస్త్రి కవిత కొలబద్దగా ఉంటుందని అంటారు.

దేశమంతా జాతీయోద్యమంలో నిమగ్నమై స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారు. అందరూ జాతిని జాగృతం చేసే గీతాలాపన చేస్తుంటే ఈయన ఊహా లోకంలో విహరిస్తూ, **'దిగిరాను దిగిరాను దివినుండి భువికి'** అంటూ వైయక్తిక భావాలను కవిత్వీకరించాడని, ఆ సమయంలో దానిని ఆస్వాదించినవాళ్లు, గుర్తించిన వాళ్ళు లేరని, అ తరువాత ఇరవయ్యేళ్ళకి కవి ఆవేదనని పంచుకోగలవారి సంఖ్య పెరిగిందని అన్న బుచ్చిబాబు వ్యాఖ్యలు అతడి సునిశితమైన పరిశీలనకి, నిష్కర్షగా చేసిన విమర్శకి నిదర్శనం. కృష్ణశాస్త్రికి ఇష్టమైన క్రియలు క్రుంగిపోవడం, జారిపోవడం, తునియలవడం,

త్రుళ్ళిపడడం, కరిగిపోవడం, ఆయన ఎక్కువగా అభిమానించి వాడినవి 'పడడం' 'పడిపోవడం' అన్నవి. ఆయన ఎప్పుడూ పైనే వుంటాడు కనుక 'పడిపోవడం' అన్నదానిలో ప్రత్యేకమైన సౌందర్యం కనబడుతుందని సున్నితంగా విమర్శిస్తారు బుచ్చిబాబు. రచయిత కృష్ణశాస్త్రి కవిత్వాన్ని వ్యక్తిగత భావోద్వేగ కోణం నుండి విశ్లేషిస్తూ, దాని అంతరంగిక ప్రభావాన్ని వివరిస్తారు. ఆయన కవితలను సామాజిక, రాజకీయ సందర్భాలతో అనుసంధానిస్తూ, ఆనాటి యువత ఆకాంక్షలకు అన్వయిస్తారు.

తెలుగు సాహిత్యంలో మానవ సంబంధాలు, సామాజిక వాస్తవికతలను లోతుగా చిత్రించిన రచయిత త్రిపురనేని గోపీచంద్. ఆయన రచనలు, ముఖ్యంగా **'అసమర్థుని జీవయాత్ర'** వంటి నవలలు, మానవ మనస్తత్వం, సమాజంలోని సంఘర్షణలను సూక్ష్మంగా విశ్లేషిస్తాయి. గోపీచంద్ రచనాశైలి సహజ సంభాషణలు, తాత్త్విక ఆలోచనలతో కూడిన వాస్తవిక చిత్రణకు ప్రసిద్ధి. ఆయన నాటకాలు, కథలు కూడా సామాజిక సమస్యలపై చైతన్యాన్ని కలిగించడంలో ఆయన సృజనాత్మకతను ప్రతిబింబిస్తాయి. గోపీచంద్ తో తన అనుభవాలను, సాహిత్యంపై ఆయనకు గల దృక్పథాన్ని, రచనలలో ప్రతిఫలించిన భావజాలాన్ని 'నేనెరిగిన గోపీచంద్' అన్న వ్యాసంలో స్పష్టంగా చర్చిస్తారు బుచ్చిబాబు. గోపీచంద్ వ్యక్తిత్వం లోతైన తాత్త్విక భావనలు, మానవతా వాదం, నైతిక విలువలపై ఉన్న స్థిర నమ్మకం, సమకాలీన రాజకీయ, సాంఘిక సమస్యల పట్ల స్పష్టత, విమర్శనా దృష్టిని కలిగి ఉన్నదని ఈ వ్యాసం వెల్లడిస్తుంది.

రేడియో నాటికలు రాసే సందర్భంగా బుచ్చిబాబుకి గోపీచంద్‌తో స్నేహం ఏర్పడింది. ఆ రోజుల్లో, నైతిక, ఆధ్యాత్మిక విలువల్ని సామాజిక దృష్టికోణంలోంచి పరిశీలించే అవసరం వుందని గోపీచంద్ అభిప్రాయం. అందుకు అనువైన వస్తువుతో దేశభక్తి, త్యాగం ప్రధానంగా రాసిన చారిత్రక నాటిక **'మాంచాల'**. ఉద్రేకం పాటలోనో, పద్యంలోనో అంతం కావాలన్న నాటక సంప్రదాయం ప్రకారం నాటకంలో సుదీర్ఘమైన చర్చకి, తర్కానికి చోటులేదు, కానీ గోపీచంద్ నాటికలో, పాత్రలు తమ ఉద్రేకాలని అదుపులోకి తెచ్చుకుని, వారి నిర్ణయాలకు, చేష్టలకు కారణాలు పేర్కొని నిదానంగా చర్చించుకుంటాయి. **'కవిత మాత్రం ఆవేశం రేకెత్తించగల'**దన్న అభిప్రాయం సరైంది కాదని ఇబ్సెన్, షా, ప్రీస్ట్లీ, నాటకాలు ఋజువుచేశాయి. అలాగే రేడియోకి వ్రాసినప్పటికీ, 'మాంచాల'లో తర్కబద్ధమైన ప్రేరణ రసానుభూతికి సాధనంగా ఉపకరించిందని బుచ్చిబాబు విశ్లేషిస్తారు.

తాను అనుసరించగల నైతిక విలువలను, ఆనందాన్ని సమకూర్చే సామాజిక సంప్రదాయాలను మానవుడే సమకూర్చుకోవాలన్న హేతువాదం ప్రధాన వస్తువుగా బట్లర్ **'ఎరివాన్'** నాటిక రాశాడు. బుచ్చిబాబు ఈ నాటికను సూచించగా గోపీచంద్ వినోదాత్మకంగా, సుబోధకంగా రాసిన నాటిక **'విచిత్ర ప్రక్రియ'.** యౌవనోద్రేకం కల్పించిన ప్రేమ కల, వాస్తవ జ్వాలలో ఎలా కరిగిపోతుందో చిత్రించిన నాటిక **'పశ్చిమవాహిని.'** గోపీచంద్ సమకాలీన సమస్యల ప్రస్తావన నిగూఢంగా చేశాడని, అదే ఆ నాటికలలో ప్రత్యేకత అని తన పరిశీలనను ప్రకటిస్తాడు బుచ్చిబాబు. తమకు నచ్చనిది జరిగితే సమాజాన్ని విమర్శించే సమూహాల గురించి ఓ నాటిక రాయమని బుచ్చిబాబు అడిగితే **'గుడ్డి సంఘం'** అనే నాటిక రాశారు గోపీచంద్.

రచయిత తన అంతరంగ సంఘర్షణలను కథానిక, నవలల ద్వారా పరిష్కరించుకుని, వ్యక్తిత్వ సమన్వయం సాధించిన తర్వాత, సమాజంలోని సమస్యలను వ్యాసం, నాటకం ద్వారా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాడు. గోపీచంద్ రచనలలో ఇది రెండు దశలలో స్పష్టంగా కనిపిస్తుంది. **'సంపెంగ పువ్వు'** అనే కథలో **'తమ రచనల్లో అభ్యుదయ భావాలను వెలిబుచ్చే చాలామంది రచయితల ప్రవర్తన మామూలు మనిషి ప్రవర్తనకంటే అధ్వానంగా ఉంటుంది. దీనికి కారణం భావాలను ఆలోచనలను ఆచరణలోకి అనుభవంలోకి తీసుకురావాలనే ప్రయత్నం లేకపోవటమే'** అన్న కథానాయిక మాటల వెనుక ఉన్నది గోపీచందేనని, సాహిత్యం ద్వారా సంస్కారానికి పూనుకున్న రచయిత మొదట తన నిజాయితీ, వ్యక్తిత్వం పట్ల నమ్మకం కలిగిన తర్వాతనే ఆ పనికి అర్హుడు కాదన్న గోపీచంద్ అభిప్రాయం గమనించదగిందని అంటారు. డార్విన్, ఫ్రాయిడ్ లాంటి ఆలోచనాపరుల ప్రభావంచేత ఆయన రచనల్లో హేతువాద, మానవతావాద ఛాయలు కనిపిస్తాయని తులనాత్మక పరిశీలన చేశారు బుచ్చిబాబు. పారిశ్రామిక పురోభివృద్ధి, విజ్ఞానశాస్త్రంతో మానవుడు కొత్త శక్తుల్ని పొందినా గుంపుతత్వంలో వ్యక్తి నలిగి అసమర్థుడవుతున్నాడన్న ధ్వనితో **'అసమర్థుని జీవయాత్ర'** నవల రాశాడని అంటారు. 'డార్విన్, ఫ్రాయిడ్, ఫ్రేజర్, ఐన్‌స్టీన్ వంటి శాస్త్రజ్ఞుల పరిశోధనా ఫలితాలు చూసి వాస్తవిక ధోరణిలో సాంఘిక, నైతిక విలువలని పరామర్శించిన వెల్స్, బెన్నెట్, అనటోల్ ఫ్రాన్స్, ఆర్వెల్ లాంటి రచయితలవలె పేరులోనే జీవిత విమర్శ, భావ గర్భితమైన తీర్పును కూడా ఇముడ్చుకున్న నవల గోపీచంద్ రాశారని బుచ్చిబాబు అభిప్రాయం. యువభారతి వారు ఏర్పాటు చేసిన ప్రసంగవ్యాసంలో మాట్లాడిన త్రిపురనేని సుబ్బారావు గోపీ చంద్ కథల్లో చెకోవ్‌లోని కథాగంభీర గమనం, టాగూర్‌లోని కథాసంవిధానం, గోర్కీలోని విప్లవభావాలు, టాల్‌స్టాయ్ కథల్లోని మానవతాదృష్టి, మపాసా లోని సున్నితహాస్యం, ప్రేమ్‌చంద్‌లో పెల్లుబికే ప్రేమానురాగాలు గోచరిస్తాయని అంటారు. ఆయన రచనలు నైతికత, సామాజిక బాధ్యతలను ప్రతిబింబిస్తాయని, నిరాడంబర, సహజ శైలిలో స్పష్టమైన భావవ్యక్తీకరణ ఆయన సాహిత్యానికి ప్రత్యేకత అని ప్రశంసించారు. **'చీకటి గదులు'** అసంపూర్తిగా మిగిలినా, అది ఆయన తాత్త్విక అన్వేషణను సూచిస్తుందన్నారు. ఆయన అకాల మరణం సాహిత్య లోకానికి తీరని లోటు అంటారు బుచ్చిబాబు.

తన కవిత్వం ద్వారా తెలుగు పాఠకులకు అమృతపు రుచిని, సామాజిక వాస్తవికతలకు దృశ్యమానమైన కథలను అందించిన కవి, కథకుడు దేవరకొండ బాలగంగాధర తిలక్. ఆయన రచనలు సాహిత్యంలో ఆధునికతను సాంప్రదాయ భావ సౌందర్యంతో సమ్మిళితం చేసి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. బుచ్చిబాబు **'కథకుడు కవి బాలగంగాధర తిలక్'** వ్యాసంలో కవిగా, రచయితగా తిలక్ ను అంచనా వేస్తారు. ఆయన వ్యక్తిత్వంలోని మానసిక స్వేచ్ఛ, నిజాయితీ, జీవితాన్ని సమగ్రంగా అవలోకించే దృష్టి ఆయన రచనల్లో స్పష్టంగా కనిపిస్తాయని విశ్లేషిస్తారు. తిలక్ రచనలన్నీ చదవలేదని నిజాయితీగా చెప్తూనే, చదివిన కొద్ది రచనలూ తనను ఆకర్షించాయంటారు. ఆయన సంభాషణలో, రచనల్లో స్వలాభాపేక్షలేని స్వేచ్ఛాబద్ధమైన కౌతూహలం, తృష్ణ కనబడుతాయని అంటారు. స్వేచ్ఛ, నిబద్ధత రెండు విరుద్ధాంశాలైనా ఒక స్వేచ్ఛాబద్ధ మైన కుతూహలం, తృష్ణ, కవి దేవరకొండ బాలగంగాధర్ ప్రత్యేకత అంటారు. నిర్బంధాల్లేకుండా జీవితాన్ని సమగ్రంగా పరిశీలించి, మానసిక స్వేచ్ఛతో సత్యాన్ని అన్వేషించినవాడు కావడంవల్లే తిలక్ రచనల్లో కొత్తదనం, చురుకుదనం, స్పష్టత కనిపిస్తాయని బుచ్చిబాబు అభిప్రాయం. తిలక్ రచనలు సమాజంలోని మార్పులు, సంస్థలపై విమర్శలను అప్రయత్నంగా వ్యక్తం చేస్తాయి, అయితే అవి వ్యక్తిగత ద్వేషం నుండి పుట్టినవి కావని అంటారు. ఆయన విమర్శలు స్వీయ క్షోభల ఫలితంగా కాక, సమాజాన్ని తనదిగా భావించే బాధ్యతతో వచ్చినవి అంటారు. తిలక్ గద్య కావ్యం, ముఖ్యంగా **'వానలో నీతో'**, **'ప్రవహ్లిక'** వంటి రచనలు, సహజ సౌందర్యం, ఖగోళ శాస్త్రం, ప్రాచీన నాగరికతలతో సంబంధం కలిగి ఉంటాయని, సామాన్యమైన భావాలను అసాధారణ ఉపమానాలతో వ్యక్తం చేసే శైలీ విశిష్టత తిలక్ అభివ్యక్తి ప్రత్యేకతను విశ్లేషిస్తారు.

**'అరటితోట నడుంచుట్టి కాలువ ఏటవాలుగా మలుపు తిరిగింది**
**నారికేళ వనాంతాన ప్లాటినమ్ సంకేతంలా మెరుపు మెరిసింది!**
**వానలో కానలో నాకు అవిరామ ప్రాచీనత స్ఫురిస్తుంది**
**బాబిలోనియన్, ఈజిప్టు నాగరికతా స్తూపాల నీడలలో ప్రాణప్రియా!**
**మన మిరువురం మధువు సేవించినట్లు గుర్తుకొస్తుంది'**

అన్న **'వానలో నీతో'** కవితాపంక్తులను ఉదహరిస్తూ పాత – కొత్తలు, సంప్రదాయం–ఆధునికత్వం, ప్రాక్ పాశ్చాత్య విలువల సమ్మేళనం చేత ఏర్పడిన కవి తార్కిక దృష్టిని ఆవిష్కరిస్తారు. కవి ప్రస్తావించిన ప్రాచీన నాగరికతలగురించి చదివిన వారికి పద్యంలోని అంతరార్థం, కవి భావన స్పష్టంగా గోచరమవుతాయని అంటారు. తిలక్ గద్యకావ్యం కనబడితే ఒకసారి చదివి వదిలివేయక ముందుముందు చదివే అవసరం రావొచ్చని వదిలంగా దాచుకుంటానని తనలోని చదువరి లక్షణాన్ని వ్యక్తం చేస్తారు.

తిలక్ కథలు, ముఖ్యంగా **'దొంగ'**, సాహిత్య గుణంతో, శాశ్వతమైన విలువలతో నిండి ఉంటాయి. **'దొంగ'** కథలో గోపాలం




అనే దొంగ, ఒక భార్య గొలుసును రక్షించి, ఆమె భర్తను హెచ్చరించడం ద్వారా మానవీయతను చాటుతాడు. ఈ కథలోని వీధుల వర్ణన, **'ఇల్లు ముడుచుకున్న తాబేలు'**లా ఉన్నాయనే ఉపమానం, రచయిత ఊహాశక్తిని, చూపును తెలియజేస్తాయని అంటారు. కథలోని మానవీయత, శైలీ ఔన్నత్యాన్ని గుర్తిస్తూనే, గోపాలం మనస్తత్వ వర్ణనలో కొన్ని వైరుధ్యాలు, యాసలో అస్థిరత వంటి స్వల్ప లోపాలను సునిశితంగా ఎత్తి చూపుతారు. తిలక్ రచనలు సమాజం, మానవ ప్రకృతితో సంబంధం కలిగి, పాఠకుడిలో ఆలోచనను రేకెత్తిస్తాయంటూ ప్రశంసిస్తారు.

బుచ్చిబాబు వ్యాసాలు తెలుగు సాహిత్యంలో చలం, బాపిరాజు, కృష్ణశాస్త్రి, గోపీచంద్, తిలక్ వంటి కథకులు, కవుల సృజనాత్మకతను, సామాజిక దృక్పథాన్ని సమయస్ఫూర్తితో విశ్లేషిస్తాయి. బుచ్చిబాబు వ్యాసాలు ఆయా రచయితల, కవుల రచనల్లోని మానవీయత, తాత్త్విక గాఢత, సౌందర్యాన్వేషణను పాశ్చాత్య సాహిత్యంతో తులనాత్మకంగా పరిశీలిస్తూ, ఆధునికత, సంస్కరణల ప్రభావాన్ని స్పష్టం చేస్తాయి. చలం స్త్రీవాద ఆలోచనలు, బాపిరాజు సౌందర్య దృక్పథం, కృష్ణశాస్త్రి భావోద్వేగ కవిత్వం, గోపీచంద్ తాత్త్విక వాస్తవికత, తిలక్ ఆధునికత సంప్రదాయాల సమన్వయం వంటి అంశాలను బుచ్చిబాబు విస్తృతంగా చర్చించారు. తెలుగు సాహిత్యంలో ఈ రచయితలు చూపిన విప్లవాత్మక మార్పులను, వారి శైలీ వైవిధ్యాన్ని బుచ్చిబాబు వ్యాసాలు సమగ్రంగా విశ్లేషించాయి. బుచ్చిబాబు దృష్టికోణంలోంచి ఆయా రచయితల సాహిత్య విలువలను, సమాజంపై వాటి ప్రభావాన్ని అంచనా వేస్తాయి. ఈ వ్యాసాలు పాఠకులకు లోతైన అవగాహనను అందించడమే కాక, తెలుగు సాహిత్య ఔన్నత్యాన్ని భావితరాలకు రిఫరెన్సుగా నిలబడతాయి. బుచ్చిబాబు సాహిత్య విమర్శ వర్తమాన విమర్శకులకు ఒక తాత్త్విక దీపంలా వ్యాఖ్యాన మార్గాన్ని సూచిస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. కృష్ణశాస్త్రి కవిత్వం: సౌందర్యతత్త్వం– డా. సీతారామయ్య, రామసూరి

2. యువభారతి 'చలం ఆలోచనలు'

3. గోపీచంద్ సాహిత్యం– త్రిపురనేని సుబ్బారావు.

ISSN 2457-0796


# ఐతరేయోపనిషత్తు (ముత్యాల సరాలలో...)

జక్కని వేంకటరాజం

(గత సంచిక తరువాయి భాగం)

**తృతీయ ఖండము**

ఈ విధమ్ముగ పరమ పురుషుడు
లోకములు మరి లోకపాలకు
లందరిని సృజియించి వారల
కన్నమును సృష్టించదలచెను

ఇట్లు దలచియు పరమపురుషుడు
జలమునే తప్తమ్ము జేయగ
ఆకృతొక్కటి కలిగెనది ఘన
రూపమందున ఉన్న అన్నము

అన్నమే దూరమున నుండగ
ఆదిలో సృష్టించబడిన – పు
రుషుడు దానిని వాక్కుతోడ గ్ర
హించదలచి అశక్తుడాయెను

వాక్కు చేత గ్రహించగలిగిన
చాలునని భావించి యుండగ
అదియు సాధ్యము కానిదయ్యెడు
వాక్కు తృప్తిని పొందదయ్యెడు

పిదప ఘ్రాణేంద్రియము చేత గ్ర
హింపజూచెను; అదియు సాధ్యము
గాక యుండెను; సాధ్యమైనచొ
మూర్కొనుటచే తృప్తి కలుగును

పిదప నేత్రేంద్రియము తోడ గ్ర
హింపజూచెను; అట్లు సాధ్యం
బైనచో అన్నమును చూడగ
భక్షకునికే తృప్తి కలుగును

చెవులతోడను తినగ జూచెను
కాని సాధ్యం గాక యుండెను
అట్లయినచో 'అన్న' మను శ
బ్దమ్ము వినగనె తృప్తి గలుగును

తినగజూచె త్వగింద్రియముతో
కాని సాధ్యము గాకయుండెను
అట్లయినచో అన్నమును స్ప
ర్శించి నంతనె తృప్తి కలుగును

మనసు తోడను తినగ జూచెను
కాని సాధ్యము గాక యుండెను
అట్లయినచో అన్నమును ధ్యా
నించి నంతనె తృప్తి గలుగును

అన్నమును జననేంద్రియముతో
తినగదలచి అశక్తుడాయెను
అట్లు సాధ్యము అయినచో – అ
న్నమును త్యజించి తనివి జెందును.

ముఖము నుండియె లోనికి పోవు
వాయువుతో గ్రహించదలచెను
అందువలన అపానవాయువు
అన్నమునే గ్రహించగలిగెను

అన్నగ్రాహకమైన వాయువు
ప్రాణము గలది; ఇట్టి వాయువు
చక్కగా పని చేయుచుండిన
దేహమందున జీవముండును

వాక్కుచేతను చెప్పబడినను
ఘ్రాణమే మూర్కొనుచు నున్నను
కనుల చేతనె చూడబడినను
చెవుల చేతనె వినుచు నున్నను –

త్వక్కు చేతను తాకబడినను
మనసుచే ధ్యానించియును, అ
పానము చేత తినుచునుండిన
శిశ్నము విసర్జించుచున్నను –

'ఇట్టి కార్యము లన్నియును నా
వలననే నెలకొాయునున్నవి
నేను లేక శరీర మెట్టుల
ఉండగలద'ని తలచి జీవుడు –

దేహమున చేరంగ దలచియు
'మార్గములు రెండున్నవందున
ఎట్టి మార్గము నుండి చేరా?
లనుచు ఆలోచించ సాగెను

శిరసునే ఛేదించి జీవుడు
అట్టి ద్వారము నుండి దేహము
నందు చేరెను; అది 'విదృతి'గ ప్ర
సిద్ధి చెందెను; దానినే ఆ–

నంద ద్వారముగా వచింతురు
మూడు స్థలములు గలవు జీవుడు
దేహమందు వసించుటకునై
మూడవ స్థల యందు నుండును.

జాగృతుడైనట్టి మనుజుం
డాత్మ జ్ఞానము పొంది యుండియు
అన్ని ప్రాణుల సమముగా – ద
ర్శించుచుండును; అతడు తన కభి–

ముఖముగా ఈ జగము నందున
పూర్ణ పురుషుని, వ్యాపకుండై
యున్న బ్రహ్మము గాంచి ఆశ్చ
ర్యమ్ము చెందుచు చూచుచుండును.

చూచియెంతో సంతసించును
నామ 'మిదంద్ర'మనియు పరోక్ష
నామము 'ఇంద్ర' మనియు బ్రహ్మము
నకును రూఢిగ చెప్పగలుగును
ప్రథమాధ్యాయము సమాప్తము

(సశేషం)

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2025

# ప్రబంధ కవుల చాటుపద్య చమత్కృతి

**డా. బోయినిపల్లి ప్రభాకర్,** తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ధర్పల్లి, నిజామాబాద్.
ఫోన్ : 9490901050

**"భారతములో బీజప్రాయముగ, ఎఱ్ఱనలో అంకురప్రాయముగ, సోమన్నలో మొలకగ పొడచూపిన ప్రబంధలత శ్రీనాథుని చేతిలో కొనలు సాగి, చిగిర్చి మారాకు వేసినది. అది పుష్ప ఫల సమన్విత మగుట రాయల కాలములో – మనుచరిత్రమే ఆ లత పూచిన తొలిపూవు పండిన తొలిఫలము"**[1] అని పింగళి లక్ష్మీకాంతం గారు తెలుగు ప్రబంధ అవతరణ సారాంశాన్ని గురించి సంక్షిప్త సుందరంగా తెలియజేశారు. శ్రీకృష్ణదేవరాయల కాలం (16 వ శతాబ్దం) కంటె ముందుగానే తెలుగు సాహిత్యంలో ప్రబంధ శబ్దం వినిపించినప్పటికీ, పద్యరచనా వైపుణ్యం, రస పోషణ, అలంకార వర్ణనలు, వ్యంగ్య వైభవం, కావ్య శిల్ప మర్యాద, ఔచిత్య స్ఫూర్తి, కావ్యగుణాలు, కవితా చమత్కృతి మొదలైన ప్రబంధ లక్షణాలు పురాణేతిహాసాలు, కావ్యాలందు అప్పుడప్పుడూ కనిపించినప్పటికీ, ప్రబంధ లక్షణా లన్నింటిని (వస్త్వైక్యం, ఏకనాయకాశ్రయం, రసాధిక్యత (శృంగార రస ప్రాధాన్యత), నాటకీయత, అష్టాదశవర్ణనల ప్రాధాన్యత, ఆలంకారిక రచన, స్వతంత్ర రచన మొదలైనవి) పుణికి పుచ్చుకున్న అనేక రచనలు వచ్చి ఒక ప్రత్యేక ప్రక్రియా రూపంగా విలసిల్లింది మాత్రం క్రీ.శ.16 వ శతాబ్దానికి చెందిన ప్రబంధయుగంలోనే అని రూఢిగా చెప్పవచ్చు.

సాహితీ సమరాంగణ సార్వభౌమ, ఆంధ్రభోజ బిరుదాంకితుడైన శ్రీకృష్ణదేవరాయలు (క్రీ.శ. 1509 – 1530) సాహిత్య / విద్యా వినోదాలను సలిపిన సభా భవనం పేరు 'భువనవిజయం'. అందులో ఎనిమిది దిక్కులలో ఎనిమిది సింహాసన పీఠికలను ఏర్పరచి వాటి మీద ఎనిమిది మంది కవిశ్రేష్టులను ప్రతిష్ఠించి సాహిత్యగోష్ఠి నిర్వహించేవాడని ప్రతీతి. ఆ ఎనిమిదిమంది కవులే అష్టదిగ్గజాలుగా ప్రసిద్ధి పొందారు. వారిలో అల్లసాని పెద్దన, నందితిమ్మన, ధూర్జటి, మాదయగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు, తెనాలి రామకృష్ణుడు రాయల ఆస్థానంలో అష్టదిగ్గజాలలో ఉన్నారని అనేకమంది పరిశోధకుల నిశ్చితాభిప్రాయంగా కనబడుతున్నది.[2] అలాగే భట్టుమూర్తి (రామరాజ భూషణుడు), పింగళి సూరనలు స్థూలంగా అష్టదిగ్గజాలలో చెలామణి అయ్యారు కాని సూక్ష్మంగా పరిశీలిస్తే రాయల తర్వాతి కాలం అనగా క్రీ.శ.1550 తర్వాత ప్రబంధకవులుగా లబ్ధ ప్రతిష్టులయ్యారని తెలుస్తున్నది.[3] ఇంకా మొదటి కందుకూరి రుద్రకవి, చింతలపూడి ఎల్లనలను కూడా ప్రముఖ పరిశోధకులు వేటూరి ప్రభాకరశాస్త్రి, నిడదవోలు వేంకటరావు, నేలటూరి వేంకట రమణయ్య ప్రభృతులు అష్టదిగ్గజ కవులలోని వారుగా వారి పరిశోధనల్లో నిర్ణయించారు.[4]



శ్రీకృష్ణదేవరాయల పాలనా కాలం క్రీ.శ. 16 వ శతాబ్దం (క్రీ.శ. 1509–1530) తెలుగు కవిత్వానికి స్వర్ణయుగం అని చెప్పవచ్చును. అప్పటి వరకున్న కవులందరూ సంస్కృత సాహిత్యంలోని ఇతిహాస, పురాణ, కావ్యాలను తెలుగులోకి స్వతంత్రానువాద రూపంలో తీసుకొచ్చి తెలుగు సాహిత్య వికాసానికి గొప్ప ప్రారంభాన్ని ఇచ్చారు. దాన్ని ఆసరాగా చేసుకొని 16వ శతాబ్దపు కవులు – శ్రీకృష్ణదేవ రాయలు మొదలుకొని అష్టదిగ్గజాది కవులందరు స్వతంత్ర కావ్య నిర్మాణానికి పూనుకున్నారు. ఇతిహాస, పురాణ, కావ్యాలలోని ప్రసిద్ధమైన చిన్న కథను తీసుకొని లేదా కల్పిత కథను అల్లుకుని, రచనలో ప్రత్యేక లక్షణాలను (వస్త్వైక్యం, ఏకనాయకాశ్రయం, శృంగార రస ప్రాధాన్యత, అష్టాదశ వర్ణనలతోడి రచన, నాటకీయత, ఆలంకారిక రచన, స్వతంత్ర రచన మొదలైనవి) నిర్ణయించుకొని ప్రబంధాలుగా పిలవబడే రచనలు చేసి తెలుగు సాహిత్య చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించారు. విజయనగర రాజుల కాలంలో భోగ పరాయణత్వం అధికంగా ఉండడం వల్ల ఆనాటి రాజులు, సామంతులు, ఉద్యోగులు శృంగారరస ప్రధానమైన ప్రబంధ రచనకు కవులను ప్రోత్సహించారని తెలుస్తున్నది.[5] తద్వారా ప్రబంధ రచనలో... వర్ణనలకు, ఊహాశక్తికి, పాండిత్య ప్రకర్ష ప్రకటనకు, భాషా వైచిత్రి ప్రదర్శనకు కవులకు మంచి అవకాశం, స్వేచ్ఛ లభించింది. ఈ క్రమంలో శ్రీకృష్ణదేవరాయలు **'ఆముక్త మాల్యద'**ను, అల్లసాని పెద్దన **'మను చరిత్ర'**ను, నంది తిమ్మన **'పారిజాతాపహరణము'**ను, ధూర్జటి **'శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము'**ను, మాదయగారి మల్లన **'రాజశేఖర చరిత్ర'**ను, అయ్యలరాజు రామభద్రుడు **'రామాభ్యుదయము'**ను, తెనాలి రామకృష్ణుడు **'పాండురంగ మాహాత్మ్యము'**ను, భట్టుమూర్తి **'వసుచరిత్ర'**ను, పింగళి సూరన **'కళాపూర్ణోదయము'** మొదలైన ప్రబంధాలు రచించి తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు.

అల్లసాని పెద్దనాది ప్రబంధకవులు ప్రబంధ రచనతో పాటు కొన్ని ప్రత్యేక సందర్భాలలో, తమకు కల్గిన విశేషానుభవాలను,

చూసిన రమణీయ దృశ్యాలను చమత్కారంగా అప్పటికప్పుడు సమయస్ఫూర్తితో పద్యాల రూపంలో చెప్పి చాటు పద్య పరిమళాలను వెదజల్లారు. వాటిలో అప్పటి విషయాలే ప్రధానంగా ఉండి, కవి జీవిత విశేషాలు, ఆనాటి చారిత్రక, సామాజిక విషయాలు విశేషంగా ప్రకటించబడేవి. ప్రబంధ కవుల చాటుపద్య చమత్కృతిని తెలుసుకునే ముందుగా చాటువు అంటే ఏమిటో, వాటి లక్షణాలను తెలుసుకుందాం.

చాటువు అనే పదం 'చాటు' అనే సంస్కృత ధాతువు నుండి వచ్చింది. చాటువు అనే మాటకు ప్రియమైన మాట, ఇచ్చకపు మాట, స్తుతి వాక్యం అనే అర్థాలు ఉన్నాయి. **"చాటువు అంటే ప్రియమైన మాట. ఇది అచ్చమైన సంస్కృత శబ్దం. మన వాళ్ళలో కొందరు ఈ శబ్దాన్ని చదర, చాప అన్న ధోరణిలో ముచ్చటగా ఉచ్చరిస్తుంటారు. ఈ శబ్దం తెలుగు భాషలో ఎంత బాగా జీర్ణమైపోయిందో దీనిని బట్టి తెలుస్తుంది. చాటు పద్యమంటే కవి సరదాగా చెప్పిన పద్యమన్నమాట. ఒక భోగి చేత సత్కరింపబడినప్పుడో, ఒక లోభి చేత సీత్కరింప బడినప్పుడో, అందమైన దృశ్యం కనబడినప్పుడో, డెందం గాయపడినప్పుడో, అనిష్టం తొంగి చూసినప్పుడో, హాస్యం లాస్యం చేసినప్పుడో అనేక సందర్భాల్లో చిత్రమైన చిత్తవృత్తుల్లో ఛందోరూపంలో జుమ్మని చిమ్ముకొని వచ్చే కవితా రూపాలే చాటుపద్యాలు"**[6] అని సి. నారాయణరెడ్డి గారు చక్కగా నిర్వచించారు. దీనిని బట్టి చాటువులు ప్రణాళికాబద్ధమైన రచనలు కావని, సందర్భానుగుణంగా ఉత్తేజిత భావోద్వేగంలో కవి హృదయం నుండి జాలువారే అక్షర ఝరి అని తెలుస్తుంది. సామెతకు ఉండే సంక్షిప్తత, జనప్రియత్వం, సూటిదనం, స్ఫూర్తి, ప్రాచుర్యత, చమత్కారం చాటువులు కూడా కల్గి ఉన్నాయి. చాటు పద్యాలు మౌఖిక సాహిత్య పరిధిలోనికి వస్తాయి. **"తీరు తీయములు గల భాషావాహిని యందు సుకవుల కవితామృతము ప్రబంధరూపమున కాక చాటు రూపమునను జాలువాఱును. వీనులకు విందులై డెందమును దనుపార్చుచుఁ జాటు రచనములొక్కొక్క యెడఁ బ్రబంధ రచనముల సయితము మీఱియుండునని చెప్పుట భాషావేదుల కనుభవ పునరుక్తమగును. గ్రంథములుగా నేర్పడమిచేఁ దొల్లింటి యాంధ్ర కవీశ్వరులు రచించిన చాటు పద్యములెన్నేని యునికి తప్పినవి?"**[7] అని వేటూరి ప్రభాకరశాస్త్రి గారు చాటుపద్యాల గొప్పతనాన్ని, అవి సంతరించుకున్న ప్రత్యేకతను తెలియజేశారు. వేటూరివారి మాటలను బట్టి 11వ శతాబ్దానికి (నన్నయకు) పూర్వమే చాటు పద్యాలున్నాయని, కానీ అని గ్రంథస్థం కాకపోవడం వల్ల చాలవరకు అంతరించాయని అర్థమౌతుంది. తెలుగు సాహిత్య క్షేత్రంలో ఇప్పుడు లభిస్తున్న వందలాది చాటుపద్యాలు సి.పి. బ్రౌన్, వేటూరి ప్రభాకర శాస్త్రి (చాటు పద్య మణి మంజరి), దీపాల పిచ్చయ్య శాస్త్రి (చాటు పద్య రత్నాకరం) గారల విశేష పరిశోధన, సేకరణ కృషిల ఫలితమే అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

చాటు కవిత్వానికి ప్రాచీన కాలం నుండే అధిక ఆదరణ ఉన్నట్లు తెలుస్తున్నది. కూచిమంచి జగ్గకవి, పింగళి సూరన లాంటి ఎంతోమంది కవులు తాము చాటుకవులమని చాటుకున్నారు. ఎంతోమంది లాక్షణికులు తమ లక్షణగ్రంథాల్లో ప్రామాణికత కొరకు చాటువులను ఉదహరించారు. సకలనీతి సమ్మతం, ప్రబంధ మణి భూషణం లాంటి సంకలన గ్రంథాల్లోను చాటువులు ఉదహరించబడ్డాయి. అయితే విన్నకోట పెద్దన, అనంతామాత్యుడు, అప్పకవి, మొల్ల, పింగళిసూరన, కూచిమంచి జగ్గకవి మొదలైన వారు ప్రస్తావించిన చాటు ప్రబంధాలకు, ఈనాడు చాటువులుగా చెప్తున్న వాటికి స్పష్టమైన భేదం ఉందని ఆచార్య సంగనభట్ల నరసయ్యగారు తెలిపారు.[8] అలాగే చాటుపద్యాలు 1.ముక్తక లక్షణం 2.ఆశు జన్యత 3.సంఘటన, సందర్భాన్ని బట్టి పుట్టడం 4.లఘు రూపం 5. చాటువు నేపథ్యం తోడి కథ చెప్పడం 6. కర్తృత్వ నిర్ధారణ కష్టం 7. కర్త జీవిత అనుభవాల వెల్లడి అనే లక్షణాలను కల్గి ఉంటాయన్నారు.[9] ఇక ప్రబంధ కవుల కంటె ముందుగానే వేములవాడ భీమకవి, శ్రీనాథుడు, పోతన మొదలైన కవి పండితాగ్రేసరులు వారి చాటు పద్యాలతో తెలుగు సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులుగా కనబడుతున్నారు.

**ప్రబంధ కవుల చాటుపద్య చమత్కృతి**

**అల్లసాని పెద్దన :** అల్లసాని పెద్దన శ్రీకృష్ణదేవరాయల ఆస్థానకవి. రాయలకు ఆంతరంగికుడు కూడా. 'మనుచరిత్ర' అనే ప్రబంధాన్ని రచించి రాయలకే అంకితమిచ్చిన అష్టదిగ్గజ కవీశ్వరుడు. భువన విజయ మంటపంలో పెద్దన ఒక పెద్దదిక్కుగా భాసిల్లేవాడు. శ్రీకృష్ణదేవరాయలు ఒకసారి కవిత్వం చెప్పుమనగా, పెద్దన సమాధానముగా..

**"నిరుపహతి స్థలంబు రమణీ ప్రియదూతిక తెచ్చియిచ్చు క**
**ప్పుర విడె, మాత్మకింపయిన భోజనముయ్యెల మంచమెప్పు త**
**ప్పరయు రసజ్ఞులూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్**
**దొరికిన గాక, యూరక కృతుల్ రచియింపుమటన్న శక్యమే"**

అని చమత్కారంగా చాటుపద్యాన్ని చెప్పాడు. ఈ పద్యం ఆనాడు రాజాశ్రితులైన కవుల / అష్టదిగ్గజ కవుల భోగలాలస జీవితాన్ని విశద పరుస్తున్నది. రాయలు కవులను గొప్పగా ఆదరించి, పోషించిన విషయం స్పష్టమవుతుంది.

'భువన విజయము'లో ఒకనాడు రాయలు బంగారు పళ్ళెరంలో గండ పెండేరాన్ని తెప్పించి సంస్కృతాంధ్రాలలో సమానంగా కవిత్వం చెప్పగలవారు బహుమతిగా అందుకోండి అని చెప్పగా సభ్యులందరు / కవులందరు ఏమీ మాట్లాడకుండా మిన్నకుండి పోయారట. దీనికి శ్రీకృష్ణదేవరాయలు ఆశ్చర్యపడి –

**"ముద్దుగ గండపెండెరమునుం గొనుడంచు బహూకరింపగా**
**నొద్దిక 'నాకొసంగ' మని యొక్కరుఁ గోరగలేరు లేరొకో?"**

అని సగం పద్యం చెప్పగా, వెంటనే పెద్దన లేచి

**"పెద్దన బోలు పండితులు పృథ్విని లేరని నీవెఱుంగవే?**
**పెద్దన కీదలంచినను, బేరిమి నాకిదు కృష్ణరాణ్ణృపా!"**

అని మిగిలిన సగం పద్యాన్ని జవాబుగా చమత్కారంగా పూరించాడు. భువనవిజయ సభాసదులందరు 'ఔనౌనని' తలలూపగా పెద్దన కవిత్వ లక్షణాన్ని ఆశువుగా...

**"పూత మెఱుంగులుం బసరు పూప బెడంగులుఁ జూపునట్టి వా**
**కైతలు? జగ్గు నిగ్గునెనగావలెఁ గమ్మన గమ్మ నన్వలెన్**
**రాతిరియున్ బవల్ మఱపురాని హొయల్ చెలియార జంపుని**
**ద్దాతరి తీపులో యనగఁ దారసిలన్వెలె లోఁ దలంచినన్**
**..........................................................**
**............................................ మనోహర**
**ద్యోతక గోస్తనీ ఫల మధు ద్రవ గోఘృత పాయస ప్రసా**
**దాతి రస ప్రసార రుచిర ప్రసరంబుగ సారె సారెకున్"**

ముప్పై పాదాల ఉత్పలమాలికను[10] చాటువుగా చెప్పగానే రాయలు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బై స్వయంగా గండపెండేరాన్ని, పెద్దన కాలికి తొడిగినాడు. ఈ విషయాన్ని పెద్దన –

**"ఎదురైనచో దన మద కరీంద్రము డిగ్గి ..." చాటువులోని**
**"బిరుదైన కవి గండపెండేరమున కీవ / తగుదని తానె పాదమున దొడిగె"** గా చెప్పాడు.

శ్రీకృష్ణదేవరాయలు మరణించిన తర్వాత పెద్దన ఇంకా కొన్నేళ్ళు జీవించి ఉన్నాడు. కాని రాయల ప్రభువు లేని తాను జీవచ్ఛవంలాగా బతుకుతున్నానని, రాయల వారి ఔదార్యం కారణంగా తాను గడిపిన మహోత్కృష్ట జీవితాన్ని గుర్తుచేసుకుంటూ పెద్దన కింది చాటుపద్యాన్ని, ఎంతో హృద్యంగా చెప్పాడు.

**"ఎదురైనచో దన మద కరీంద్రము డిగ్గి**
**కేలూత యొసగి యెక్కించుకొనియె**
**మనుచరిత్రంబందుకొనువేళఁ బురమేగఁ**
**బల్లకిఁ దనకేలఁ బట్టి యెత్తె**
**'గోకట' గ్రామ్యాద్యనేకాగ్రహారంబు**
**లడిగిన సీమలయందునిచ్చె**
**బిరుదైన కవి గండపెండేరమున కీవ**
**తగుదని తానె పాదమున దొడిగె**
**ఆంధ్రకవితా పితామహ! అల్లసాని**
**పెద్దన కవీంద్ర! యని తన్ను బిల్చునట్టి**
**కృష్ణరాయలతో దివికేగలేక**
**బ్రదికి యున్నాడ జీవచ్ఛవంబు నగుచు"**

పై చాటు పద్యం – పెద్దన చాటుపద్యహారంలో మణిపూసలాగ మెరిసిందని చెప్పవచ్చు.

**"రాయ రాహుతి మిండ రాచయేనుగు వచ్చి**
**యారట్ల కోట గోరాడునాడు.........**
**...............................................**
**...............................................**
**కన్నడం బెట్లు సొచ్చెదు గజపతీంద్ర**
**తెఱచి నిలు కుక్క సొచ్చిన తెలుగు దోప"**

శ్రీకృష్ణదేవరాయలు మరణించిన తర్వాత విజయనగర సామ్రాజ్యం పైకి గజపతిరాజు దండెత్తిరాగా ఉద్వేగంతో పెద్దనపై సీస చాటుపద్యాన్ని రాసి పంపగా, గజపతిరాజు అది చదివి సిగ్గుపడి వెనుతిరిగి పోయాడని చెప్తుతారు. పెద్దనకు రాయల మీద గల ప్రేమాభిమానాలకు పై చాటు పద్యం ఒక మచ్చుతునక.

**నంది తిమ్మన :** నంది తిమ్మన శ్రీకృష్ణదేవరాయల భార్యయైన తిరుమల దేవితో గజపతుల నుండి రాయల ఆస్థానానికి అరణంగా వచ్చిన కవియని పరంపరగా ప్రచారంలో ఉన్న ఐతిహ్యాన్ని బట్టి తెలుస్తున్నది. పెద్దనలాగే తిమ్మన కూడ తన 'పారిజాతాపహరణ' ప్రబంధాన్ని రాయలకే అంకితమిచ్చాడు. అలాగే రాయల వారిచే విశేషంగా ఆదరించబడి, ఘన చతురంతయాన మహాగ్రహార సన్మానాలను పొందాడు. నంది తిమ్మనకే ముక్కుతిమ్మన అనే పేరు మరింత ప్రసిద్ధిని ఆపాదించింది. ఈ కవి ముక్కుపై రాసిన చాటువు కారణంగా అలా పేరు వచ్చిందని చెప్తుతారు.

**"నానా సూన వితాన వాసనల నానందించు సారంగ మే**
**లా నన్నొల్లదటంచు గంధఫలి బల్కాకం దపంబంది యో**
**షా నాసాకృతి దాల్చి సర్వ సుమనస్సౌరభ్య సంవాసియై**
**పూనెం బ్రేక్షణ మాలికా మధుకరీ పుంజంబులిర్వంకలన్"**

ఈ పద్యం చాటువు రూపంలోనే కాకుండా వసుచరిత్రలో కూడా కలదు. గిరిక సర్వావయవ సౌందర్య వర్ణనములో నాసిక వర్ణనకు ఈ పద్యముంటే బాగుంటుందని భట్టుమూర్తి, నంది తిమ్మనకు ధనాన్నిచ్చి ఈ పద్యాన్ని కొనుక్కున్నాడని ఒక గాథ కలదు. దానిలో వాస్తవమెంత ఉన్నదో కాని నంది తిమ్మనకు ముక్కుతిమ్మన అనే పేరు చాటువులలో స్థిరమై ఉన్నదని కింది చాటు పద్య ఉదాహరణల ద్వారా చెప్పవచ్చు.

1. **"ఆరవి వీరభద్రు చరణాహతి..."**[11]
2. **"ముక్కు తిమ్మరాట్ క్రూర పదాహతి..."**
3. **"అల్లసాని వాని అల్లిక జిగిబిగి**
**ముక్కుతిమ్మనార్యు ముద్దు పలుకు**
**పాండురంగ విభుని పద గుంఫనంబును**
**కాకుమాను రాయ నీకె తగును"**[12]

అలాగే నంది తిమ్మన రచించిన రెండు చాటు పద్యాలు అప్పకవీయంలో లభ్యమౌతున్నాయి. అవి

**1. "రాయ గ్రామణి కృష్ణరాయ భవదుగ్ర క్రూర ఖడ్గాహిచే..." (అప్పకవీయం 1-69)**

**2. "ఇప్పటి దాతల సరిగా...."[13] (అప్పకవీయం 3-222)**

**అయ్యలరాజు రామభద్రుడు :** అయ్యలరాజు రామభద్రుడు రాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాలలో ఒకడని ప్రతీతి. ఈ కవి 'రామాభ్యుదయం' అనే ప్రబంధాన్ని రచించి గొబ్బూరి నరసరాజుకు (క్రీ.శ 1560-70) అంకితమిచ్చాడు. ఇతడు గుత్తి యప్పలరాజును ప్రశంసినస్తూ రాసిన ఒక చాటుపద్యం అప్పకవీయంలో లభ్యమౌతున్నది. అది -

**"రాజమనోజా! విద్యా**
**భోజా! దీనార్థి కల్పభూజా! రిపు సం**
**జ్ఞాజా! వైభవ విజిత బి**
**డౌజా! రవితేజ ! గుత్తియప్పల రాజా!"** రాయల కాలంలో 'సకల కథాసార సంగ్రహం' రచించిన పుత్తేటి రామభద్రుడే అష్టదిగ్గజాలలోని రామభద్రుడు కావచ్చునని, అయ్యలరాజు రామభద్రుడు అష్ట దిగ్గజాలలో లేడని కూడా విమర్శకుల ఊహగా చెప్పవచ్చు.[14]

**తెనాలి రామకృష్ణుడు :** శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాలలో తెనాలి రామకృష్ణుడికి గల స్థానం గురించి సందేహాలున్నప్పటికీ, ఇతని చాటుపద్యాల వల్ల, రాయల సమకాలికుడిగా విశేష ప్రాచుర్యం పొందాడు. ఇతడు 'పాండురంగ మాహాత్మ్యం' అనే ప్రౌఢ ప్రబంధాన్ని రచించి విరూరి వేదాద్రి మంత్రికి అంకితమిచ్చాడు. 'ఉద్భటారాధ్య చరిత్ర'ను రాయల సమకాలికుడైన నాదిండ్ల గోపమంత్రికి (క్రీ.శ. 1515- 1525) ప్రధానోద్యోగియైన ఊరదేచ మంత్రికి అంకితమిచ్చాడు. ప్రారంభంలో శైవునిగా ఉన్న తెనాలి రామలింగడు వైష్ణవాన్ని స్వీకరించి రామకృష్ణుడుగా మారి తన వాక్ చమత్కారశక్తితో, తార్కికవాద నైపుణ్యంతో నిర్భయంగా ప్రవర్తిస్తూ; అధిక్షేపాత్మకమైన, హాస్య పూరితమైన సంభాషణా చాతుర్యంతో రాయల మనసులో స్థానం సంపాదించి, రాజాస్థానంలో ప్రవేశించి అష్ట దిగ్గజకవిగా ప్రసిద్ధి పొంది ఉండవచ్చు.

శ్రీకృష్ణదేవరాయలు ధూర్జటి కవిత్వాన్ని విని సంతోషంతో...

**"స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గెనో**
**యతులిత మాధురీ మహిమ..."** అని మెచ్చుకోగానే తెనాలి రామకృష్ణుడు వెంటనే లేచి -

**"............. హా ! తెలిసెన్ భువనైక మోహనో**
**ద్ధత సుకుమార వార వనితా జనతా ఘనతా పహారి సం**
**తత మధురాధరోదిత సుధారస ధారలఁ గ్రోలుటుంజుమీ!"** అని చాటుపద్య పూరణ చేశాడు. ఈ చాటుపద్యాన్ని బట్టి ధూర్జటికి వారకాంత సాంగత్యం ఉందని సూచితమౌతుంది.

తెనాలి రామకృష్ణుడికి భట్టుమూర్తితో స్పర్థ ఉన్నట్లుగా గల మత్సర గాథలన్నీ పాండిత్య స్ఫోరకాలు. భట్టుమూర్తి **"కుంజర యూథంబు దోమ కుత్తుక జొచ్చెన్"** అనే సమస్యను సభలో ఇవ్వగా రామకృష్ణుడు లేచి

**"గంజాయి తాగి తురకల**
**సంజాతల గూడి కల్లు చవిగొన్నావా?**
**లంజల కొడకా, యెక్కడ**
**కుంజర యూథంబు దోమ కుత్తుక సొచ్చెన్ "** అని పూరించాడు. రాయలకు ఈ పూరణం వ్యక్తిగత మత్సరంగా తోచి, నచ్చక రామకృష్ణున్ని తిరిగి పూరింపమన్నాడు. అప్పుడు రామకృష్ణుడు భారతార్థంలో -

**"రంజన చెడి పాండవులరి**
**భంజనులై విరటు గొల్వపాలై రకటా!**
**సంజయ! విధి నేమందును**
**కుంజరయూథంబు దోమ కుత్తుక జొచ్చెన్"** అని పలికిన చాటు పద్యానికి రాయలతో పాటు అక్కడి వారందరూ సంతోషించారు.

అష్ట దిగ్గజ కవులలో భట్టుమూర్తి ఒక్కడే శూద్రకవి. రామకృష్ణుడు భట్టుమూర్తి కవిత్వాన్ని, పాండిత్యాన్ని

**"చీపర పాపర తీగలఁ**
**జేపల బుట్టల్లినట్టు చెప్పెదు నీ యీ**
**కాపుఁ గవిత్వపుఁ గూతలు**
**బాపన కవి వరుని చెవికి ప్రమదంబిడునే"**

**"కెంగేల రామకష్ణుని**
**బంగరు కడియమ్ములుండఁ బండితుడగునా?**
**జంగులు జల్లులు గల్గిన**
**సింగారపు టూరగుక్క సింగంబగునా?"**

అని విమర్శించాడు. పై చాటుపద్యాలను బట్టి నాటి సమాజంలో కుల వివక్ష ఉందని, బ్రాహ్మణాధిక్యత ఉందని అర్థమౌతున్నది.

రాయలవారు ఒకసారి **"కలనాటి ధనము లక్కఱ / గలనాటికి దాచ కమలగర్భుని వశమా?"**

అని కవుల పూరణార్థం పద్యాన్ని ఆపేశాడు. అల్లసాని పెద్దన వెంటనే లేచి **"నెల నడిమి నాటి వెన్నెల / యలవడునే గాదె వోయ నమవస నిశికిన్"** అని దృష్టాంత పూర్వకంగా పూరించాడు. 'అమవస నిశి' అనే పదానికి ఆక్షేపణగా రామకృష్ణుడు ఈ విధంగా చాటుపద్యంతో వెక్కిరించాడు.

**"ఏమితిని సెపితివి కపితము**
**భ్రమపడి వెరి పుచ్చకాయ పడిదిని సెపితో?**
**యుమెతక్కయ దిని సెమితో?**
**"యమవస నిశి" యనెడు మాట అలసని పెదనా!"** అని పై చాటుపద్యం చెప్పాడు కాని, రామకృష్ణుడికి అల్లసాని వారి మీద అభిమానం మెండుగా ఉండేది. ఈ విధంగా తెనాలి రామకృష్ణుడి కావ్యరచనా చాతుర్యానికి ఎన్నో ఉదాహరణలు చాటుపద్యాల రూపంలో స్థిరమై ఉన్నాయి.[15]

**భట్టుమూర్తి (రామరాజ భూషణుడు) :** భట్టుమూర్తి శ్రీకృష్ణదేవ రాయల ఆస్థానంలోని అష్ట దిగ్గజాలలోని వాడని ప్రతీతి. ఇతడు రాయల అల్లుడు అళియ రామరాయల (క్రీ.శ. 1543–64) ఆస్థాన కవియై, అతనిచే సత్కరింపబడి రామరాజ భూషణుడయ్యాడు. భట్టుమూర్తి 'వసుచరిత్ర' అనే ప్రబంధాన్ని రచించాడు. ఇతని మొదటి రచన నరసభూపాలీయం. ఇందులోని చారిత్రకాంశాలన్నీ క్రీ.శ. 1557కు పూర్వం జరిగినటువంటివి. అంటే నరసభూపాలీయాన్ని క్రీ.శ. 1557 తర్వాత రచించినట్లుగా తోస్తున్నది. ఆ తర్వాత కొంత కాలానికి 'వసుచరిత్ర'ను రచించాడు. కాబట్టి క్రీ.శ.1530 కి ముందే రాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాల్లోని వాడుగా చెప్పడానికి అవకాశం లేదు. పఠన, పాఠనాదులలో మను, వసుచరిత్రలు ఎంతో ప్రసిద్ధి పొందడం వల్ల భట్టుమూర్తిని కూడ అష్ట దిగ్గజాలలో కలిపి చెప్పియుండవచ్చు.[16]

భట్టుమూర్తి తిమ్మరుసును ప్రశంసిస్తూ...

**"అయ్య యనిపించు కొంటివి**
**నెయ్యంబున గృష్ణరాయ నృప పుంగవుచే**
**నయ్యా నీ సరి ఏరీ**
**తియ్యని విలుకాడవయ్య! తిమ్మరుసయ్యా"** అనే చాటు పద్యాన్ని చెప్పాడు.

భట్టుమూర్తిని ఎవరో బాగా బాధపెట్టారు. సాత్త్వికుడైన భట్టుమూర్తి చాలాకాలం బాధను సహించాడు. కాని **'కుట్టనటువంటి తేలు కుమ్మరి పురుగుతో సమానమని'** భావించి, తన ఓర్పు, సహనాన్ని అసమర్థతగా భావించిన వారిపై తీవ్ర మహోగ్ర భయంకరంగా ద్విత్వ ట కార ప్రాసతో 26 పాదాల ఉత్పలమాలికతో విరుచుకుపడ్డాడు.

**"లొట్ట యిదేటి మాట పెను లోభులతో మొగమాట మేలతాఁ**
**గుట్టక యున్న 'వృశ్చికముఁ గుమ్మర పుర్వని" యందురే కదా**
**....................................................................**
**రట్టడి భట్టుమూర్తి కవి రాయని మార్గమెఱుంగఁ జెప్పితిన్"** [17]

**చింతలపూడి ఎల్లన (రాధామాధవ కవి) :** చింతలపూడి ఎల్లన రాధామాధవుల శృంగారాన్ని మొదటిసారిగా 'రాధామాధవం' ప్రబంధంగా రచించాడు. ఇతని ప్రబంధాన్ని విన్న శ్రీకృష్ణదేవరాయలు మెచ్చుకొని బంగారు భూషణాలతో సత్కరించి 'రాధామాధవుడ'నే బిరుదునిచ్చినట్లుగా కవి తానే చెప్పుకున్నాడు. రాయల దర్శనం చేసుకున్నప్పుడు అల్లసాని పెద్దన ఇతని కవితా శక్తి సామర్థ్యాలను పరీక్షించదలచి, ప్రాస స్థానంలో నగరు, తగరు, వగరు, తొగరు అనే పదాలు వచ్చేటట్లుగా రామాయణ పరంగా పద్యాన్ని చెప్పమన్నాడు. అప్పుడు ఎల్లన –

**"నగరు పగాయె నింక విపినంబుల కేగుదు రాజ్యకాంక్షకుం**
**దగరు కుమారులార ! యని తల్లి వగల్ మిగులంగ దోపగా**
**దొగరున రక్ష గట్టి మది దొపక గద్గద ఖిన్న కంఠియై**
**వగరుచుచున్న జూచి రఘువంశ వరేణ్యుడు తల్లి కిట్లనున్"**

అని ఆశువుగా చాటు పద్యాన్ని చెప్పి తన కవితా ప్రతిభను నిరూపించుకున్నాడు. భారత, భాగవతపరంగా కూడా అవే పదాలతో పద్యాలను చెప్పమనగా...

**"తొగరుచి కన్నుదోయి..."** అనే పద్యాన్ని భారత పరంగా,

**"వగరుపు మాత్రమే..."** అనే పద్యాన్ని భాగవత పరంగా చెప్పి అక్కడి వారందరిని మెప్పించాడని తెలుస్తున్నది.[18]

రాయల భువనవిజయ మంటపంలో జరిగే కవి పండిత సాహిత్య గోష్ఠులు ఎంతో రసవంతంగా సాగేవి. అక్కడి ద్వారపాలకులకు కూడా కవిత్వం అంటే మక్కువ ఎక్కువే. ఒకరోజు అల్లసాని పెద్దన, నంది తిమ్మన, భట్టుమూర్తి, తెనాలి రామకృష్ణుడు కలిసి భువన విజయానికి వెళ్ళారట. తిమ్మన అనే పేరుగల ద్వార పాలకుడు వారిని లోపలికి పోకుండా అడ్డుపడి, మహాకవులారా! నా మీద ఒక పద్యం చెప్పినగాని లోపలికి పోరాదు, నన్ను కనికరించండి అని అన్నాడట. అతని ప్రార్థన విని నలుగురు మహాకవులు ఒక్కొక్క పాదం చెప్పారట.

**"వాకిట కావలి తిమ్మా"**– అని అల్లసాని పెద్దన లోపలికి వెళ్ళాడు.

**"ప్రాకటముగ సుకవి వరుల పాలిట సొమ్మా"** – అని నంది తిమ్మన లోపలికి వెళ్ళాడు.

**"నీకీ పద్దెముఁ గొమ్మా"** – అని భట్టుమూర్తి లోపలికి వెళ్ళాడు.

**"నాకీ పచ్చడమె చాలు, నయముగ నిమ్మా"** అని చివరి పాదం పూరించి ద్వారపాలకుని మీద వేసుకున్న పచ్చడం లాక్కొని తెనాలి రామకృష్ణుడు లోపలికి వెళ్ళాడట!

పై పద్యంలోని ఒక్కొక్క పాదం ఒక్కొక్క కవి స్వభావాన్ని తెలుపుతున్నది. పెద్దన పెద్దవాడు కాబట్టి పెద్దరికమును చూపిస్తూ పద్యాన్ని ప్రారంభించాడు. తిమ్మన ఉద్యోగంతో పాటు ఏకవచన సంబోధన చేసి లోపలికి వెళ్ళాడు. నంది తిమ్మన అరణపు కవి. గజపతుల నుండి రాయల భార్య తిరుమలదేవితో పాటు ధన కనక

వస్తు వాహనాదికాలతో వచ్చిన కవి. అందుకే కవుల ఆశ్రయ విషయంలో పరిశీలనా దృష్టి కల్గినవాడై **"సుకవి వరుల పాలిట సొమ్మా"** అని లోపలికి వెళ్ళాడు. భట్టు వంశీకులు రాజుల దగ్గర సందర్భోచితంగా పద్యాలను చెప్పి, ప్రశంస/స్తుతి చేసేవారు కాబట్టి భట్టుమూర్తి **"నీకీ పద్దెము కొమ్మా"** అని లోపలికి వెళ్ళాడు. తెనాలి రామకృష్ణుడు చతురుడు, కొంటెవాడు. భువన విజయ ప్రవేశాన్ని, ద్వారపాలకుని పచ్చడాన్ని రెండింటిని పొందాడని పై ఈ చాటు పద్యం ద్వారా గ్రహించవచ్చు[19].

పై విధంగా అల్లసాని పెద్దనాది ప్రబంధకవులు ప్రబంధ రచనలతో పాటు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, తమకు కలిగిన విశేష అనుభవాలను, చూసిన రమణీయ దృశ్యాలను అప్పటికప్పుడే సమయస్ఫూర్తితో చమత్కారంగా చాటుపద్యాల రూపంలో ప్రకటించడాన్ని ఇక్కడ విశేషంగా చెప్పవచ్చు. వారి చాటుపద్యాలు ప్రబంధయుగపు చారిత్రక, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య స్థితిగతులను మరింత చక్కగా అర్థం చేస్కోవడానికి ఉపయోగ పడుతున్నాయనడంలో అణుమాత్రం కూడా సందేహం లేదు.

**ముగింపు :** చాటు పద్యరచన అనేది మంచి కవిత్వానికి ప్రారంభదశ వంటిది. మహాకవిగా పరిణతి సాధించడానికి మార్గాన్ని చూపిస్తుంది. రాయగా రాయగా చక్కని పద్యశైలి అలవడునట్లుగా మహాకావ్యరచనకు ముందు కవులందరు కవిత్వం అల్లడానికి అభ్యాసం చేస్తుండడం పరిపాటి. తద్వారా కవిత్వంలో పరిణత రచనాశైలిని సాధిస్తుంటారు. చాటుకవిత్వం మనోహరమై గతి భేదాలతో విలసిల్లి సులభ కంఠస్థమై పద్య నిర్మాణాన్ని, పద్య గమనాన్ని, సాహిత్య రసాస్వాద యోగ్యతను కల్పిస్తున్నది. మనోహరమైన కథలు గల చాటు పద్యాలను చదివినా, విన్నా కవిత్వ రసాస్వాదన వల్ల ఆనందానుభూతిని ఎలా పొందాలో తెలుస్తుంది. తద్వారా సాహిత్య పిపాస అధికమౌతుంది. చాటు పద్యాల ద్వారా మహాకవుల ఆంతరంగిక జీవితాలను తెలుసుకోవచ్చు. కవులు తమ కావ్యాలలో వారి నిజ జీవిత విశేషాలన్నీ చెప్పుకోరు. వాటిని చాటుపద్యాలు పట్టుకుని మనముందు నిలబెడతాయి. చాటుపద్యాలే లేకుంటే వేములవాడ భీమకవి శాపానుగ్రహ గాథలు లేవు- కవిసార్వభౌముని కనకాభిషేకాలు లేవు - అల్లసాని గండ పెండేర గాథ లేదు. మహాకవుల జీవితాల్లోని మహోత్కృష్ట, పతన దశలను చాటుపద్యాలే మనకు తెలియజేశాయి. చాటుపద్యాలు సమకాలీన చారిత్రక, సామాజిక, సాంస్కృతిక స్థితి గతులకు నిలువుటద్దాలు. అందువల్ల తెలుగునేల చరిత్రైనా, తెలుగు సాహిత్య చరిత్రైనా సంపూర్ణంగా అర్థం కావాలంటే తెలుగు చాటుపద్యాల అధ్యయనం కూడా తప్పనిసరి.

**పాద సూచికలు :**

1. తెలుగు భాషా సమితి - విజ్ఞాన సర్వస్వము : 3వ సంపుటం, పుట. 608
2. తెలుగు సాహిత్య సమీక్ష - రెండవ సంపుటం, నాగయ్య జి, పుటలు. 1- 12
3. తెలుగు సాహిత్య సమీక్ష - రెండవ సంపుటం, నాగయ్య జి, పుటలు. 12-14
4. తెలుగు సాహిత్య సమీక్ష - రెండవ సంపుటం, నాగయ్య జి, పుటలు. 15-16
5. తెలుగు సాహిత్య సమీక్ష - రెండవ సంపుటం, నాగయ్య జి, పుట. 219
6. తెలుగు సాహిత్య చరిత్ర, డా. ద్వా.నా.శాస్త్రి, పుట. 206
7. చాటుపద్య మణి మంజరి, ప్రభాకరశాస్త్రి వేటూరి, తొలిపలుకు నుండి
8. తెలుగులో చాటు కవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుటలు. 2-5
9. తెలుగులో చాటు కవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుటలు. 6-9
10. తెలుగులో చాటు కవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుటలు. 26,27
11. తెలుగులో చాటు కవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుట. 36. (తెనాలి రామకృష్ణుడు నంది తిమ్మన తన్నుతో పన్నువిరిగి దుప్పిపన్ను పెట్టుకున్నాడన్న గాథను తెలిపే భట్టుమూర్తి చాటు పద్యం)
12. తెలుగులో చాటు కవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుట. 71 (కాకుమాను మూర్తిరాయకవి గురించి తెనాలి రామకృష్ణుని ప్రశంస)
13. తెలుగులో చాటుకవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుటలు. 28, 29
14. ప్రాచీన సాహిత్య వికాసం, సంస్కృత సాహిత్య పరిచయం, సంపా. ఆచార్య సుమతీ నరేంద్ర పి., డా.సాగి కమలాకర శర్మ, పుట. 138.
15. తెలుగులో చాటుకవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుటలు. 29-31.
16. ప్రాచీన సాహిత్య వికాసం, సంస్కృత సాహిత్య పరిచయం, సంపా. ఆచార్య సుమతీ నరేంద్ర పి., డా. సాగి కమలాకర శర్మ, పుటలు. 138, 139.
17. తెలుగులో చాటుకవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుటలు. 35, 36.
18. తెలుగులో చాటుకవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుట. 37.
19. తెలుగులో చాటుకవిత్వం, నరసయ్య సంగనభట్ల, పుట. 93.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (19) హైదరాబాద్ ఆగస్టు : 2025

# ప్రొ. ఎస్వీ సత్యనారాయణ విమర్శనా దృక్పథం

**డా. ఇమ్మిడి మహేందర్** అధ్యాపకులు, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9505645706

తెలుగు సమాజంలో సామాజిక చలనాల ప్రతిస్పందనలను పసిగట్టి, వాటికొక అక్షర రూపం కల్పించిన విమర్శకులు చాలామంది ఉన్నారు. కానీ, సరైన ప్రాపంచిక దృక్పథంతో సమకాలీనంగా వచ్చిన భావజాలపరమైన సంఘర్షణలను రికార్డు చేసే ప్రయత్నం చాలా తక్కువమంది చేసారు. అందులో ప్రొ. ఎస్వీ సత్యనారాయణ ఒకరు. ఈయన అధ్యాపక వృత్తిలో ఉండటం వలన విద్యార్థులకు బోధించే క్రమంలో ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాలు వెతకడం, వాటిని తనదైన భావజాల ప్రతిస్పందనతో రికార్డు చేయడం సహజంగానే జరిగిపోయింది. ఈ క్రమంలో తనకంటూ ఒక విమర్శ దృక్పథాన్ని అభివృద్ధి చేసుకున్నారు.

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో ఎస్వీ సత్యనారాయణ అంటే అభ్యుదయ రచయితల సంఘానికి మారుపేరుగా నిలిచిన వ్యక్తి. కవిగా అభ్యుదయ భావాలను ఎల్లెడలా వ్యాపింపజేసాడు. ఈయన కవిత చదివినా, ప్రసంగం ఇచ్చినా, విమర్శకుడిగా రాణించినా తనదైన ప్రత్యేకతను తెలుగు సాహిత్య యవనిక మీద నిలుపుకున్నాడు. సృజనకారుడిగా ఎస్వీ అనేక కవితా సంపుటాలను వెలువరించాడు. విమర్శకుడిగా, సాహిత్య వ్యాఖ్యాతగా కూడా రాణించాడు. ఒక రకంగా చెప్పాలంటే అన్ని రంగాలలోను తనదైన ప్రాతినిధ్యాన్ని సంపాదించుకున్నాడు. పరిపాలకుడిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగా పనిచేసారు. ఈ విధంగా బహుముఖీన ప్రజ్ఞావంతులుగా అన్ని రంగాలలో సమాన ప్రతిభను కనబర్చినప్పటికీ వ్యాస పరిమితి దృష్ట్యా ప్రస్తుతం ఎస్వీ సత్యనారాయణ విమర్శనా దృక్పథాన్ని అంచనా వేయడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

ఎస్వీ సత్యనారాయణ కవిగా, విమర్శకుడిగా, వక్తగా తెలుగు సాహితీ రంగంలో అందరికీ సుపరిచితమే అనే విషయాన్ని ముందుగానే తెలుసుకున్నాం. ఎస్వీ సత్యనారాయణ తెలుగు సమాజంలో ఒకానొక దశలో అభ్యుదయ రచయితల సంఘానికి మారుపేరుగా నిలిచారు. ఇప్పటివరకు అనేక పుస్తకాలను వెలువరించారు. ఇందులో ప్రధానంగా తెలుగులో ఉద్యమ గీతాలు, అభ్యుదయ సాహిత్యం – ఇతర ధోరణులు, దళిత సాహిత్య నేపథ్యం, తెలంగాణ సాహిత్య పోరాట సాహిత్యం, తెలంగాణ విమోచనోద్యమం – సాహిత్యం, సత్యానుశీలన, ఆలోచన, దృక్పథాలు మొదలైన పరిశోధన, విమర్శా పుస్తకాలతో పాటు మొత్తంగా ముప్పై వరకు పుస్తకాలను వెలువరించారు.

సాహిత్య విమర్శా రంగంలో ఎస్వీ సత్యనారాయణ మార్గం ప్రత్యేకమైనది. ఈయనది హైదరాబాద్ పాతబస్తీ. విద్యార్థి దశలోనే అభ్యుదయ రచయితల సంఘం సాహిత్య పాఠశాలల్లో పాల్గొని శిక్షితుడయ్యాడు. ఈయన పరిశోధనాత్మక, విమర్శనాత్మక వ్యాసాలు సమన్వయంగా రచించారు. ఈయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో, ప్రొ. ఎన్. గోపి పర్యవేక్షణలో 'తెలుగులో ఉద్యమ గీతాలు' అనే అంశంపై పరిశోధన చేసారు. ఆ తర్వాత తన పరిశోధనను ప్రచురించారు. ఈ గ్రంథంలో వీరోచిత తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యాన్ని సృజించిన కవులను, రచయితలను నాలుగు ప్రధాన శ్రేణులుగా విభజించారు. 1. ప్రవాహికులు 2. ప్రవాహ ప్రభావితులు 3. ప్రవాహ ప్రేరితులు 4. తటస్థులు అంటూ విభజన చేసి తెలంగాణ విమోచనోద్యమ సాహిత్యంలో రచయితలను వారి ఆచరణ మార్గాలు, ప్రభావిత లక్షణాల దృష్ట్యా విభజించారు.



తెలంగాణ ఉద్యమ గీతాలపై ఎస్వీ చేసిన పరిశోధన చాలా విలువైనది. ఆనాటి ఉద్యమంలో సాయుధులై, కలాన్ని కూడా చేపట్టి ఉద్యమాన్ని నడిపిన వారు చాలామంది ఉన్నారు. ఉద్యమంలో పాల్గొని ప్రజల పక్షాన నిలబడింది కష్ట జీవులు. గ్రామీణులు. వీరు సహజంగానే పోరాట ప్రజా సమూహాలతో కలిసిపోతారు. ప్రజలకీ, ఉద్యమానికి మధ్య అవినాభావ సంబంధాన్ని నెలకొల్పాల్సిన బాధ్యత కవుల మీద ఉంటుంది. ఆనాడు ఈ స్థితిలో ప్రజా వాగ్గేయకారునిగా సుద్దాల హనుమంతు తనదైన పాత్ర పోషించారు. ఆయన కవితా రీతి, పాటల్లో ఉపయోగించిన పదాలలో ఉన్న వైవిధ్యాన్ని **"ఆట, పాట, మాట – ఈ మూడింటినీ మేళవించిన అరుదైన ప్రతిభావంతుల్లో ఒకడిగా అరితేరాడు. కళారూపాలకూ, ప్రజల జీవితానికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని అర్థం చేసుకొని ప్రజా కళారూపాలను పోరాట ప్రతిధ్వనులుగా రూపొందిం చాడు. అలంకార శాస్త్రాల పరిజ్ఞానం తో కాక, ప్రజల జీవితాను భవాల ప్రేరణతో పాటలు కట్టిన హనుమంతు పాటలు నేటికీ**

**తెలంగాణా గ్రామాల నోళ్లలో గూళ్లు కట్టుకున్నాయి"** (సత్యనారాయణ, ఎస్వీ. తెలంగాణ విమోచనోద్యమ సాహిత్యం. 2008: 85) గా గుర్తించాడు. ప్రజా బాణీల్లో పాటలు రాయడం ద్వారా ప్రజలకు పోరాట సాహిత్యాన్ని చేరువ చేయవచ్చు. అలాగే వారిని ఉద్యమాల్లో భాగం చేయవచ్చు. ఈ స్థితి ఆనాటి ఉద్యమ కాలంలో సహజంగా ముందుకు వచ్చింది. ఇక్కడి పీడితులే పోరాటకారులు అయ్యారు. పోరాటకారులే, సాంస్కృతిక యోధులు అయ్యారు. ఈ క్రమాన్ని విమర్శకుడిగా ఎస్వీ గమనించాడు. విశ్లేషించాడు.

తెలుగు సాహిత్యంలో నిర్వచనాల స్పష్టత చాలా తక్కువగా ఉంది. విదేశీ ప్రభావమైన, దేశీ తాత్త్వికధార అయిన పూర్తి అవగాహన కల్పించే దిశగా రచనలు చేయాలనే స్పర్ధ చాలామంది రచయితల్లో చోటు చేసుకుంది. ఈ పరిస్థితిని గమనించిన కొందరు సాహిత్యంలో అస్పష్టంగా ఉన్న భావాలకు స్పష్టతనిచ్చే దిశగా కొన్ని పారిభాషిక పదాల విశ్లేషణ చేసారు. ఉద్యమ సాహిత్య విమర్శ వికాసానికి ఇది తప్పనిసరి అవసరమవుతుంది. ఈ దిశగా ఆలోచించిన ఎస్వీ నిరసనకు, ఆందోళనకు, ఉద్యమానికి మధ్య ఉండే తేడాలను ఆచరణ మార్గాల ఆధారంగా చర్చించారు. **"సమాజంలో, మతంలో, సాహిత్యంలో, భాషలో... అప్పటికే వేళ్లూనుకొని ఉన్న భావాలు, ఆలోచనలు వ్యవస్థలు పాతబడిపోయి కాలం చెల్లినవైనప్పుడు అవి ఇక ఏ మాత్రం కొనసాగడానికి వీల్లేని పరిస్థితులు ఏర్పడినప్పుడు క్రమంగా వాటి మీద నిరసన తలెత్తుతుంది. అది రాను రానూ ఆందోళనగా మార్తుంది. ఆ ఆందోళన పెరిగి పెద్దదై ఉద్యమ రూపం దాలుస్తుంది. ఏ ఉద్యమానికైనా తాత్విక ప్రాతిపదిక ఉంటుంది. ఉద్యమాల్లో కొందరు వ్యక్తులు ప్రామాణికమైన పాత్రను నిర్వహించి, నాయకత్వ స్థాయికి ఎదుగుతారు. అలాగని ఆ వ్యక్తుల ప్రాతిపదిక పైనే ఉద్యమాలు నడుస్తాయనడం సరైన పద్ధతి కాదు. ఉద్యమాలు వ్యక్తి ప్రాతిపదికపై నిర్మితం కావు. సిద్ధాంత ప్రాతిపదికపై నిర్మితమౌతాయి."** (సత్యనారాయణ, ఎస్వీ. ఆలోచన. 1996: 01) ఈ అవగాహన ప్రతి ఉద్యమకారునికి, సాహిత్యకారునికి ఉండాల్సిన అవసరం ఉంది. సాహిత్య విమర్శలో ఈ పదాల పట్ల స్పష్టత ఉన్నప్పుడే నిర్దిష్టంగా, నిర్దుష్టంగా భావాలు వ్యక్తం చేయడానికి వీలు కలుగుతుంది. సాహిత్య విమర్శలో వాదం, ధోరణి, ఉద్యమం, నిరసన వంటి పారిభాషిక పదాల పట్ల స్పష్టత లేకుండా చాలామంది వాడుతుంటారు. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఉంది.

ఎస్వీ రాసిన భారతదేశంలో 'కులం – మతం' అనే వ్యాసాన్ని ఒక మార్క్సిస్టు విమర్శకునికి ఉండాల్సిన భావజాల స్పష్టతకు సంబంధించిన వ్యాసం. ఇందులో కులం అస్తిత్వాన్ని గుర్తించని వర్గ దృష్టి అంధప్రాయం అని, వర్గ దృష్టిలేని కుల చైతన్యం వంధ్య ప్రాయం అనే అభిప్రాయాలను ప్రకటించాడు. దళితులు వర్గ సంఘర్షణకు దూరమైతే జరిగే నష్టాల గురించి విశ్లేషించాడు. అలాగే తెలుగు సాహిత్యంలో ఎవరు యుగకర్త గురజాడ అప్పారావా? రాయప్రోలు సుబ్బారావా? అన్న ప్రశ్నలకు అనేక సమాధానాలు, చర్చలు జరిగాయి. ఇద్దరిని యుగకర్తలు ప్రతిపాదించి తప్పుకున్న సాహితీకారులు కూడా ఉన్నారు. కానీ మార్క్సిస్టు విమర్శకుడిగా ఎస్వీ సత్యనారాయణ వీరిద్దరి మధ్య వస్తువు, రూపం, పాత్ర చిత్రణ, ధిక్కార స్వభావం వంటి లక్షణాలను సమన్వయ పరుస్తూ, తులనాత్మకంగా అంచనా వేశాడు. ఈ అధ్యయన ఫలితంగా కొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చాడు. **"రాయప్రోలు వారిది తత్కాల దృష్టి కాగా గురజాడ అప్పారావుది భవిష్యత్ దృష్టి"** అని ఒక్క మాటలో తేల్చేశారు. సాహిత్య లోకం తత్కాల ప్రభావ దృష్టితో సాహిత్యం రాసిన వారిని గౌరవిస్తుంది. భవిష్యత్తు దృష్టితో సాహిత్యం రాసిన వారిని అనుసరిస్తుందని ప్రతిపాదించారు. ఎవరు అభ్యుదయ రచయితలు అనే విషయాన్ని కూడా ప్రతిపాదించాడు. సాహిత్యాన్ని సామాజిక ప్రయోజనానికి ఆయుధంగా వాడుకుంటూ, సమసమాజ నిర్మాణ కాంక్షను తమ రచనల ద్వారా వ్యక్తీకరించే రచయితలను విస్తృతార్థంలో అభ్యుదయ రచయితలుగా భావించవచ్చు.

ఎస్వీ సత్యనారాయణ **"తెలంగాణ అభ్యుదయవాద కవులు"** అనే పేరుతో ఒక వ్యాసాన్ని రాశారు. ఈ వ్యాసాన్ని 1991లోనే రచించారు. తెలంగాణ అభ్యుదయ రచయితలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకతను ఆనాడు ఈ వ్యాసం పూర్తిగా వ్యక్తం చేయలేకపోయినా, ప్రాంతీయ అభిమానంతో ఇక్కడ జరిగిన అనేక పోరాటాలు, సాహిత్యోద్యమాల్లో అభ్యుదయ భావాలు కలిగిన రచయితలను తలస్పర్శిగా పరిచయం చేసే ప్రయత్నం చేసారు. ఇది మంచి ముందడుగు. ఉద్దేశ్యాలు ఏమయినప్పటికీ తెలంగాణ ప్రాంత అభ్యుదయ రచయితలను ఈ తరానికి ఒకే దగ్గర చదువుకోవడానికి, తెలుసుకోవడానికి అవకాశం దక్కింది. ఉత్సాహవంతులైన యువతరానికి సరైన సాహిత్యాన్ని అందించడం కూడా విమర్శ చేయాల్సిన ప్రధాన విధి. ఎస్వీలో ఉండే పరిశోధన, విశ్లేషణ సామర్థ్యాలు విషయాన్ని సున్నితంగా, స్పష్టంగా చెప్పేందుకు ప్రయత్నిస్తాయి. అలా తెలంగాణ అభ్యుదయవాద కవులను విభజించి చెప్పే ప్రయత్నం చేసారు. అందులో ప్రధానంగా ఆంధ్రోద్యమ రచయితలు, తెలంగాణ రైతాంగ పోరాట రచయితలు, వేర్పాటువాద రచయితలు, సమైక్యాంధ్ర రచయితలు, ఈ తరం అభ్యుదయ రచయితలు, బొగ్గుగని కార్మిక రచయితలు, పత్రికా రచయితలు, దిగంబర విప్లవ రచయితలు, దళిత రచయితలు అంటూ విభజించి పరిచయం చేసారు. వీరి వ్యాసాల్లో అభ్యుదయ రచయితల సంఘం చరిత్ర, వికాసం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నాటి సామాజికార్థిక, రాజకీయ, మత సాంస్కృతికాది పరిస్థితుల వివరణలు ఎక్కువగా పునరాగమనం చేశాయి.

ఎస్వీ సత్యనారాయణ మరొక ప్రత్యేక లక్షణంతో విమర్శ చేసారు. వామపక్ష భావజాల రంగానికి అవతల ఉన్న భావవాద, సంప్రదాయవాద సాహిత్యాల్లో సైతం అభ్యుదయాంశను వెతికి, పరిచయం చేయడం వంటి పనిని చేసారు. ఇది నిజానికి మార్క్సిస్టు సాహిత్య విమర్శ మౌలిక సూత్రం అన్వయం చేసే విధానం. మార్క్సిస్టు సాహిత్య విమర్శ అనేది చూసే చూపును బట్టి నిర్ణయమవుతుంది తప్పితే, పరిశీలించే సాహిత్యాన్ని బట్టి కాదు అనే ప్రతిపాదనను ఎస్వీ విమర్శకుడిగా పాటించారు. వామపక్ష సాహిత్యోద్యమాల్లో పనిచేసే విమర్శకులకు ఏ సాహిత్యం విధినిషేధాలకు గురికాకూడదు. అన్ని సాహిత్యాలపై నిరంతర అధ్యయనం ఉండాలి. ఇతర సోదర వాదాలు అయినా, శత్రు వాదాలైన మనం అధ్యయనం చేసినప్పుడే కలయిక సాధ్యమవుతుంది. శత్రు వాదాలనయితే సమగ్రమైన వాదన పటిమతో ఓడించడానికి అధ్యయనం ఉపయోగపడుతుంది. ఈ విమర్శ లక్షణాలను ఎస్వీ అందిపుచ్చుకున్నాడు.

ఎస్వీ సత్యనారాయణ తను చేసిన విమర్శలో సమాజ, సాహిత్యాలను సమపాళ్లలో పరిశీలించడం, సమాజం యథాతథ స్థితి నుండి ముందుకు వెళ్లాలని ఆకాంక్షించడం, పాఠకులకు సాహిత్యంలోని రాజకీయాలను అర్థం చేయించడం, తెలంగాణ కేంద్రంగా వచ్చిన అభ్యుదయకరమైన సాహిత్యాలను పరిశీలించడం వంటి అనేక విషయాలను చర్చించారు. వీటికి మార్క్సిజం అనే ప్రాపంచిక దృక్పథం నుంచి పరికరాలను అందిపుచ్చుకున్నారు. వాటి నేపథ్యం నుంచి పైన సూచనప్రాయంగా ప్రతిపాదించుకున్న కొన్ని విమర్శ పరికరాలను అధ్యయనం చేసిన తర్వాత ఎస్వీ సత్యనారాయణ గారి విమర్శనా దృక్పథం "మార్క్సిస్టు దృక్పథం" అని నేరుగా ప్రతిపాదించవచ్చు. విమర్శకుడిగా తనదైన ప్రత్యేకతను ఈ ప్రతిపాదనలు, పరికరాల ద్వారా సాధించుకున్నారని నిర్ణయించవచ్చు.

❖ ❖ ❖ ❖ ❖

## విభావరి

కె.ఎల్. నారాయణ
ఫోన్ : 9494769293

తపనకు తాళలేక
నేలన తేమను ఎగపీల్చి పీల్చి
అలసి... పడమటి గట్టెక్కి
ఆవల ఏం చూశాడో... ఏమో!
కాంతి తగ్గిన మోము
కందగడ్డ అయింది
పండని భ్రమసిందో... ఏమో!
గుట్టు చప్పుడు కాకుండా
గుటకేసింది... గట్టు

ఇంటి దీపాలు మీట నొక్కి
చీకట్లను చిందర వందర చేస్తున్నాయి
కూడలిలో నుంచొని
చోద్యం చూస్తూ..

అవతలేం జరిగిందబ్బా!... అని
బుర్రబద్దలు కొట్టుకోబోతుండగా
మైకు ఘీంకరించి అడ్డగించింది
ప్రక్కనే ఉన్న కళావేదిక నుండి...
విభావరికి స్వాగతమో...
విభాకరునికి వీడ్కోలో...
అందరూ ఆహ్వానితులేనంటూ
చిత్ర గీతాలాపన పిలిచింది.

కళ్ళు బోర్డును చూసేలోపే
కాళ్ళు ప్రవేశించాయి అప్రయత్నంగా
నిర్వాహకుల మేలి రాకతో
ఆరంభమైన విభావరి
సినీగీతాలతో తూలిపోయింది.
మాస్టరు ప్రతిభ చూపాలంటే
యుగళానికి మరో గళం కావాలి..
మరి అందుకేనేమో...
సానబట్టి మరీ
మరికొన్నిటిని తెచ్చినట్లున్నారు
పాటల్లోని శ్రావ్యత
గొంతుల్లో కూరుకుపోయింది

చిత్రాల్లో...
ఘంటసాలా, బాలూ
సుశీలా, జానకీ ఒక్కొక్కరే
చిత్రం! మరిక్కడో
గానగంధర్వులే అందరూ...
వాద్యఘోష సాహిత్యాన్ని
రససాగరంలోకి నెట్టి
పాతాళానికి చేర్చింది

కొందరు గొప్పగా...
మరికొందరు గబ్బుగా...

గాత్రం తడబడితే
వాద్యం కలబడి
గతి తప్పిన గమకాల మృత శత్రువులను
కప్పెట్టింది
గాయకుల బంధుమిత్రులతో
కళకళలాడిన విభావరి
ప్రతి పాటకూ – చప్పట్లకై పరితపించింది
బాగా పాడినవారికి
పాడనివారికి
తేడా చూపక
అందర్నీ అభినందించే
చెవులు లేని అమాయకపు చేతులు
నీకేమీ పాలు పోనీయలేదు
అందుకేనేమో...
కంధరాన్ని చాటు చేసుకున్న
కళాదుడిని గమనించి
వీడ్కోలు పాటనందుకుంది విభావరి
తడబడుతున్న అడుగు దగ్గరకే
గమ్యం చేరింది.

## ఆదిత్య హృదయ మహిమ

**"హిరణ్యగర్భః శిశిర స్తపనోఽ హస్కరో రవిః**
**అగ్నిగర్భోఽదితేః పుత్రః శఙ్ఖః శివరనాశనః"**

**19. హిరణ్యగర్భః :** హిరణ్యగర్భుడు. హిరణ్యము గర్భము నందు గలవాడు. హిరణ్యమే గర్భం కలవాడు అని ఈ శబ్దానికి అర్థాన్ని సంభావిస్తాము హిరణ్యం అంటే సువర్ణం. బంగారం, బంగారం వలె చాలా విలువకలదీ, అందరూ కావాలను కొనేదీ, నాశనం కానిదీ, సర్వశ్రేష్టమైనదీ సర్వమూ హిరణ్యమే. అది గర్భంలో కలవాడు అంటే సర్వలోకాల శ్రేయస్సు కోసం వినియోగించే మహాత్ముడు అని తాత్పర్యం. హితరమణీయమైనది హిరణ్యం అని ఒక అర్థాన్ని శబ్దజ్ఞులు సంభావించారు.


**20. శిశిరః :** శిశిరుడు. చల్లనివాడు. ఆదిత్యుడు నిరంతరమూ అగ్నిలాగా కాల్చివేస్తూ ఉండగా చల్లనివాడని ఎలా సంభావించటం? చలి దేహాలను కుంచించుకొని పోయేట్లు చేస్తుంది. ఆ విధంగా ప్రాణుల దేహాలను సూక్ష్మంగా చేసేవాడు అని ఈ పదానికి అర్థం. అయితే ఇది ఉపకారమా? అపకారమా? మన దేహం వెలుపలి వాతావరణాన్ని బట్టి అనేకమైన మార్పులను కాలానుగుణంగా పొందుతూ ఉంటుంది. ఈ మార్పులన్నీ ప్రాణుల మనస్సులకూ దేహాలకూ ఆరోగ్యప్రదాలే అవుతాయి. కావున ఈ శిశిరత్వం ఉపకారకమే. ప్రాచీన కాలంలో ఋషులు తపస్సును కఠోరంగా చేసి దేహం మీద పట్టు సాధించేవారు. అటువంటి సాధనకు సహకారకమైనది ఆదిత్యుని శిశిరత్వం.


**21. తపనః :** తపనుడు. సర్వప్రాణులకూ దేశకాల భేదాల ననుసరించి అవసరమైన వేడిని ప్రసాదించేవాడు. "తపనీతి తపనః" – తపింపజేయువాడు.

మహానారాయణ మంత్రములు ఈ తపనతను చక్కగా వర్ణిస్తున్నాయి.

"సంతాపయతి స్వం దేహ మాపాదతలమస్తకః" మన దేహంలో మెడముడి నుండి జానెడు క్రిందికి, బొడ్డునుండి జేనెడు పైకి కొలత వేస్తే ఆ రెండు జేనలు కలిసే చోటునందు లోపల పద్మపు మొగ్గవంటి హృదయం అనే అవయవం ఉన్నది. అది చాలా చిక్కగా సిరలతో (రక్తప్రసరణ నాడులతో) అల్లుకొని క్రిందిముఖంగా వ్రేలాడుతూ ఉంటుంది. ఆ శిరలమధ్య చాలా సూక్ష్మమైన రంధ్రం ఒకటి ఉన్నది. దానిలో సర్వమూ చక్కగా నెలకొని ఉన్నది. ఆ రంధ్రం మధ్యలో గొప్ప అగ్ని, పెక్కుజ్వాలలు కలిగి, అన్ని వైపులకూ వ్యాపిస్తూ ఉంటుంది. (సశేషం)

## సత్సంగం





### సాధన

మనం దేనినైనా అధ్యయనం చేసేటప్పుడు మనస్సుని దానిపై పెడ్తాం. మనం పురోగమిస్తున్నామో లేదో తెలుస్తుంది. మనస్సు తనకి వెలుపల గల దానిపై లగ్నమవుతుంది ఈ సందర్భంలో. మనకి మనస్సు సహాయంతో అధ్యయనం చేస్తున్న విషయమర్థమయితే మనకి సంతోషం కలుగుతుంది. మనం మామూలుగా చేసే ప్రయత్నాలన్నీ బయట విషయాలని అర్థం చేసుకోవటానికే! ఆధ్యాత్మిక రంగంలో ఈ అర్థం చేసుకునే మనిషిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాము. మనస్సు లోపలికి వెళ్ళాలి. బయటకు పరుగెత్తే స్వభావం కల మనస్సు లోపలికి వెళ్ళాల్సి వస్తుంది. ముందుకు పరుగెత్తే మనస్సు వెనకి పరుగెత్తాలి. అది కష్టమే. మనస్సుకి అతీతమైన స్థితికి తెలుసుకోవటానికి మనస్సు ఎట్లా ఉపయోగిస్తుంది? ఆ స్థితిని సుషుప్తిలో ప్రతిరోజు అనుభవిస్తూనే ఉంటాం. దానిని మాటలలో చెప్పలేం. మేల్కొన్నప్పుడు కూడా ఆ స్థితినే పొందగోరుతాం. ఆ స్థితిని చేరుకోవటానికే సాధన చేస్తాం. మనం పురోగమించటం లేదని ఒకోసారి ఖిన్నులమవుతాం. ఈ అంచనాలని వేసేది మనస్సే. తానే మాయ మవవలసిన స్థితిని గురించి మనస్సు ఎట్లా అర్థం చేసుకోగలదు? దేనినీ అపేక్షించకుండా సాధన చెయ్యాలి. మనం అనుకున్నదానిని సాధించలేదని మనం చింతిస్తాం. సాధన చెయ్యటం దేనినో సాధించటానికి కాదు. మన నిజతత్త్వం తెలుసుకోవటానికి. మామూలు వ్యవహారాలలో కొద్దికొద్దిగా పురోగమించటం మనకి అలవాటు. కాని ఆత్మజ్ఞానం అట్లా క్రమంగా లభించేది కాదు. అది హఠాత్తుగా సంభవిస్తుంది. ఉషస్సు వంటిది అన్నారు శ్రీ భగవాన్. క్రమేపీ పురోగమనానికి అలవాటు పడ్డ మనస్సు ప్రగతి లేదనుకొని బాధపడుతుంది. మనస్సే అంతర్ధానమయిన తరువాత వచ్చే స్థితి గురించి తీర్పు చెప్పటానికి మనస్సు ఎందుకూ పనికిరాదు.

ప్రగతి లేదంటూ నిరుత్సాహం కలిగితే, "ఈ నిరుత్సాహం ఎవరికి కలుగుతోంది," అని ప్రశ్నించుకోవాలి. లేదా, భగవంతునికి పూర్తిగా అంకితమై పోయి అంతా ఆయనకే విడిచి పెట్టాలి. ఆయనే మనల్ని దరిచేర్చగలడు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (23) హైదరాబాద్ ఆగస్టు : 2025

# తిరుపతిలో ఘటికా యంత్రాలు

ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి, ఫోన్ : 98493 07333

టాంగ్... టాంగ్... టాంగ్... టాంగ్... అని శబ్దం చేస్తూ తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయంలోని తిరుమామణి మంటపంలోని గంటల శబ్దం మైకుల ద్వారా తిరుమలంతా మారుమోగుతోంది. గణగణమనే ఆ గంటల ధ్వని భక్తులకు ఓంకార నాదంలా శ్రవణానందం కలిగిస్తోంది. ఆ ఘంటానాదం శరీరాన్ని పులకింపజేస్తోంది. తన్మయత్వంతో హృదయం పరవశించి పోతోంది. ఆ శబ్ద తరంగాలు అమృత కెరటాల్లా తిరుమలంతా వ్యాపించాయి... తిరుపతి అలిపిరి వరకు లౌడ్ స్పీకర్లో ప్రతి ధ్వనిస్తూ భక్తి పారవశ్యంలో ముంచెత్తుతున్నాయి.

“ఇలా గుడిలో నైవేద్య గంటలు ఎన్ని సార్లు కొడ్తారు?” అడిగాడు పిల్లలమర్రి రాములు.

“రోజుకు మూడుసార్లు కొడ్తారు. స్వామి వారికి ఉదయం... మధ్యాహ్నం రాత్రి నైవేద్యాలప్పుడు నైవేద్య గంటలను మోగిస్తారు” అన్నాడు గోపీకృష్ణ.

“గుడిలో బంగారు వాకిలుండే తిరుమామణి మంటపంలోని గంటలు తప్ప ఇతరత్ర గంటలు ఏమైనా ఆలయంలో కొడ్తారా?” అంది దేవారెడ్డి విజయలక్ష్మి.

“నైవేద్య గంటలైతే గుడిలో మూడు పూటల కొడ్తారు. అవిగాక స్వామి వారికి పూజ చేసేటప్పుడు చేతిలోని చిన్న గంటలను మోగిస్తారు. ఇకపోతే ఒకప్పుడు గుడి ముందున్న గొల్లభామ మంటపానికి ఉత్తరం వైపు నాటి మిట్ట మీద ప్రారంభంలో ఒక పన్నెండు కాళ్ళ మంటపంలో ఒక పెద్ద గంట ఉండేది. దానిని తెల్లవారు జామున మూడు గంటలకు మోగించేవారు. ఎందుకంటే గుడి తెరిచే సమయం ఆసన్నమైందని గుడిలోకి పనికి వచ్చే వాళ్ళంతా నిద్రమేల్కొని రావాలనే ఉద్దేశ్యంతో ఆ గంటను మోగించేవారు. ఆ గంట మోగుతూనే గుడి అర్చకులు, పనివాళ్ళు గబగబ సిద్ధమై గుడి ముందుకు చేరుకొనేవారు” అన్నాడు గోపీకృష్ణ.

“ఇప్పుడుందా గుడి ముందు ఆ గంటా మంటపం” అడిగాడు పిల్లలమర్రి రాములు.

“లేదు... మహంతుల హయాంలో ఈ పన్నెండు కాళ్ళ మంటపాన్ని ఒక బుడ్డయ్యోరుకు హోటల్‌కని ఇచ్చేశారు. అలా గుడి ముందున్న గంటా మంటపం హోటల్‌గా మారిపోయింది. తరువాత కాలంలో ఆ మంటపం సన్నిధి వీధి మిట్టను లోడి తీసి చదును చేస్తున్నప్పుడు పోయింది. అయితే గుడి మహాద్వారం ముందు ఒక గంటను ఉంచి దానిని తెల్లవారు జామున మూడు గంటలకు




కొట్టేవారు. అలా గుడి ముందుండే గంటా మంటపంలోని గంటకు బదులుగా మహాద్వారం ముందు గంట మోగేది. దాంతో ఆలయంలో పని చేసేవారు మూడు గంటలకల్లా విధి నిర్వహణ కోసం గుడి ముందు మూగే వారు” అన్నాడు గోపీకృష్ణ.

“అలా వెయ్యిగాళ్ళ మంటపం పోయింది... సన్నిధి వీధి పోయింది... చుట్టు పక్కల హోటళ్ళు, అంగళ్ళు అన్నీ పోయాయి. గుడి ముందుండే కొండ మిట్టను తవ్వేసి చదును చేసి గుడి ముందు విశాలమైన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. గడియారాలు అందరికీ అందుబాటులోకి వచ్చాక ప్రజలను మేల్కొల్పే గంటలు కొట్టే విధానం కూడా పోయింది” అన్నాను.

ఇంతకీ మేము కొండ మీదకు ఎందుకు వెళ్ళామో చెప్పనే లేదు కదూ? మా యూనివర్శిటీ లోని తెలుగు శాఖలో ఒకే రోజు మూడు పిహెచ్.డి. వైవాలుండడంతో హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ, ఉస్మానియా యూనివర్శిటీల నుండి ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి, ఆచార్య సాగి కమలాకర శర్మలు వచ్చారు. వారి కోసం మరుసటి రోజు శ్రీవారి దర్శనానికి ఏర్పాట్లు చేశాము. ఎలాగూ పోతున్నాము గదా? అని మా గురువుగారు, చారిత్రక పరిశోధకుడైన గోపీకృష్ణను కూడా వెంటబెట్టుకొని వెళ్ళాం... దర్శనానంతరం గుడి ఎదురుగా ఉండే బేడి ఆంజనేయ స్వామి గుడి మెట్లపై కూర్చుని కబుర్లలో పడ్డాం.

“గడియారాలు లేనప్పుడు తెల్లవారు జామున మూడు గంటలకు ఖచ్చితంగా ఎలా గంటలు కొట్టేవారు? అదే విధంగా శ్రీవారికి నైవేద్యం సమర్పించడానికి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి నిర్ణీత వేళల్లో ఎలా గంటలు మోగించేవారు? సమయాన్ని ఎలా నిర్ణయించేవారు?” అడిగాడు ఆచార్య పిల్లలమర్రి రాములు.

“తెల్లవారు జామున ఆకాశంలోని చుక్కలను చూసి గంటలు కొట్టేవారు. గడియారాలొచ్చాక ఆ సమయం మూడు గంటలుగా

నిర్ధారణయ్యింది. ఇక సూర్యోదయమయ్యాక సూర్య గమనాన్ని బట్టి కాలాన్ని లెక్కించి ఘడియలుగా చెప్పేవారు" అన్నాడు గోపీకృష్ణ.

"ఇంత పెద్ద గుళ్ళో వేళలు తెలపడానికి ఎవరైనా ఉండేవారా?" అడిగింది ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి.

"వేళ తెలపడానికి గంటలు కొట్టే సేవకుడుండేవాడు. అతనిని ఘంటా తాడుడు అంటారు. అంటే ఘంటను తాడించేవాడని అర్థం. ఇలాంటివారు ప్రసిద్ధ ఆలయాలలో, రాజుల అంతఃపురాల్లో ఉండే వారు. వీరు వేళలను సరిగ్గా అంచనావేసి గంట కొడ్తుంటారు. అంత:పురాల్లో అంటే కోటలో ఓ ఎత్తైన ప్రదేశంలో రాతి స్తంభాలను నాటి మధ్యలో పెద్ద ఘంటను వేలాడ దీసి ఉంటారు. కోటలో గంట కొడితే కోట వెలుపలున్న పేటలో అంటే నగరంలో కూడా కోటలోని గంట శబ్దాలను విని పేటలో కూడా గంటకొట్టేవారు" అన్నాడు గోపీకృష్ణ.

"ఆనాడు ఇలాంటి సంపన్నమైన ప్రసిద్ధ దేవాలయాల్లో ఘంటా తాడుడులుండేవారు. వీరు దేవాలయ సేవకులుగా పని చేసుకొంటూ బతికేవారు. అలాగే కోటలలో వీరిని తప్పకుండా నియమించేవారు. వీరు ప్రతి గడియకు గంట కొట్టేవారు. ఎన్ని గడియలో తెల్పడానికి అన్ని గంటలు కొట్టేవారు" అన్నాను.

"గడియ అంటే ఇరవైనాలుగు నిమిషాలు కదా?" అన్నాడు ఆచార్య సాగి కమలాకర శర్మ.

"అవును! గడియ అంటే ఇరవై నాలుగు నిమిషాల కాలం? రెండున్నర గడియలు ఒక గంట" అన్నాడు గోపీకృష్ణ.

"కాలాన్ని కొలిచేందుకు చుక్కలు, సూర్య గమనం కాకుండా ఏమైనా కొలబద్దలు, వస్తువులుండేవా?" అడిగాడు రాములు.

"ఉండేవి... ఆనాడు ఘటి లేదా ఘటిక అంటే చిన్న కుండను కూడా వేళలను తెలుసుకోవడానికి ఉపయోగించేవారు. గడియలు తెలపడానికి నీటి కడవలను వినియోగించేవారు. నీటి కడవలో పడే సూర్య కిరణాల వల్ల సమయాన్ని లెక్కించేవారు. అలాగే ఆ నీటి కడవలను వేలాడదీసేవారు. దాని కింద మరో మట్టిపాత్రను పెట్టేవారు. నీటి కడవ కిందున్న రంధ్రం ద్వారా నీళ్ళు చుక్కలు చుక్కలుగా కిందున్న పాత్రలో పడినప్పుడు ఆ పాత్రలో ఉన్న నీటి మట్టాన్ని బట్టి కూడా గడియలను లెక్కించేవారు. లెక్కించిన గడియలను గంటానాదం ద్వారా తెలియబరిచేవారు. అదేవిధంగా కొంత మంది బాటసారులుగానీ, ఆయా ప్రదేశాలలో, గ్రామాలలో నివసించేవారు గానీ మూరెడు పొడవుండే పుల్లను ఆరు బయట ఎండలో నేలమీద నిటారుగా నిలబెట్టి దాని నీడను బట్టి సమయాన్ని తెలుసుకొనేవారు. అలాగే ఆలయ గోపురాలపై పడే సూర్య కాంతి వల్ల గోపురాల కింద పడే నీడను బట్టి కూడా సమయాన్ని తెలుసుకొనేవారు. ఒకప్పుడు తిరుమల ఆలయం చుట్టూ దట్టమైన అడవి ఉండడం వల్ల అడవి కోళ్ళు కూసే తొలికూత, మలి కూతలను బట్టి కూడా కాలాన్ని తెలుసుకొనే వారు" అన్నాడు గోపీకృష్ణ.

"సూర్యుడు ఏ మాత్రం కనిపించని వర్షాకాలంలో కాలాన్ని ఎలా తెలుసుకుంటారు?" అడిగాడు రాములు.

"ఇంతకు ముందు చెప్పాను గదా? నీటి కడవల నీటి మట్టాలను బట్టి, కోడి కూతలను బట్టి కాలాన్ని తెలుసుకొనేవారు" అన్నాడు గోపీకృష్ణ.

"ఆనాడు ఆరుబయట ఏటవాలుగా గోడను కట్టి దాని నీడ పడే ప్రాంతంలో చిన్న చిన్న గోడలను నిర్మించేవారు.ఎండ గోడ మీద పడ్డప్పుడు, దాని నీడ చిన్న గోడలను తాకినప్పుడు కూడా గడియలను లెక్కించేవారు" అన్నాను.

"మను చరిత్రలో నిష్ఠాగరిష్టుడైన ప్రవరుడు పాదలేపనం సహాయంతో హిమాలయాలను చేరుకొంటాడు. అక్కడ మంచు మధ్యాహ్నం ఎండ పడేసరికి కరిగి బిందువులుగా పడేటప్పుడు సుయ్ సుయ్ అనే శబ్దం వస్తుండడాన్ని చూసి మధ్యాహ్నం వేళైందని తెలుసుకొంటాడు. ఇలా సమయాల్ని ఆ రోజుల్లో తెలుసుకొనే వారు" అన్నాడు రాములు.

"విజయ నగర సామ్రాజ్యాన్ని స్థాపించేటప్పుడు మహా అద్భుతమైన ముహూర్తాన్ని నిర్ణయించాడు రాజగురువు విద్యారణ్యస్వామి. ఆ ముహూర్తంలో రాజ్యస్థాపన జరిగితే సూర్య చంద్రులున్నంత వరకు రాజ్యం వర్ధిల్లుతుందని లెక్కగట్టి చెప్పాడు. ముహూర్తం రోజు రానే వచ్చింది. భూమి పూజ ఎన్ని గడియలకు ప్రారంభమవ్వాలో, శంఖు స్థాపన ఎన్ని గడియలకు చేయాలో నిర్దేశించాడు. కాలం సూచించడానికి పక్కనే ఉన్న కొండెక్కి సూర్యుని గమనాన్ని బట్టి శంఖం ఊదేటందుకు ఒకడు నియమించబడ్డాడు. మొదటి శంఖం ఊదుతూనే భూమి పూజ ప్రారంభించారు హరిహరరాయలు, బుక్కరాయలు. ఈ తతంగాన్ని విద్యారణ్యస్వామే దగ్గరుండి నిర్వహిస్తున్నాడు. రెండో శంఖం శబ్దం వస్తూనే శంఖు స్థాపన చేసేశారు. కాసేపటికి మూడోసారి శంఖం శబ్దం వినిపించింది. ఆశ్చర్యపడి విషయం తెలుసుకోగా కొండ మీద వాడు రెండోసారి శంఖం ఊదక ముందే, పక్కనుండే గ్రామంలో ఒక జంగమ దేవర భిక్షం కోసం శంఖం ఊదాడు. కొండ మీది వాడు శంఖాన్ని రెండో సారి ఊదాడని భ్రమించి శంఖు స్థాపన చేసేశారు. దానితో చేసేదేమీ లేకుండా శంఖుస్థాపన సమయాన్ని లెక్కకట్టి చూస్తే విజయనగర సామ్రాజ్యం కేవలం రెండు వందల యాభై సంవత్సరాలు మాత్రమే వర్థిల్లుతుందని, ఆ తర్వాత పతనమై పోతుందనే విషయాన్ని తెలుసుకొని బాధపడ్డారు. అలా సమయంలో తేడా రావడం వల్ల విజయనగర సామ్రాజ్య వైభవ కాలం తలకిందులైందని అంటుంటారు.

ఈ ఐతిహ్యం ఇప్పటికీ జన వ్యవహారంలో ఉండడం విశేషం" అంది విజయలక్ష్మి.

"విదేశాలలో ఒకప్పుడు ఇసుక గడియారాలుండేవి. శివుని ఢమరుకంలా ఉండే ఆ గాజు పరికరంలో రెండు అరలుంటాయి. ఒక అరలోని సన్నని ఇసుక జారుతూ మరో అరలోకి పడ్తుంటాయి. అలా ఒక అరలోని ఇసుక మరో అరలోనికి మొత్తం చేరుకోవడానికి నిర్ణీత సమయం పడ్తుంది. ఆ తర్వాత ఇసుక నిండిన అరను పైకెత్తి కిందున్న ఖాళీ అరలోకి మళ్ళీ ఇసుక పడేటట్లు ఉంచుతారు. ఇలా గంటలను లెక్కిస్తారు" అన్నాడు కమలాకర శర్మ.

"ఢిల్లీలో జంతర్ మంతర్ ఉంది. అక్కడ నాలుగు పక్కల నాలుగు గోడలను కట్టి ఉంటారు. మధ్యలో కేంద్ర బిందువుగా ఒక గోడ ఉంటుంది. అక్కడ కూడా సూర్యకిరణాలు పడ్డాక ఏర్పడే నీడను బట్టి గంటలను చెప్తారు" అన్నాడు గోపీకృష్ణ.

"తిరుపతిలో కముజు పిట్టలు అధికం. అవి తెల్లవారుజామున ఆరు గంటలకు సరిగ్గా కీక్కీక్కీ అని అరుస్తాయి. అదే విధంగా సరిగ్గా సాయంత్రం ఆరు గంటలకు కూడా అలాగే అరుస్తాయి. దీనిని బట్టి కూడా ఉదయం, సాయంత్రం సమయాలను గుర్తిస్తారు. అలాగే మనిషిలో కూడా జీవ గడియారాలుంటాయి. మనం రోజూ ఏ సమయంలో నిద్ర లేస్తామో? ఏ సమయంలో నిద్ర వస్తుంది. మన శరీరంలో ఉండే జీవ గడియారాలు పని చేస్తుంటాయి" అన్నాను.

"పంచాంగం భారతీయ ఋషులు, మునులు, జ్యోతిష్యుల మేధస్సుకు తార్కాణంగా చెప్పొచ్చు. ప్రపంచ దేశాల్లో ఎవరూ ఊహించని విధంగా భారతీయ పంచాంగం సూర్య చంద్ర గ్రహణాలు ఏ రోజున ఎన్ని గంటలకు, ఎన్ని నిమిషాలకు వస్తుందో ముందే ఊహించి లెక్కకట్టి చెప్పడం అద్భుత విషయం. దీనిని బట్టి భారతీయులు కొన్ని వేల సంవత్సరాల ముందు నుండే కాల సమయాలను ఎలా గుర్తించే వారో తెలుస్తోంది. గ్రహణ సమయాల్లో తిరుమలేశుని గుడిని మూసేస్తారు. గ్రహణం వీడాక గుడిని శుద్ధి చేసి భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు" అన్నాడు కమలాకర శర్మ.

"ఒకప్పుడు తిరుపతి చిన్న వూరు. మహంతులు తిరుమల తిరుపతి దేవాలయాల పాలకులుగా ఉన్నప్పుడు తిరుమలలో, తిరుపతిలో హాథీరాంజీ మఠాలను కోటల్లా నిర్మించుకున్నారు. ఆ రోజుల్లో సంపన్నుల దగ్గర మాత్రమే గడియారాలుండేవి. సామాన్యులకు గడియారమనేది అందని ద్రాక్షే. అలాంటి సమయాల్లో తిరుమల తిరుపతి ప్రజలకు గంటలు తెలపడానికి మఠంలో గంటలు మోగించేవారు. అదే విధంగా మఠంలో భేరీలను కూడా వాయించేవారు. వీటి నిర్వహణకు ఉద్యోగస్తులుండేవారు. ఆనాడు శబ్దకాలుష్యం చాలా తక్కువగా ఉండేది కాబట్టి గంట, భేరీ శబ్దాలు తిరుపతి అంతటా వినిపించేవి. నేను చిన్న పిల్లవాడిగా ఉన్నప్పుడు



కూడా మిద్దె మీద పడుకున్నప్పుడు మఠంలోని భేరీ శబ్దాలు వినిపించేవి. ఇలా ఆయా సమయాలను తెల్పుతూ మఠంలో గంటలను, భేరీలను వాయించేవారు. తిరుమలలో కూడా ఇదే విధానాన్ని అనుసరించేవారు" అన్నాడు గోపీకృష్ణ.

"నేను చిన్నతనంలో ఉన్నప్పుడు మా బండ్లవీధి, కాపువీధిలోని సామాన్య కుటుంబాలవారు రిస్ట్‌వాచ్‌ను గానీ, గోడ గడియారాలను గానీ ఎరుగరు. అప్పుడు తిరుపతిలో సామాన్యులు సమయం తెలుసుకోవాలంటే తిరుపతిలో కేవలం మూడు చోట్ల మాత్రమే గడియార స్తంభాలుండేవి. ఒకటి నాలుగుగాళ్ళ మంటపం ముందు, ఇంకొకటి హాథీరాంజీ మఠం ముందు, మరొకటి కోదండ రామాలయం సమీపంలోని కూడలిలో ఉండేవి. నాలుగాళ్ళ మంటపం తొలగించి రోడ్డును విస్తరించినప్పుడు గడియారం స్తంభాన్ని తొలగించేశారు. నాలుగ్గాళ్ళ మంటపాన్ని పక్కనే ఉన్న గ్రామ చావిడిలో పున: ప్రతిష్ఠించారు. అయితే హాథీరాంజీ మఠం ముందు కోదండరామాలయం సమీపంలో మాత్రం ఇప్పటికీ గడియార స్తంభాలున్నాయి. అందులోని గడియారాలు మాత్రం పనిచేయవు. ఈ గడియార స్తంభాల్లోని గడియారాలు నాలుగు వైపులా లేదా మూడు వైపులా ఉండేవి. మా ఇంట్లో వాళ్ళు టైం తెలుసుకోవడానికి చిన్నప్పుడు నన్ను పంపేవాళ్ళు పెద్ద ముల్లు ఎక్కడుందో, చిన్న ముల్లు ఎక్కడుందో చూసి వచ్చి టైం చెప్పేవాడ్ని. అలా నాకు టైం చూసి చెప్పేది ఆ గడియార స్తంభాల వల్లే వచ్చింది. తర్వాత నేను ఎనిమిదో తరగతి చదివేటప్పుడు జపాన్ వారి సీకో వాచ్‌ను మా నాయన మద్రాసు నుండి తీసుకొచ్చి నాకు ఇచ్చాడు. అప్పటి నుండి ఇప్పటి వరకు నా చేతిలో వాచ్ లేకపోతే నాకు ఎట్లో ఉంటుంది. నిద్రపోయేటప్పుడు కూడా వాచ్ విప్పను. అంతలా వాచ్ నాజీవితంలో భాగమైపోయింది" అన్నాను.

"తిరుపతి శ్రీవేంకటేశ్వర హైస్కూలును మహంతులు వందేళ్లకు ముందు నిర్మించారు. ఆ స్కూలు మూడవ అంతస్తులో ఒక గంట ఉంది. ఆ గంట యంత్రం దారం హెడ్ మాస్టర్ ముందు వేలాడుతుండేది. నేను ఆ స్కూల్లో కూడా ఉపాధ్యాయుడిగా పని చేశాను. అలాగే తిరుపతి గోవిందరాజ స్వామి గుడి వెనుకవైపు

ఆనాడు తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా భవనం ఉండేది. దానిని నేడు పాత హుజూరు ఆఫీసు అని పిలుస్తారు. అక్కడ కూడా గంట గంటకు గంటలు కొట్టి సమయాన్ని తెలిపేవారు" అన్నాడు గోపీకృష్ణ.

"తిరుపతి మునిసిపాలిటి వెలిసి వందేళ్ళుపైగా అయింది. అక్కడ పురప్రజలకంతా వినిపించేటట్లు సైరెన్ మోగించేవారు. దానిని తిరుపతివాసులు శంఖు ఊదడం అంటారు. ఇలా శంఖును తెల్లవారి ఐదు గంటలకు, ఉదయం ఎనిమిది గంటలకు, మధ్యాహ్నం పన్నెండు గంటలకు, సాయంత్రం ఆరు గంటలకు, రాత్రి ఎనిమిది గంటలకు ఊదుతారు. ఆనాటి నుండి ముప్పై ఏళ్ళకు ముందు వరకు నిర్విరామంగా ఆయా సమయాల్లో తిరుపతి మునిసిపాలిటీ వారు శంఖు ఊదేవారు. ఈ శంఖును బట్టి ఉదయం ఐదుగంటలకు నిద్ర లేచేవారు కొందరు. అలాగే ఉదయం ఎనిమిది గంటలకు నాలుగ్గాళ్ళ మంటపం నుండి కూలి పనులకు వెళ్లేవారు కొందరు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు భోజన విరామంగా భావించేవారు మరికొందరు. సాయంత్రం ఆరు గంటలకు పనుల నుండి శెలవు తీసుకొనే వారు ఇంకొందరు. రాత్రి ఎనిమిది గంటలకు భోజనాలు ముగించేవారు మరికొందరు. ఇలా ఆనాడు మునిసిపాలిటి శంఖు తిరుపతి ప్రజలందరికీ చెవుల గడియారమైంది. తమాషా ఏమిటంటే నేను 1959 మే పదో తేదిన రాత్రి ఎనిమిది గంటలకు శంఖుూదుతున్నప్పుడు పుట్టానని మా అమ్మ చెప్పేది. నేను పుట్టిన సమయాన్ని కూడా శంఖు ఊదడం ద్వారా గుర్తు పెట్టుకొన్నారు మా వాళ్ళు" అన్నాను.

"తిరుమల కొండ మీద సైరన్ మోగించే వారు కారా?" అడిగింది విజయలక్ష్మి.

"తిరుమలలో సైరన్ మోగినట్లైతే స్వామివారికి, భక్తులకు ఆధ్యాత్మిక భంగం కలుగుతుందని సైరన్ పెట్టలేదు. అయితే సైరన్ లాగానే సమయం తెలుసుకోడానికి గుడి ముందుండే వెయ్యికాళ్ళ మంటపం మిద్దెపైన గంటలు కొట్టేవారు. అలాగే హాథీరాంజీ మఠంలో కూడా గంటలు, భేరీలు మోగేవి. ఇప్పుడు వాటితో పని లేకుండా పోయాయి. అందరి చేతుల్లో వాచ్‌లు, సెల్ ఫోన్లుంటే ఇక ఈ శబ్దాలతో పనేముంది. నేను కొండ మీద ఉద్యోగంలో చేరినప్పటి నుండి వెయ్యి కాళ్ళ మంటపం పడగొట్టే వరకు దాదాపుగా ఇవి ఉండేవి. కాలానుగుణంగా వచ్చిన మార్పులు ఆశ్చర్యం కల్గిస్తున్నాయి" అన్నాడు గోపీకృష్ణ.

"అయితే ఎన్ని మార్పులొచ్చినా గుడిలోని తిరుమామణి మంటపంలోని పెద్ద గంటలు మాత్రం స్వామి వారికి సమయాన్ని సూచిస్తూ ఇప్పటికీ మోగుతూనే ఉన్నాయి. ఎన్ని గడియారాలు, సెల్‌ఫోన్లు వచ్చినా తిరుమలేశుడు సమయాన్ని తెలుసుకొనేది తన గుడిలో మోగే గంటల ద్వారానే" అన్నాను.


"తిరుమల శ్రీవారికి మనం సమయాన్ని తెల్పడం కేవలం నాటకమే. ఆయన జగన్నాటక సూత్రధారి. స్వామికి అన్ని సమయాలు తెలుసు. ఆయనే ఒక కాలం... కాలానికే కాలాతీతుడు. అన్ని లోకాల సమయాలు, కాలాలు, రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలకు ఆయనే అధిపతి. అన్ని ఆయన చెప్పు చేతల్లోనే నడుస్తుంటాయి. అన్నీ ఆయనను అనుసరించే సాగుతుంటాయి... ఇక పదండి పోతాం ఇంకా ఎక్కువ సేపు ఇక్కడుంటే సాయంత్రం నైవేద్య గంటలు మోగుతాయి" అంటూ అందరినీ తీసుకొని ముందుకు సాగాడు గోపీకృష్ణ. రాములు, విజయలక్ష్మి, కమలాకర శర్మలు సమయమైపోతోందని గాలి గోపురానికి దణ్ణం పెట్టుకొంటూ సమయపాలకుడు, లోకపాలకుడైన శ్రీవారి దగ్గర శెలవు తీసుకొన్నారు.

❖ ❖ ❖ ❖ ❖


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**

**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**

**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**

**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**

**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**

**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**

**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

# పరిశోధనలో ప్రశ్నా రూపకల్పన : ప్రాధాన్యత, లక్షణాలు, పద్ధతులు

**ఆచార్య వెంకటరామయ్య గంపా,** భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** – **సంపాదకులు.**

పరిశోధన ప్రశ్న అనేది ఒక అధ్యయనం లేదా సిద్ధాంత గ్రంథం ద్వారా పరిశోధకుడు సమాధానం కనుగొనాలని లక్ష్యంగా పెట్టుకునే ప్రాథమిక ప్రశ్న. ఇది నిర్దిష్ట సమస్యను లేదా అంశాన్ని పరిష్కరించడానికి రూపొందించబడుతుంది. సమాచార సేకరణ, విశ్లేషణ, వివరణ ద్వారా ఈ ప్రశ్నకు సమాధానం లభిస్తుంది. అధ్యయనంలోని కీలక అంశాలను స్పష్టం చేయడానికి, సాహిత్యం లేదా అధ్యయనంలో పరిగణించబడే అంశాలను గుర్తించడానికి ఈ ప్రశ్న ఉపయోగపడుతుంది. ఇది అధ్యయన దిశను నిర్దేశిస్తుంది, లక్ష్యాలను స్పష్టం చేస్తుంది, అధ్యయనాన్ని క్రమబద్ధంగా నడిపిస్తుంది.

పరిశోధన ప్రశ్న రూపొందించడం అనేది పరిశోధన ప్రక్రియలో కీలక దశ. ఇది విస్తృత ఆసక్తిని నిర్దిష్ట అధ్యయన అంశంగా కుదించడంతో మొదలవుతుంది. ఈ ప్రశ్న మొత్తం అధ్యయనానికి మార్గదర్శకంగా పనిచేస్తుంది. ఇది అధ్యయన సరిహద్దులను, లక్ష్యాలను స్పష్టం చేస్తూ, దిశను నిర్దేశిస్తుంది. ఈ ప్రశ్న పరిశోధన పద్ధతి, సమాచార సేకరణ, విశ్లేషణ వంటి అంశాలను ప్రభావితం చేస్తుంది. పరిశోధన ప్రతి దశలోనూ ఈ ప్రశ్న ప్రతిబింబిస్తుంది. శాస్త్రీయ అధ్యయనాలు సమాజ శ్రేయస్సు కోసం వాస్తవాలను అర్థం చేసుకోవడానికి క్రమబద్ధమైన మార్గాన్ని అందిస్తాయి. ఈ క్రమబద్ధతకు పరిశోధన ప్రశ్న ప్రారంభ బిందువుగా నిలుస్తుంది.

తెలుగు గ్రంథాలలో పరిశోధన సమస్యను గుర్తించడం, దాని మూలాలు, సాధనాలపై సమాచారం లభిస్తుంది. అయితే, పరిశోధన ప్రశ్నల రూపొందించడంపై తెలుగు సాహిత్యంలో సమాచారం పరిమితంగా ఉంది. పరిశోధన ప్రశ్నలను రూపొందించే విధానం గురించి ఆంగ్లంలో చాలా సమాచారం ఉంది. Imed Bouchrika ఆంగ్లంలో రచించిన ' How to Write a Research Question for 2025: Types, Steps, and Examples' వ్యాసంలో పరిశోధన ప్రశ్నల గురించి విపులంగా వివరించారు. ఈ వ్యాసం పరిశోధన అంశం, సమస్య, ప్రశ్నల మధ్య తేడాలను వివరిస్తూ, ప్రశ్నల రూపొందించడంలోని సూత్రాలు, లక్షణాలు, నివారించాల్సిన లోపాలను విశ్లేషిస్తుంది.

**'ది క్రాఫ్ట్ ఆఫ్ రీసెర్చ్'** పుస్తకంలో బూత్, కొలంబ్, విలియమ్స్, ఇతరులు పరిశోధన అంశం, ప్రశ్న, సమస్య మధ్య తేడాలను స్పష్టంగా వివరించారు. ఈ మూడూ సంబంధం గలవైనప్పటికీ, వాటి సూక్ష్మ భేదాలను అర్థం చేసుకోవడం సమర్థవంతమైన అధ్యయనానికి కీలకం.

**పరిశోధన అంశం**

పరిశోధన అంశం అనేది పరిశోధకుడు ఆసక్తి కలిగిన లేదా అధ్యయనం చేయాలనుకునే విస్తృత రంగం. ఇది నిర్దిష్ట సమస్యను పరిష్కరించడానికి ఉద్దేశించినది కాదు, కేవలం ఆసక్తి లేదా జిజ్ఞాసను సూచిస్తుంది. ఈ అంశం అధ్యయనానికి సాధారణ దిశను అందిస్తుంది, కానీ నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించదు. ఇది పరిశోధకుడి ఆలోచనలకు పునాదిగా పనిచేస్తుంది, అధ్యయనం, సాధారణ రంగాన్ని నిర్వచిస్తుంది.

**ఉదాహరణలు**

**తెలుగు జానపద గేయాలలో గ్రామీణ జీవనం :** జానపద గేయాలు, పాటలు, కథల్లో పల్లెటూరి సంస్కృతి, వృత్తులు, ఆచారాలు, కష్టసుఖాలు ఎలా ప్రతిబింబించాయో పరిశీలిస్తుంది.

**తెలుగు వచన కవిత్వంలో సామాజిక స్పృహ :** స్వాతంత్ర్యం తర్వాత తెలుగు వచన కవిత్వంలో అసమానతలు, అన్యాయాలు, కార్మిక సమస్యలు, పర్యావరణ స్పృహ వంటి అంశాలను అధ్యయనం చేస్తుంది.

**తెలుగు సినిమాల్లో సామాజిక చిత్రణ :** తెలుగు సినిమాలు సమాజంలోని వివిధ అంశాలను, సమస్యలను ఎలా చిత్రీకరిస్తాయో పరిశీలిస్తుంది. ఈ అంశాలు విస్తృతంగా ఉంటాయి కాబట్టి, వీటిని నిర్దిష్ట సమస్యలుగా లేదా ప్రశ్నలుగా కుదించడం అవసరం. ఇది అధ్యయనానికి స్పష్టమైన దృష్టిని, దిశను అందిస్తుంది.

**పరిశోధన సమస్య**

పరిశోధన సమస్య అనేది నిర్దిష్ట సవాలు. జ్ఞానంలో ఖాళీ లేదా విరుద్ధమైన అంశం. ఇది ఇంకా సమాధానం లేదా పరిష్కారం కనుగొనని సమస్యను సూచిస్తుంది. ఈ సమస్య అధ్యయనానికి బలమైన ప్రేరణను అందిస్తుంది. ఇది **'ఇక్కడ ఏదో సమస్య ఉంది, దానికి సమాధానం కనుగొనాలి'** అని సూచిస్తుంది. సమస్యను గుర్తించడం అనేది పరిశోధనలో కీలక దశ, ఎందుకంటే ఇది అధ్యయన ప్రాముఖ్యతను స్పష్టీకరిస్తుంది.

**లక్షణాలు**

**వాస్తవిక సమస్య :** ఇది ఊహాజనితం కాకుండా, నిజంగా పరిష్కరించాల్సిన అంశాన్ని సూచిస్తుంది. ఉదాహరణకు, సాహిత్యంలో ఒక నిర్దిష్ట అంశంపై అధ్యయనం లేకపోవడం.

**జ్ఞానంలో ఖాళీలు :** ప్రస్తుతం తెలిసిన విషయాలకు, తెలియని విషయాలకు మధ్య అంతరాన్ని చూపుతుంది.

**ప్రాముఖ్యత :** ఈ సమస్యను పరిష్కరించడం వల్ల సమాజానికి లేదా విజ్ఞాన రంగానికి ప్రయోజనం ఉంటుందని తెలియజేస్తుంది.

**స్పష్టత :** సమస్య స్పష్టంగా, నిర్దిష్టంగా ఉండాలి, అస్పష్టత లేకుండా ఉండాలి.

**ఉదాహరణలు**

**గిరిజన, బి.సి.సాహిత్య దృక్పథం :** ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన, బి.సి.సాహిత్య దృక్పథంపై సమగ్ర విశ్లేషణలు తక్కువ. ఇది రచనలోని పాత్రలు, సామాజిక స్థానంపై పూర్తి అవగాహన కొరతను సూచిస్తుంది.

**సాంకేతిక ప్రభావం :** గ్రామీణ నేపథ్య కథానికల్లో ఆధునిక సాంకేతిక ప్రభావంపై లోతైన అధ్యయనాలు లేవు. ఇది గ్రామీణ జీవనశైలి మార్పులపై సాహిత్య ప్రతిబింబంలో స్పష్టత లోపాన్ని చూపుతుంది.

**డిజిటల్ మాధ్యమాలు :** తెలుగు పద్య కవిత్వంలో డిజిటల్ మాధ్యమాల ప్రభావంపై పరిశోధనలు పరిమితం. ఇది కొత్త తరం కవుల రచనలపై అవగాహన కొరతను సూచిస్తుంది.

**సాహిత్య విలువలు :** తెలుగు సినిమా పాటల్లో సాహిత్య విలువలు తగ్గుతున్నాయని సాధారణ అభిప్రాయం ఉంది, కానీ శాస్త్రీయ విశ్లేషణలు లేనందున ఈ అంశంపై కొంత లోపం ఉంది.

**పరిశోధన ప్రశ్న**

పరిశోధన సమస్య నుండి ఉద్భవించే స్పష్టమైన, నిర్దిష్టమైన, సమాధానం ఇవ్వదగిన ప్రశ్నను పరిశోధన ప్రశ్న అంటారు. ఇది అధ్యయన లక్ష్యాలను, సరిహద్దులను నిర్దేశిస్తుంది. సమాచార సేకరణ, విశ్లేషణకు దిశానిర్దేశం చేస్తుంది. ఈ ప్రశ్న ఏమి తెలుసుకోవాలని, ఏమి కనుగొనాలని పరిశోధకుడు లక్ష్యంగా పెట్టుకున్నాడో స్పష్టం చేస్తుంది. ఇది అధ్యయనానికి ఒక దీపస్తంభంలా పనిచేస్తుంది, దాని దిశను, లక్ష్యాన్ని స్పష్టం చేస్తుంది.

**లక్షణాలు**

**స్పష్టత :** ప్రశ్న సులభంగా అర్థమయ్యేలా, అస్పష్టత లేకుండా ఉండాలి.

**నిర్దిష్టత :** చాలా విస్తృతంగా కాకుండా, నిర్దిష్ట అంశంపై దృష్టి సారించాలి.

**సాధ్యత :** అందుబాటులో ఉన్న వనరులు, సమయం, పద్ధతులతో సమాధానం కనుగొనడం సాధ్యం కావాలి.

**ప్రాముఖ్యత :** సమాధానం కొత్త జ్ఞానాన్ని అందిస్తుంది లేదా ఉన్న జ్ఞానానికి తోడ్పడుతుంది.

**నైతికత :** ప్రశ్న నైతికంగా ఆమోదయోగ్యంగా ఉండాలి, గోప్యతను గౌరవించాలి.

**ఉదాహరణలు**

**పరిశోధన సమస్య :** ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన, బి.సి.సాహిత్య దృక్పథంపై సమగ్ర విశ్లేషణలు తక్కువ.

**పరిశోధన ప్రశ్న :** ఆధునిక తెలుగు సాహిత్యంలో గిరిజన, బి.సి. సాహిత్య దృక్పథం ఎలా ప్రతిబింబిస్తుంది? విశ్లేషణల కొరతను అధిగమించడానికి ఏ అంశాలపై లోతైన అధ్యయనం అవసరం? ఈ ప్రశ్న గిరిజన, బి.సి. సాహిత్య దృక్పథం, చిత్రణను, అధ్యయన లోపాలను పరిశీలిస్తుంది.

**పరిశోధన సమస్య :** గ్రామీణ కథానికల్లో సాంకేతిక ప్రభావంపై లోతైన అధ్యయనాలు లేవు.

**పరిశోధన ప్రశ్న :** గ్రామీణ కథానికల్లో సాంకేతిక ప్రభావం జీవనశైలి మార్పులను ఎలా చిత్రీకరిస్తుంది? ఈ విశ్లేషణల కొరత వల్ల సాహిత్యపరమైన అంతరాలు ఏమిటి? ఈ ప్రశ్న సాంకేతికత, గ్రామీణ జీవనశైలి మధ్య సంబంధాన్ని అన్వేషిస్తుంది.

**పరిశోధన సమస్య :** తెలుగు పద్య కవిత్వంలో డిజిటల్ మాధ్యమాల ప్రభావంపై పరిశోధనలు పరిమితం.

**పరిశోధన ప్రశ్న :** డిజిటల్ మాధ్యమాలు తెలుగు పద్య కవిత్వంపై ఎలాంటి ప్రభావం చూపాయి? కొత్త తరం కవుల రచనల విస్తరణలో ఈ మాధ్యమాల పాత్ర ఏమిటి? ఈ ప్రశ్న డిజిటల్ మాధ్యమాల ప్రభావాన్ని, కవిత్వ విస్తరణను అధ్యయనం చేస్తుంది.

**పరిశోధన సమస్య :** తెలుగు సినిమా పాటల్లో సాహిత్య విలువలు తగ్గుతున్నాయని అభిప్రాయం ఉంది.

**పరిశోధన ప్రశ్న :** గత దశాబ్దంలో తెలుగు సినిమా పాటల్లో సాహిత్య విలువలు ఎలా పరిణామం చెందాయి? ఈ అభిప్రాయాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడానికి ఏ కొలమానాలు ఉపయోగపడతాయి? ఈ ప్రశ్న సాహిత్య విలువల పరిణామాన్ని, విశ్లేషణ కొలమానాలను అన్వేషిస్తుంది.

**పరిశోధన అంశం :** విస్తృత రంగం, సాధారణ ఆసక్తిని సూచిస్తుంది. ఉదాహరణకు, 'తెలుగు సాహిత్యం' అనేది విస్తృత అంశం.

**పరిశోధన సమస్య :** ఆ రంగంలో నిర్దిష్ట లోపం లేదా సవాలు. ఉదాహరణకు, **'తెలుగు సాహిత్యంలో స్త్రీవాద దృక్పథంపై అధ్యయనాలు తక్కువ'** అనేది సమస్య.

**పరిశోధన ప్రశ్న :** సమస్యకు సమాధానం కనుగొనడానికి అడిగే ఖచ్చితమైన ప్రశ్న. ఉదాహరణకు, **'ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాద దృక్పథం ఎలా ప్రతిబింబిస్తుంది?'**

పరిశోధకుడు విస్తృత అంశంతో మొదలుపెట్టి, సమస్యను గుర్తించి, దానిని పరిష్కరించడానికి ప్రశ్నను రూపొందిస్తాడు. ఈ క్రమం అధ్యయనాన్ని స్పష్టంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. ఈ మూడు అంశాల మధ్య సంబంధం అధ్యయనం, నాణ్యతను, దృష్టిని నిర్ధారిస్తుంది.

**పరిశోధన ప్రశ్న, ప్రాముఖ్యత**

పరిశోధన ప్రశ్న అధ్యయనానికి వెన్నెముకగా పనిచేస్తుంది. ఇది అధ్యయనాన్ని సమర్థవంతంగా నడిపించే శక్తివంతమైన సాధనం. దీని ప్రధాన విధులు:

**1. విస్తృత అంశాన్ని కుదించడం :** విస్తృత ఆసక్తిని నిర్దిష్ట అధ్యయన లక్ష్యంగా మార్చడం ఈ ప్రశ్న, ప్రధాన పాత్ర. ఉదాహరణకు, 'తెలుగు కవిత్వం' అనే విస్తృత అంశం అసాధ్యమైన అధ్యయనం. దీనిని **'కోవిడ్ కాలంలో తెలుగు కవిత్వం: సామాజిక విమర్శ'** వంటి నిర్దిష్ట ప్రశ్నగా కుదించడం ద్వారా అధ్యయనం నిర్వహించదగినదిగా మారుతుంది. ఈ ప్రక్రియ అధ్యయనాన్ని నిర్దిష్టంగా, నిర్వహణా యోగ్యంగా చేస్తుంది.

**2. మార్గదర్శకత్వం :** పరిశోధన ప్రశ్నలు అధ్యయన దిశను నిర్దేశిస్తాయి. ఏ సమాచారాన్ని సేకరించాలి, ఏ విశ్లేషణ పద్ధతులను ఉపయోగించాలి, ఏ రకమైన సమాచార అవసరమో సూచిస్తాయి. ఈ మార్గదర్శకత్వం లేకపోతే, అధ్యయనం చెల్లాచెదురుగా, అసంబద్ధంగా మారే ప్రమాదం ఉంది. ఉదాహరణకు, **'తెలుగు జానపద కథలలో సామాజిక న్యాయం'** అనే ప్రశ్న సామాజిక న్యాయ భావనలను గుర్తించడానికి నిర్దిష్ట సాహిత్యాన్ని, విశ్లేషణ పద్ధతులను ఎంచుకోవడానికి సహాయపడుతుంది.



**3. అధ్యయన పరిమితులను స్పష్టం చేయడం :** ప్రశ్న అధ్యయన సరిహద్దులను నిర్దేశిస్తుంది. ఉదాహరణకు, **'శ్రీశ్రీ మహాప్రస్థానం: మార్క్సిస్ట్ విమర్శ'** అనే ప్రశ్న అధ్యయనాన్ని శ్రీశ్రీ కవిత్వానికి, మార్క్సిస్ట్ విమర్శకు పరిమితం చేస్తుంది. ఇది ఇతర కవులను లేదా విమర్శనా పద్ధతులను పరిగణనలోకి తీసుకోదు. ఈ స్పష్టత అధ్యయనాన్ని నియంత్రితంగా, దృష్టితో కూడినదిగా ఉంచుతుంది.

**4. అధ్యయన పద్ధతులపై ప్రభావం :** పరిశోధన ప్రశ్న అధ్యయన పద్ధతి, నమూనా పరిమాణం, సమాచార సేకరణ, విశ్లేషణలను ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు, మౌఖిక సంప్రదాయాలపై అధ్యయనం చేస్తున్నప్పుడు ఇంటర్వ్యూలు, రికార్డింగ్‌లు అవసరం కావచ్చు, అయితే డిజిటల్ పాఠాలపై అధ్యయనం చేస్తున్నప్పుడు ఆన్‌లైన్ ఆర్కైవ్‌లు, సమాచార విశ్లేషణ అవసరం కావచ్చు. సాహిత్య ఎంపికలో సాధ్యాసాధ్యాలను అంచనా వేయడానికి ఈ ప్రశ్న ఉపయోగపడుతుంది.

**5. జ్ఞాన విస్తరణకు దోహదం :** పరిశోధన ప్రశ్న కొత్త జ్ఞానాన్ని సృష్టించడానికి లేదా ఉన్న జ్ఞానాన్ని విస్తరించడానికి దోహదపడు తుంది. ఉదాహరణకు, **'గిరిజన సాహిత్యంలో అణచివేత చిత్రణ'** అనే ప్రశ్న గిరిజన సమాజ గొంతును, సాహిత్యంలో వారి ప్రాతినిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి కొత్త దృక్పథాలను అందిస్తుంది.

**ఉదాహరణలు**

**విస్తృత అంశం :** తెలుగు జానపద సాహిత్యం.

**పరిశోధన ప్రశ్న :** తెలంగాణ జానపద కథాగేయాలలో సామాజిక న్యాయ భావనల చిత్రణ ఎలా ఉంది? ఈ ప్రశ్న అధ్యయనాన్ని తెలంగాణ ప్రాంతానికి, సామాజిక న్యాయ భావనలకు కుదిస్తుంది.

**విస్తృత అంశం :** తెలుగు నాటకం.

**ప్రశ్న :** కన్యాశుల్కం నాటకంలో స్త్రీ పాత్రల చిత్రీకరణపై పాశ్చాత్య ప్రభావం ఎంతవరకు ఉంది? ఈ ప్రశ్న నాటకాన్ని, స్త్రీ పాత్రలను, పాశ్చాత్య ప్రభావానికి పరిమితం చేస్తుంది.

**విస్తృత అంశం :** తెలుగు సినిమా.

**పరిశోధన ప్రశ్న :** 2000 తర్వాత తెలుగు సినిమాల్లో సామాజిక సమస్యల చిత్రణ ఎలా మారింది? ఈ ప్రశ్న సినిమా, సామాజిక సమస్యలు, కాలపరిమితికి దృష్టిని కుదిస్తుంది.

**మంచి పరిశోధన ప్రశ్న లక్షణాలు** (FINER **ప్రమాణాలు**)

ఒక మంచి పరిశోధన ప్రశ్న కొన్ని నిర్దిష్ట లక్షణాలను కలిగి ఉండాలి. హల్లీ ఎట్ అల్. (2007) ప్రకారం, ఈ లక్షణాలను FINER ప్రమాణాలుగా గుర్తించారని Saritha Mohanan, Narayanan Parameswaran లు 'FINER criteria – What does it mean' వ్యాసంలో వివరించారు. ఈ ప్రమాణాలు పరిశోధన ప్రశ్న నాణ్యతను అంచనా వేయడానికి ఒక సమగ్ర నిర్మాణాన్ని అందిస్తాయి.

**1. సాధ్యం** (Feasible) : ప్రశ్న పరిశోధకుడి సామర్థ్యం, వనరులు, సమయానికి అనుగుణంగా ఉండాలి. ప్రాథమిక వనరులు, సమాచార లభ్యత, నైపుణ్యం, ఆర్థిక వనరులు అధ్యయన సాధ్యతను ప్రభావితం చేస్తాయి.

**పరిశోధన ప్రశ్న :** 1950–1970 మధ్యకాలంలో తెలుగు సినిమా పాటలపై ప్రజా ఉద్యమాల ప్రభావం. (పాటలు, ఉద్యమ రికార్డులు అందుబాటులో ఉన్నాయి, ఆర్కైవ్‌లు, పత్రికల ద్వారా సమాచార సేకరణ సాధ్యం.)

**కష్టమైన ప్రశ్న :** 14,15 వ శతాబ్దపు తాళపత్ర గ్రంథాలలో అజ్ఞాత కవిత్వ ప్రభావం. (గ్రంథాల లభ్యత, భాషా నైపుణ్యం, సమాచార లోపం వల్ల కష్టమైన అంశంగా మారుతుంది.)

**2. ఆసక్తికరం** (Interesting) : ప్రశ్న పరిశోధకుడితో పాటు సమాజానికి, సహచరులకు, విద్యాసమాజానికి ఆసక్తిని కలిగించాలి. ఇది పరిశోధకుడి ప్రేరణను, అధ్యయనం, సామాజిక ప్రభావాన్ని పెంచుతుంది.

**పరిశోధన ప్రశ్న :** తెలుగు స్త్రీవాద కవిత్వం : సామాజిక మార్పుపై ప్రభావం. (స్త్రీవాదం, సామాజిక మార్పు వంటి సమకాలీన చర్చలకు ఆకర్షణీయం.)

**ఆసక్తికరం కాని ప్రశ్న :** అముద్రిత పద్యాలలో అలంకార శాస్త్ర విశ్లేషణ. (విస్తృత ఆసక్తి, సామాజిక ప్రభావం పరిమితం.)

**3. నూతనత్వం** (Novel): ప్రశ్న కొత్త అంతర్దృష్టులను అందించాలి లేదా ఉన్న జ్ఞానాన్ని విస్తరించాలి. ఇప్పటికే విస్తృతంగా అధ్యయనం చేయబడిన అంశాలను పునరావృతం చేయడం నూతనత్వాన్ని లోపిస్తుంది.

**పరిశోధన ప్రశ్న :** తెలుగు ఆధునిక కవిత్వంలో మెటాఫిక్షన్ అంశాలు. (కొత్త దృక్పథం, తక్కువ అధ్యయనం చేయబడిన అంశం.)

**నూతనత్వం లేని ప్రశ్న:** నన్నయ్య భారతంలో రసపోషణ. (ఇప్పటికే విస్తృతంగా అధ్యయనం చేయబడిన అంశం.)

**4. నైతికత** (Ethical):

ప్రశ్న నైతికంగా ఆమోదయోగ్యంగా ఉండాలి. సమాచార సమ్మతి, గోప్యత, సామాజిక సున్నితత్వాలను గౌరవించాలి. ముఖ్యంగా స్త్రీలు, సామాజికంగా వెనుకబడిన వారి రచనలు లేదా మౌఖిక చరిత్రలతో వ్యవహరించేటప్పుడు నైతికత కీలకం.

**పరిశోధన ప్రశ్న :** తెలుగులో ప్రాంతాల్లో సాహిత్య సభలు, సమావేశాలు: భిన్న అభిప్రాయాలు (ప్రస్తుతం చాలా సున్నితమైన అంశం. కవుల అనుమతితో, నైతికంగా చేయవచ్చు.)

**అనైతిక ప్రశ్న :** విమర్శకుల వ్యక్తిగత జీవితాలపై విమర్శ ధోరణి. (గోప్యతను ఉల్లంఘిస్తుంది, నైతిక సమస్యలను లేవనెత్తుతుంది.)

**5. సంబంధితం** (Relevant): ప్రశ్న శాస్త్రీయ సమాజానికి, సమకాలీన అవసరాలకు, సామాజిక సందర్భానికి సంబంధితంగా ఉండాలి. ఇది జ్ఞాన విస్తరణకు లేదా సామాజిక అవసరాలకు దోహదపడాలి.

**ప్రశ్న :** తెలుగు భాషా బోధనలో కృత్రిమ మేధస్సు పాత్ర. (విద్యా, సాంకేతిక రంగాలకు సంబంధితం, సమకాలీన అవసరాలకు అనుగుణం.)

**సంబంధితం కాని ప్రశ్న :** అంతరించిపోతున్న మాండలికంలో వ్యాకరణ నియమం. (విస్తృత ఆసక్తి, సామాజిక ప్రభావం పరిమితం.)

**పరిశోధన ప్రశ్న రూపొందించే సూత్రాలు**

పరిశోధన ప్రశ్నను రూపొందించడం అనేది పునరావృత ప్రక్రియ. ఇది ఒకేసారి పూర్తి కాదు, అధ్యయనం పురోగమిస్తున్న కొద్దీ మార్పుచేయటం అవసరం. ఈ సూత్రాలు అధ్యయనాన్ని స్పష్టంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి సహాయపడతాయి.

**1. విస్తృత అంశంతో మొదలుపెట్టడం :** పరిశోధకుడు ఆసక్తి కలిగిన విస్తృత రంగాన్ని ఎంచుకోవాలి. ఉదాహరణకు, **'తెలుగు నవలలో సామాజిక అవాస్తవికత'.** ఈ అంశం అనేక అన్వేషణ మార్గాలను అందిస్తుంది. వ్యక్తిగత ఆసక్తితో పాటు సమాజంలో ప్రస్తుత పోకడలను పరిగణించడం ముఖ్యం. ఉదాహరణకు, సామాజిక ఉద్యమాలు, సాంకేతిక మార్పులు, పర్యావరణ సమస్యలు వంటి సమకాలీన అంశాలు.

**2. ప్రాథమిక పరిశోధన :** ఎంచుకున్న అంశంపై ఉన్న సాహిత్యాన్ని సమీక్షించాలి. ఖాళీలను, ఇప్పటికే ఉన్న విశ్లేషణలను అర్థం చేసుకోవడం అవసరం. తెలుగు సాహిత్య పత్రికలు, సిద్ధాంత గ్రంథాలు/వ్యాసాలు, అంతర్జాలంలో పుస్తకాలు, గ్రంథాలయాలు ఈ సమీక్షకు ఉపయోగపడతాయి. ఉదాహరణకు, shodhganga లో ఉన్న తెలుగు సిద్ధాంత గ్రంథాలను సమీక్షించడం ద్వారా పరిశోధన

ఖాళీలను గుర్తించవచ్చు.

**3. అంశాన్ని కుదించడం :** పరిశోధన ఖాళీలను గుర్తించి, నిర్దిష్ట అంశంపై దృష్టి పెట్టాలి. ఈ ప్రక్రియ అధ్యయనాన్ని నిర్వహణా యోగ్యంగా చేస్తుంది.

**ఉదాహరణ :**

**విస్తృత అంశం :** తెలుగు నవలలో సామాజిక వాస్తవికత.

**కుదించిన అంశం :** స్వాతంత్ర్యానంతర గ్రామీణ నవలలో రాజకీయ మార్పులు.

**పరిశోధన ప్రశ్న :** 1970ల తర్వాత తెలుగు గ్రామీణ నవలలు భూసంబంధిత మార్పులను ఎలా ప్రతిబింబించాయి? ఈ ప్రశ్న భూసంబంధిత మార్పులు, గ్రామీణ నవలలు, 1970ల కాలపరిమితికి దృష్టిని కుదిస్తుంది.

**ప్రశ్న సమర్థతను అంచనా వేయడం :** FINER ప్రమాణాల ఆధారంగా ప్రశ్నను సమీక్షించాలి. సహచరులు, మార్గదర్శకులు, విద్యా సమాజం నుండి అభిప్రాయం తీసుకోవడం ఉపయోగకరం. ఈ దశ ప్రశ్న సాధ్యమా, ఆసక్తికరమా, నూతనమా, నైతికమా, సంబంధితమా అని నిర్ధారిస్తుంది. ఉదాహరణకు, ప్రశ్న సమాచార లభ్యత, సమయం, వనరులకు అనుగుణంగా ఉందా అని పరిశీలించాలి.

**నివారించాల్సిన సాధారణ లోపాలు**

పరిశోధన ప్రశ్నను రూపొందించేటప్పుడు కొన్ని లోపాలను నివారించడం అధ్యయన నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఈ లోపాలు అధ్యయనాన్ని అస్పష్టంగా, అసాధ్యంగా లేదా పునరావృత్తిగా మార్చవచ్చు.

**1. అతి విస్తృత ప్రశ్నలు :** 'తెలుగు సాహిత్యం' లేదా 'తెలుగు కవిత్వం' వంటి ప్రశ్నలు అస్పష్టంగా ఉంటాయి. ఇవి అధ్యయనాన్ని చెల్లాచెదురుగా, అసంబద్ధంగా చేస్తాయి. నిర్దిష్ట దృష్టి అవసరం. ఉదాహరణకు, **'తెలుగు కవిత్వంలో సామాజిక స్పృహ'** అనే ప్రశ్నను **'2000 తర్వాత తెలుగు కవిత్వంలో పర్యావరణ స్పృహ'**గా కుదించాలి.

**2. సాధ్యం కాని ప్రశ్నలు :** ఉదాహరణకు, **'తెలుగులో ప్రధాన స్త్రీ పాత్రలు'** అనే ప్రశ్న అధిక సమాచార లభ్యత, కాలపరిమితి వల్ల కొంచె కష్టమైనది. ఇటువంటి ప్రశ్నలు అధ్యయనాన్ని విఫలం చేస్తాయి.

**3. ఉన్న సాహిత్యాన్ని విస్మరించడం :** ఇప్పటికే ఉన్న అధ్యయనాలను సమీక్షించడం విఫలమైతే, అధ్యయనం పునరావృత్తిగా మారుతుంది. ఉదాహరణకు, 'పోతన భాగవతంలో భక్తి రసం'పై వందలాది వ్యాసాలు ఉన్నాయి. వాటిని విస్మరించడం పునరావృత్తికి, జ్ఞాన లోపానికి దారితీస్తుంది. సమగ్ర సాహిత్య సమీక్ష జ్ఞాన ఖాళీలను గుర్తిస్తుంది.




**ముగింపు**

పరిశోధన ప్రశ్న అనేది అధ్యయనానికి దిశానిర్దేశం చేసే కీలక సాధనం. ఇది విస్తృత అంశాన్ని నిర్దిష్ట లక్ష్యంగా కుదిస్తుంది, సరిహద్దులను నిర్దేశిస్తుంది, సమర్థవంతమైన విశ్లేషణకు మార్గం సుగమం చేస్తుంది. FINER ప్రమాణాలను అనుసరించడం, సాధారణ లోపాలను నివారించడం ద్వారా పరిశోధకులు స్పష్టమైన, ఆసక్తికరమైన, నూతనమైన, నైతికమైన, సంబంధితమైన ప్రశ్నను రూపొందించవచ్చు. తెలుగు సాహిత్య అధ్యయనాలలో ఈ ప్రశ్నలు జ్ఞాన విస్తరణకు, సామాజిక అవగాహనకు దోహదపడతాయి. సమగ్ర సాహిత్య సమీక్ష, నిర్దిష్ట దృష్టి, నైతిక పరిగణనలు, సమకాలీన సందర్భంతో సంబంధం ఈ ప్రక్రియలో ముఖ్యమైనవి. ఈ విధంగా, పరిశోధన ప్రశ్న అధ్యయనాన్ని క్రమబద్ధంగా, లక్ష్యప్రాయంగా నడిపిస్తూ, సాహిత్య రంగంలో కొత్త అంతర్దృష్టులను అందిస్తుంది.

**ఉపయోగించుకున్న తెలుగు పుస్తకాలు :**

1. జయప్రకాష్, ఎస్. పరిశోధనా విధానం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2011. (1990)

2. వెలుదండ, నిత్యానందరావు. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2013.

**ఆంగ్ల పుస్తకం**

1. Booth, Wayne C., et al. The Craft of Research. Chicago: The University of Chicago Press, 2016.

**ఉపయోగించుకున్న వ్యాసాలు**

1. Bouchrika, Imed. How to Write a Research Question for 2025: Types, Steps, and Examples. Research.com, 2025, https://research.com/research/how-to-write-a-research-question.

2. Mohanan, Saritha, and Narayanan Parameswaran. FINER criteria - What does it mean? Journal of Indian Orthodontic Society, vol. 41, no. 4, 2007, pp. 195-198

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (32) హైదరాబాద్ ఆగస్టు : 2025

# తొలి తెలుగు స్వతంత్ర కవి – పాల్కురికి సోమనాథుడు

**డా. మరపతి మాంతయ్య,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు, తారా ప్రభుత్వ కళాశాల (స్వ), సంగారెడ్డి.
ఫోన్ : 9441496273

**ఉపోద్ఘాతం**

తెలుగు సాహిత్యంలో పాల్కురికి సోమనాథునికి విశిష్టస్థానమున్నది. సోమన రచనలన్నీ స్వతంత్రములే. దేనికీ అనువాదాలు కావు. సోమనాథుడు అష్టభాషాప్రవీణుడు. సంస్కృతం, తెలుగు, కన్నడ మొదలగు భాషలలో విశేషపాండిత్యంగలవాడు.

సోమనాథుని జన్మస్థలం వరంగల్లుకు సమీపంలోగల పాల్కురికి అనే గ్రామం. సోమేశ్వరుని అనుగ్రహంతో జన్మించినందువలన తల్లిదండ్రులు "సోమనాథుడు" అని పేరు పెట్టారు.

సోమనాథుని తల్లి "శ్రియాదేవి" తండ్రి "విష్ణురామిదేవుడు". సోమనాథుడు బసవేశ్వరునికి సమకాలికుడు. 12వ శతాబ్దానికి చెందిన కవి. కన్నడ ప్రాంతంలో బసవేశ్వరుడు చేసిన సంస్కరణలను గూర్చి, ఆయన వచన సాహిత్యాన్ని విని, భక్తి భావాలను పరిశీలించి, బసవేశ్వరుని కీర్తిస్తూ "బసవపురాణము" రచించాడు. వీటితో పాటు బసవోదాహరణ, బసవరగడ, వృషాధిపశతకము, అక్షరాంకగద్య మొదలగునవి రచించాడు.

**సోమనాథుని కావ్యారంభ పద్ధతి :** సోమనాథుడు కవ్యారంభంలో సంస్కృత శ్లోకముతో ప్రారంభించే పద్ధతిని కూడా వదలి, తెలుగు పద్యంతోనే తన రచన ప్రారంభించాడు. దేశిరచన చేయడం సోమనాథుని పరమలక్ష్యం.

సోమనాథుని గురించి తెలుసుకొనుటకు ఆధారములైన ముఖ్య గ్రంథములు 1. సోమనాథుని రచనలైన బసవపురాణాది గ్రంథములు. 2. పిడపర్తి సోమన రచించిన పద్యబసవపురాణము. 3. కన్నడకవి తోంటదసిద్ధలింగకవి రచించిన పాల్కురికి సోమేశ్వర పురాణము. 4. ఏక్రామనాథుని ప్రతాపచరిత్రము పేర్కొనదగినవి.

పాల్కురికిసోమనాథుని రచనలను గూర్చి పిడపర్తి సోమన పద్యబసవపురాణములో పీఠికలో పేర్కొన్నాడు.

సీ॥ బసవపురాణంబు, పండితారాధ్యుల
చరితంబు, ననుభవసారమును జ
తుర్వేదసార సూక్తులు, సోమనాథ భా
ష్యంబును, రుద్రభాష్యంబు, బసవ
రగడ, గంగోత్పత్తిరగడ, శ్రీబసవాధ్య
రగడయు, సద్గురురగడ, చెన్న
మల్లుసీసములు, నమస్కారగద్య, వృ
షాధిపశతకంబు, నక్షరాంక

**తే॥గీ॥ గద్యపద్యముల్, పంచప్రకారగద్య**
**యష్టకము, పంచకము, నుదాహరణయుగము**
**నాదియగుకృతుల్ భక్తహితార్థబుద్ధి**
**జెప్పెనని భక్త సభలలోజెల్లుచుండు**

**సోమనాథుని పద్యరచనలు :** అనుభవసారము, వృషాధిపశతకము, చతుర్వేదసారము, చెన్నమల్లుసీసములు, సోమనాథుని పద్యకృతులు.

**ద్విపద రచనలు :** బసవపురాణము, పండితారాధ్యచరిత్ర

**లఘుకృతులు :** రుద్రభాష్యం, సోమనాథభాష్యం, బసవరగడ, సద్గురురగడ, పంచప్రకారగద్య, నమస్కారగద్య, అక్షరాంకగద్య, బసవోదాహరణం, బసవలింగనామావళి మొదలైన లఘుకృతుల నెన్నింటినో రచించాడు సోమనాథుడు.

సోమనాథుడు అనుభవసారమందు తన గురించి చెప్పుకుంటూ

**"భృంగిరిటి గోత్రుడను గురు**
**లింగార్యతనూజుండ శివకులీనుడ దుర్వ్యా**
**సంగ వివర్జిత చరితుడ**
**జంగమలింగప్రసాద సత్ప్రాణుండన్"** అని పేర్కొన్నాడు.

బసవపురాణమునందు

**"ధరనుమా మాతాపితారుద్రయనెడు**
**వరపురాణోక్తినీశ్వరకులజుండ**
**భక్తికారుణ్యాభిషిక్తుండబాశ**
**ముక్తుండ గేవలభక్తిగోత్రుండ**
**భ్రాజిష్ణుడగు విష్ణురామిదేవుండు**
**దేజిష్ణువగు శ్రియాదేవియమ్మయును**
**గారవింపగనొప్పు గాదిలి సుతుడ**
**వీరమాహేశ్వరాచారవ్రతుడ"** నని పేర్కొన్నాడు.

దీనిననుసరించి బండారుతమ్మయగారు సోమనాథుడు జంగమ మాహేశ్వరుడని నిరూపించాడు. విష్ణురామిదేవుడు శ్రియాదేవి అసలు తల్లిదండ్రులో, లేక పోషించినవారో తెలియదు.

పండితారాధ్యచరిత్రలో "మునుబసవ పురాణమున నెన్నబడిన పెనుపారు జనులకు బెంపుడు కొడుక" అని మాత్రమే తెలిపి,

**"బసవని పుత్రుండ, బసవగోత్రుండ**
**...................................**
**మద్గురు లింగ ఘన కరుణాహస్తగర్భ**
**సంభవుడ"** నని చెప్పుకొన్నాడు.

సోమనాథుని దీక్షాగురువు గరులింగార్యుడు. విద్యాగురువు కరస్థలి విశ్వనాథయ్య. బసవపురాణములో **"ఖ్యాతిచే సద్భక్తి గల కట్టకూరి పోతిదేవుని పదాంబుజ షట్పదుండనని"** పేర్కొనినందు వలన **"కట్టకూరి పోతిదేవర"** కూడా సోమనాథుని గురువని తెలుస్తుంది.

పాల్కురికి సోమనాథుడు రచించిన ప్రఖ్యాత రచనలను గూర్చి కొన్నింటిని విశదీకరిస్తున్నాను.

**అనుభవసారము :** ఇది సోమనాథుడు రచించిన ప్రథమ పద్యకృతి. ఇందులో మొత్తం 245 పద్యములున్నాయి. ఈ "అనుభవసారము" నుగోడగిత్రిపురారి' అనే భక్తునికి అంకితమిచ్చాడు.

**కం॥ "అనుభవసారంబనగా**
**మనసిజహరు శుద్ధభక్తి మార్గము వేదో**
**క్త నిరూఢి బురాణ రహ**
**స్యనియుక్తిని, విస్తరింతునదియెట్లనినన్"** అనే పద్యముతో ప్రారంభించి, గురుభక్తిమహిమ, భక్తిస్వరూపము, భక్తలక్షణము, శివపూజాపద్ధతి, ఇష్టలింగార్చన విధి, జంగమసేవ, షట్స్థలవివరణ మొదలగు వీరశైవధర్మములను వివరించాడు.

"అనుభవసారము" లో త్రిభంగి, క్రౌంచపదము, తరువోజ, వనమయూరము వంటి వృత్తపద్యములు, చతుర్విధ కందము వంటి చిత్రకవిత్వము కూడ కనిపిస్తుంది. అనుభవసారము సోమనాథునికిగల వృత్తపద్యరచనా విశిష్టతను నిరూపిస్తుంది. ఇందులోని ఒక్క పద్యము

**వ్రాలున్వ్రాలుశివార్చనా పరవశవ్యాప్తిన్ప్రమోదంబునన్**
**గ్రాలున్గ్రాలునహర్నిశంబు శివలింగ ధ్యాన సంపన్నుడై**
**సోలున్సోలు నపారసార వివిధస్తోత్ర ప్రలాపంబులన్**
**దేలున్దేలు మహానుభావ సుఖ వార్ధిన్ భక్తుదుద్యద్గుణా!!**

**బసవపురాణము :** తెలుగు సాహిత్యములో వెలువడిన తొలిద్విపద కావ్యము, స్వతంత్రకావ్యము "బసవపురాణము" వీరశైవధర్మోద్ధారకు డైన బసవేశ్వరుడు నందీశ్వరుని అవతారమని సోమనాథుడు అభివర్ణించాడు.

"బసవపురాణము" ఏడు ఆశ్వాసాలుగల ద్విపదకావ్యం. ఇందులో బసవేశ్వరుని పూర్వ అవతారములు, జననము, వ్యవహారదక్షత, మహాత్మ్యములు, జంగమసేవ, వీరశైవధర్మరక్షాప్రచారము మొదలగునవి వర్ణింపబడ్డాయి.

బసవపురాణములో 75మంది శివభక్తుల కథలు రచింపబడ్డాయి. 'బసవపురాణము'ను శ్రీశైల మల్లికార్జునస్వామి దివ్యమంటప ప్రాంగణములో రచించాడు. భక్తజనుల గోష్ఠిలో రచించినట్లుగా సోమనాథుడు పేర్కొన్నాడు. గొబ్బూరి సంగనామాత్యుడు శ్రోతగా కావ్యరచన సాగినది. 'బసవపురాణము'లో కథాసంవిధానం బహుప్రశంసనీయం.

గొడగూచికథ, ముగ్ధసంగయ్యకథ, బెజ్జమహాదేవి కథ, కన్నప్పకథ, మాదిరాజయ్యకథ, మడివేలుమాచయ్యకథ అద్భుతంగా వర్ణించ బడినాయి. సోమనాథుడు మాతృహృదయమును వర్ణించినతీరు

**"మఱియును వినుబెజ్జమహాదేవియనగ**
**గఱకంఠ శ్రీపాద కమలాంతరంగ**



**యెల్లనియోగంబులెల్లబాంధవులు**
**నెల్లవారలుగల్గనిట్లు భర్గునకు**
**దల్లి లేకుండుటదావిచిత్రంబు**
**..................................."** అని

భావించి, **"తల్లి ఉన్న ట్లయితే శివునకు ఇటువంటి దురవస్థ సంభవించేది కాదుగదా"** అని చింతించి

**"ఊరకుపేక్షించియుండంగ దగునె**
**యారంగదల్లినై హరుని నేనైన**
**నరసెదగాక యిట్లఱలేకపెనుచు**
**తరుణియకాదెట్లుదల్లిదా" ననుచు**
**ననయంబు బెజ్జమహాదేవిదాన**
**జననియై పరమేశుదనయగావించి**
**..................................."** అంటూ

శివుని సాకింది.

ఆమె నిశ్చలముగ్ధభావభక్తికిమెచ్చి, శివుడు ఆమె చేసే బాల్యోపచారముల నన్నింటినీ అంగీకరించాడు.

**''ఏకయేవహిరూపేణ''** అని **''సాధకస్సంస్మరేత్సదా''** అనే ప్రవాణ వాక్యములననుసరించి

**"భక్తుదెబ్బంగిగా భావించు శివుడు**
**వ్యక్తిగా దద్రూపుడై యుండుటరుదె?**

శివుడు బెజ్జమహాదేవిని పరీక్షించదలచి, **"దండి రోగంబైన తఱుచంటిక్రియను"** చనుబాలు త్రాగుట మానినాడు. అప్పుడు తల్లి విలవిలలాడి పోయింది.

**"................నాయన్న**

**నాకన్న! నాపట్టి! నాచిన్నివడుగ!**

**నాకుట్టి! చన్నేల రాకుడ్వైతి!**

**నీచెమటయుజూచి నెత్తురునపుడు**

**నోచెల్ల! యెటుసూడనోపుదునన్న**

**తల్లి గదన్న! యింతటికోర్తునన్న"** అని పలవరించి, పలవరించి, చివరకు

**"పనియేమి? మాటలబాయునే తెవులు?**

**నినుగొంతవీఁటిడి తనమడ్గనేల?**

**బాలజూడంగ నీసంకటంబింక**

**బాలుండ! నీమీద! బ్రాణముల్విడుతు"** నని తలచుచుండగా శివుడు ప్రత్యక్షమై, శివుడామెను అనుగ్రహించాడు.

ముగ్ధ సంగయ్య కథలో –

**"జగములన్నియుదనశక్తిబాలించు**

**జగదేక సుందరి సంతతిమేము**

**శివరహస్యాది ప్రసిద్ధ శాస్త్రములు**

**శివునిచేబడసిన చెలువ శిష్యులము"**

అనే ఈ వర్ణన శృంగార నైషధములోని –

**"నలినసంభవుని వాహనపువారువములు**

**కులముసాములు మాకుగువలయాక్షి"** అనే వర్ణనకు మాతృక పోతన రచనలకు మూలము బసవపురాణమని పేర్కొనవచ్చు.

**"చిన్ని వెన్నెలకందువెన్నుదన్ని సుధాబ్ధి**

**బొడమిన చెలువతోబుట్టుమాకు"** అనే మనుచరిత్రలోని వర్ణనకు సోమన రచనలే మార్గదర్శనమైనాయి.

**"మందార మకరంద మాధుర్యమునదేలు**

**మధుపంబువోవునే మదనములకు"** అనే ప్రసిద్ధ భాగవత పద్యమునకు మూలము బసవపురాణములోని –

**"క్షీరాబ్దిలోపలగ్రీడించుహంస**

**గోరునే పడియలనీరుద్రావంగ?**

**జూతఫలంబులు సుంబించు చిలుక**

**బ్రాతి బూరుగు ప్రూనిపండ్లు గన్గొనునె?**

**రొకామలజ్యోత్స్నద్రావుచకోర**

**మాకాంక్షసేయునే చీకటిద్రావ?**

**విరిదమ్మి వాసనవిహరించు తేటి**

**పరికొని సుడియునేబబ్బిలివిరుల?"**

అనే ద్విపదలు

సోమనాథుని రచనలు తరువాతి కవుల కావ్యాలకు పరిపుష్టిని చేకూర్చాయి.

**వృషాధిప శతకము :** "బసవా! బసవా! బసవా! వృషాధిపా!!" అనే మకుటంతో బసవేశ్వరుని మహిమలను వర్ణించిన శతకం వృషాధిపాశతకం.

సంపూర్ణ శతక లక్షణాలు కలిగిన తొలి తెలుగు శతకంగా పరిగణించవచ్చు. చంపకమాల, ఉత్పలమాల పద్యములతో పాల్కురికి రచించిన వృషాధిప శతకం తెలుగు సాహిత్యానికే శిఖరప్రాయమైనది.

ఈ శతకంలో సోమనాథుని పాండిత్యప్రభలు, శబ్దాలంకార వైచిత్రి, అష్టభాషా ప్రావీణ్యం నిరూపితమయ్యాయి.

**"అకుటిల లింగజంగమసమగ్రదయాకవితప్రసాది పా**

**లకురికి సోమనాథుడతి లౌల్యమునన్ బసవన్న దండ నా**

**యకునకు నొప్ప నీ శతకమర్పణచేసెధరన్ బఠించువా**

**రికి వినువారికిన్ గలుగు శ్రీయునునాయువుభుక్తిముక్తియున్"**

అని ఫలశ్రుతి. వృషాధిప శతకంలో మొత్తం 108 పద్యాలున్నాయి. ఇందులో మొదటి 45 పద్యములు అనుప్రాసతో కూడినవి.. 5 పద్యములు ఏకసమాసఘటితములు, 5పద్యములు నమస్కారాంత పద్యములు. మిగిలినవన్నీ బసవేశ్వరుని మహిమను ప్రతిపాదించునవి. ఉదాహరణకు ఒక్క పద్యం–

**సురవరపూజ్య! పూజ్యగుణశోభిత! శోభితరూప! రూపవి**

**స్ఫురతరశీల! శీలగుణపుంగవ! పుంగవసత్త్వ! సత్త్వసం**

**వర పరవాద! వాదభయవర్జిత! పాపవిచారచార! ఈ**

**శ్వరసమ! నీవెదిక్కు బసవా! బసవా! బసవా! వృషాధిపా!!**

**చతుర్వేదసారము :** పాల్కురికి సోమనాథుడు తనకు గల చతుర్వేద పారంగత్వమును చాటుకొనుటకు రచించిన గ్రంథరాజమిది. దీనిలో వీరశైవశ్రుతి స్మృతి సమ్మతము అని నిరూపించబడింది. "బసవలింగ" అనే మకుటంతో 357 సీసపద్యములతో రచింపబడింది.

సోమనాథుడు "చతుర్వేదసారము" యొక్క వైభవమును ఒక్క పద్యంతోనే తెలిపాడు.

**సీ॥ వైదికులిది శుద్ధవైదికంబిదియన**

**శాస్త్రజ్ఞులిది ధర్మశాస్త్రమనగ**

**తార్కికులిది మహాతర్కంబనంగ బౌ**

**రాణికులిదియె పురాణమనగ**

**ఆగమవిదులు దివ్యాగమంబిదియన**

**దంత్రజ్ఞులిది వీరతంత్రమనగ**

**భక్తివారంబిది భక్తిమార్గంబన**

**ముక్త్యర్థులిది మహాముక్తియనగ**

**ఆ॥వె॥ కవులు భువిని నిదియె కావ్యంబనంగ స**

**జ్జనులకెల్ల మిగుల సంతసమున**

**నిర్వికల్పరీతి చతుర్వేదసారమున్**

**పద్యముల్ రచియింతు బసవలింగ!!**

పండితారాధ్య చరిత్ర : మల్లికార్జున పండితారాధ్యుని చరిత్రను ప్రధానముగా గ్రహించి, వీరశైవధర్మ విశిష్టతను ప్రతిపాదించిన ద్విపద కావ్యం పండితారాధ్య చరిత్ర. శ్రీశైల క్షేత్రమునకు విచ్చేసిన భక్తుల ఆజ్ఞమేరకు 'పండితారాధ్య చరిత్ర' వ్రాసినట్లు సోమనాథుడు అవతారికలో పేర్కొన్నాడు.

**"శివభక్త తతియాజ్ఞ శిరమున దాల్చి**
**శివకవుల్ హర్షింప జెప్పుదు కవిత"**

పండితారాధ్య చరిత్రలో దీక్షాప్రకరణము, పురాతన ప్రకరణము, మహిమ ప్రకరణము, పర్వత ప్రకరణము అని ఐదు ప్రకరణములు కలవు. దీనికి శ్రోత సూరనామాత్యుడు. దీనిలో అనేక శివభక్తుల కథలున్నాయి. సోమనాథుడు రచించిన పండితారాధ్య చరిత్రను సంస్కృతములో గురురాజకవి రచించాడు. శ్రీనాథకవిరాజు పద్యంగా రచించాడు. కాని ఇది అలభ్యం.

పండితారాధ్యుడు రచించిన శివతత్వసారములోని కొన్ని పద్యములు ద్విపదలో కూర్చాడు సోమనాథుడు.


**కం॥ కలదననోపక లేదని**
**పలుకగనేరకయు మూకబధిరులక్రియ ని**
**మ్ముల నద్వైతులు దమ లో**
**పల వగతురు భువనభిన్నభావమునశివా!!** అనే శివతత్వసారములో గల పద్యమును –

**ద్విపద: కలదనంగా నోపకయును లేదనియు**
**బలుకనేరక మూక బధిరులక్రియను**
**బరగు భువన భిన్నభావంబు జూచి**
**యరయంగ నద్వైతమనగలావేది"** అని వాదప్రకరణములో ద్విపదలో రచించాడు.

**ఇతర కృతులు :** పాల్కురికి సోమనాథుడు బసవేశ్వరునిపై గల భక్తి తన్మయత్వంతో స్తుతిపరమైన లఘుకృతులను రచించాడు. వాటిలో కొన్ని తెలుగులో, కొన్ని సంస్కృతములో రచించాడు. పంచప్రకారగద్య, అక్షరాంకగద్య, నమస్కారగద్య, అష్టోత్తరశతనామగద్య అనునవి సంస్కృతపద భూయిష్టములు. బసవరగడ, గంగోత్పత్తిరగడ మొదలైన రగడలను కూడ సోమనాథుడు రచించాడు. 'ఉదాహరణము' అనే విశిష్ట ప్రక్రియకు కూడా సోమనాథుడే ఆద్యుడు.

బసవాష్టకము, సోమనాథస్తవము, సోమనాథ భాష్యము, రుద్రభాష్యము, వృషభాష్టకము త్రివిధ లింగాష్టకములు మొదలైనవి సంస్కృతములో సోమనాథుడు రచించిన కృతులు.

సోమనాథుడు తెలుగు సాహిత్యమును సుసంపన్నం చేయడమే కాకుండా కన్నడంలో "శీలసంపాదనె" "శివగణసహస్రమాల" మొదలగు కృతులు రచించాడు.




**"ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ**
**పూరిత సంస్కృతభూయిష్ఠరచన**
**మానుగా సర్వ సామాన్యంబుగాను**
**జానుదెనుగు విశేషము ప్రసన్నతకు"**

అని పేర్కొన్న సోమనాథుడు రాశిలో, వాసిలో ప్రసిద్ధికెక్కే రచనలు చేసి తెలుగు సాహిత్యమునకు ఎనలేని సేవ చేసిన మహాకవి పాల్కురికి సోమనాథుడు.

**"ఉరుతరగద్యపద్యోక్తులకన్న**
**సరసమైబరగిన జానుదెనుంగు**
**చర్చింపగా సర్వసామాన్యమగుట"** అని పేర్కొన్న సోమన జాను తెనుగును మిక్కిలి ఆదరించాడు.

**బలుపొడ తోలు సీరయుబాపసరుల్గిలుపారుకన్నువె**
**న్నెల తలసేదు కుత్తుకయు నిండి వేలుపుటేఱువల్గు**
**సలుగల తేని లెంకవని జానుదెనుంగున సన్నుతించెద**
**వలపుమదిం దలిర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా!!** అని సోమనాథుడు జానుతెనుగును ప్రసంశించాడు. సర్వజన సుబోధకమగు తెనుగే జానుతెనుగని విమర్శకుల అభిప్రాయము.

**ఆధార గ్రంథాలు**


1. బసవ పురాణము – పాల్కురికి సోమనాథ కవి. ప్రచురణ : పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2016.

2. ఆంధ్రసాహిత్య చరిత్ర – పింగళి లక్ష్మీకాంతం. 1974. ప్రచురణ: విశాలాంధ్ర పబ్లికేషన్స్.

3. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము – దివాకర్ల వేంకటావధాని. ప్రచురణ : ఆంధ్ర సాహిత్య పరిషత్తు. 1956.

4. సమగాంధ్ర సాహిత్యం – ఆరుద్ర. ప్రచురణ: తెలుగు అకాడమి, 2007.


❖ ❖ ❖ ❖ ❖

# గుడి దీపం

**డా. పఠాన్ ఖాసింఖాన్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆధునిక భారతీయభాషావిభాగం,
అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494 998 492

మీర్జా గాలిబ్‌గా విఖ్యాతి గాంచిన మీర్జా అసదుల్లాఖాన్ గాలిబ్ ఆగ్రాలో 1797 డిసెంబరు 27న జన్మించాడు. ఢిల్లీలో 50 ఏండ్లు నివసించాడు. బ్రతుకంతా అద్దె ఇంటిలోనే గడిపాడు. ఇహలోకంలో తాను, అతిథిగా మాత్రమే జీవిస్తున్నట్లు భావించేవాడు. హజరత్ నిజాముద్దీన్ గారి సమాధి ఆవరణలోనే 1869 ఫిబ్రవరి 15న గాలిబ్ దేహం సమాధి గావించటం సంభవించింది. మొఘల్‌రాజులు గాలిబ్‌ను నజముద్దౌలా, దబరుల్‌ముల్క్, నిజాంజంగ్ వంటి బిరుదులతో సన్మానించారు. ఇతడు ఉర్దూ, ఫారసీలలో సాహిత్య రచన చేశాడు.

గాలిబ్ తన పెన్షన్ సమస్యను పరిష్కరించుకొనుటకు కలకత్తాకు పయనమైనాడు. కాన్‌పూర్, లక్నో, బాందా, ఇలాహాబాద్, బనారస్, పాట్నా, అజీమ్‌బాద్ వంటి నగరాలలో షుమారుగా ఎనిమిది నెలలు గడిపి చివరకు కలకత్తా చేరాడు. ఇన్ని నగరాలలో విడిది చేసినా అతనిని కాశీనగరం ఆకట్టుకొన్నది. అందుకే ఆ నగరంపై 108 ద్విపదలతో సుదీర్ఘమైన ఒక మస్నవీని రచించాడు. పారసీలో 'చిరాగెదైర్' అనే శీర్షికతో విలిఖించాడు. మస్నవీ అంటే ద్విపద, 'చిరాగెదైర్' అంటే ఆలయజ్యోతి అని చెప్పవచ్చు.

ఈ సుదీర్ఘమైన కవితను బాందాలో సివిల్‌జడ్జ్‌గా ఉన్న తన మిత్రుడు మౌల్వీ మొహమ్మద్ అలీఖాన్‌కు ఒక విస్తృతమైన లేఖలో వ్రాసి పంపాడు. అందులో తాను దర్శించిన సౌందర్యాన్ని, సదనాలను, ఉద్యానవనాలను, పవిత్రతను, మహాత్మ్యమును, తాత్త్వికతను, పావనగంగను ఇంకా తనకు నచ్చిన, తృప్తి నిచ్చిన, శాంతిచేకూర్చిన, పరమానందాన్ని కల్గించిన బహువిధ విశేషాలను మనోరంజకంగా, ద్వేష భంజకంగా మస్నవీరూపంలో మలచాడు. ఈ కవితను అఖ్తర్‌హసన్ ఉర్దూలోనికి, సాదిఖ్ హిందీలోనికి, కులదీప్ సలీల్ లాంప్ ఆఫ్ ది టెంపుల్ అని ఇంగ్లీషు లోనికి అనువదించారు. ఈ పత్రం ప్రధానంగా ఉర్దూ, హిందీ అనువాదాలాధారంగా విరచిత మయ్యింది. వారణాసి వైశిష్ట్యాన్ని వెలువరించే ఈ పరిశోధనా వ్యాస ముఖ్యోద్దేశ్యం సర్వజనసమైక్యతను సాధిస్తూ సర్వప్రపంచ శ్రేయస్సును చేకూర్చటానికి ఈ మస్నవీ ద్వారా గాలిబ్ చేసిన సఫలయత్నాన్ని సువ్యక్తం చేయటం.

సాదిఖ్ హిందీ అనువాదానికి అశోక్‌వాజపేయీ వ్రాసిన ఆముఖం ముగింపు వాక్యాలు సత్యదూరములు కావని ఈ చిరాగెదైర్ సమీక్షించినప్పుడు స్పష్టమవుతుంది. **"ఏక్ ఐసే సమయ్‌మేంజబ్ హిందూ ఔర్ ఇస్లామ్ ధర్మోంకే బీచ్ దూరీ బఢానేకే అనేక్ ప్రబల్ ఔర్ నిర్లజ్జ దుశ్చేష్టాయేం హెూరహీహైఇస్ మస్నవీకా హిందీ అనువాద్ ఏక్‌తరహ్ కీ యాద్దహానీ కాకామ్ కర్తాహై కి యహ్ దూరీ కితనీ బహుత్ పహలేపట్ చుకీథీ"** (హిందూ మరియు ఇస్లాం ధర్మాల నడుమదూరాన్ని పెంచటానికి అనేక ప్రబలములైన, నిర్లజ్జతో కూడిన దుశ్చేష్టలు జరుగుతున్న సమయంలో ఈ మస్నవీ హిందీ అనువాదం – చాలాకాలం ముందే ఈ దూరాన్ని మటుమాయం చేసిందని గుర్తు చేస్తుంది.)

**"నఫ్సబా – సూర్ దమ్‌సాజ్ అస్త్ ఇమ్ రోజ్**
**ఖమూశీ మహ్‌శర్ – ఏ రాజ్ అస్త్ ఇమ్ రోజ్"**

అనే ద్విపదతో ఈ మస్నవీ ఆరంభమవుతుంది. (ఈనాడు నాశ్వాస ప్రళయ దినాన ఇస్రాఫీల్ అను దేవదూత పూరించు తూర్యమునకు ప్రాణమిత్రుని లాగ అనిపిస్తుంది. మరి ఈనాడు నా మౌనం రహస్యాలను బట్టబయలు చేసి ప్రళయ దినక్షేత్రం లాగా భాసిస్తుంది.) ఈ నాందీ ద్విపదలో దాచేస్తే దాగని సత్యాలన్నీ పటాపంచలు చేయబోతున్నానని గాలిబ్ వక్కాణిస్తున్నాడు. ఈ కవితకు ఆద్యంతము లందు కవి తన విషయాలను విదితపరిచాడు. మధ్యలో పూర్తిగా వారణాసి ప్రశంసయే విపులంగా చేసాడు.

నా హృదయం పుష్పభూమికి వచ్చింది. ఇది సుందరం, సుగంధ భరితం, సువర్ణశోభితం అయిన ఒక ఉద్యానవనం. ఇక్కడ అన్ని వైపుల నుండి వసంతం వర్షిస్తుంది. ఈ నగరం సర్వజగత్తులో భవ్యస్థలంగా కీర్తితమవుతుంది. ఢిల్లీ సహితం దీని ప్రదక్షిణ చేస్తుంది. ఈ నగరాన్ని వీక్షిస్తే అన్ని దిక్కుల నుండి వసంతం సాకారమై దర్శనమిస్తుంది. మీ చూపులు ఈ నగరశోభపై ప్రసరిస్తే స్వయంగా మీరు ఇది ఉద్యానవనమని వక్కాణిస్తారు.

కాశీ ప్రశంసలో నా సుఖస్థితి కారణంగా కవిత్వం సహితం స్వర్గ సాదృశ్యమయ్యింది. దాని హృదయ కుట్మలం వికసించింది. స్వర్గ సౌందర్యం సంప్రాప్తించింది. పావనుడైన ఓ అల్లాహ్! ఈ బనారస్‌ను ఏమనాలి. దీనికి దిష్టి తగలకుండా కాపాడు. ఇది అత్యంతానంద స్వర్గం. ఫిరదౌస్ లాంటి ఈ నగరాన్ని సదా ఆనందభరితంగా ఉంచు.

ఒక అజ్ఞాని బనారస్‌ను చైనాతో పోల్చాడు. అది వినిన తర్వాత నగర ఫాలభాగాన ముడుతల రూపంలో గంగానది అలలు ఇప్పటిదాకా ఎగసిపడుతున్నాయి. బనారస్ అస్తిత్వం మనోరమం, మహాద్భుతం. అందుకే ఢిల్లీ కూడా దీన్ని ఇష్టపడుతుంది. ఇంకో

లాగా చెప్పాలంటే దీని అందం కోసం పడి చస్తుంది. దీన్ని ఇంకా గొప్పగా సన్మానిస్తుంది. ఎల్లప్పుడు మంగళపాఠం చదువుతూ ప్రార్థిస్తుంది. సాటిలేని బనారస్‌ను ఢిల్లీ కలలో చూసి ఉంటుంది. అందుకే 'నహర్' రూపంలో దాని నోరూరింది. (నహర్ – ఇది గాలిబ్ కాలంలో ఢిల్లీ లోని చాందినీ చౌక్ నట్టనడుమ ప్రవహించేది.)

పునర్జన్మ యందు విశ్వాసం ఉన్నవాళ్ళు దాన్ని గురించి మాట్లాడినప్పుడల్లా కాశీనే ప్రశంసిస్తూ ఇక్కడ మరణించిన వాడు సజీవంగా ఉంటాడని అంటారు. ఈ ఉద్యానవనంలో మృతినొందిన ప్రతివ్యక్తి నిస్సందేహంగా ముక్తి పొందుతాడు. శరీరాత్మలబంధం ఛిన్నమై జన్మజన్మాంతర చక్రం నుంచి విముక్తుడవుతాడు. ఈ ఉద్యానవనం వారి జీవితాశల మూలధనం. ఇక్కడ మరణించిన వాడు వెంటనే అమరత్వాన్ని పొందాడని భావించండి.

భళిరా! ఈ ధరిత్రి ధన్యమైంది. ప్రతి ఆత్మకు సుఖశాంతుల నిస్తుంది. సర్వజగత్తుకు ఎట్టి దిష్టి తగిలినా కడిగేస్తుంది. ఏ విపత్తు వచ్చినా తొలగిస్తుంది. ఓ గర్వస్వభావం తెలియని వ్యక్తులారా! ఇటురండి. కొంచెం ఈ దేవకన్య జాతిని పరికించండి. వీరి లావణ్య శోభను వీక్షించిన వాళ్ళు స్వయంగా గర్వపడటం నేర్చుకుంటారని నా విశ్వాసం. ఇటువచ్చి దేహావరణమేమీ లేని ఆత్మలపై కొంచెం దృష్టి సారించండి. వీరికి పంచతత్వంతో సంబంధం లేదు. వింత ఏమంటే ఇది దృష్టిగోచరం కాదు. మనోనేత్రాలకు మాత్రమే ప్రత్యక్షమవుతుంది.

వీరికి అంగం, వర్ణం, భారం, ఆకారం ఏమీ లేదు. నఖ శిఖ పర్యంతం కేవలం ఆత్మయే – ఆత్మ ఉంది. ఇక్కడ ఎండుగడ్డిలోను, ముళ్ళలోను పుష్ప ప్రకృతి మరి ధూళిలో ప్రాణదాన స్వభావం ప్రస్ఫుటమవుతుంది.

శిరస్సు వంచి జందెమును ధరించు వ్యక్తి వివిధ వర్ణ పుష్పశోభా పరిమళములతో విరాజిల్లునట్లుగా పవనుడు కూడా ఈ నగరోద్యాన వనంలో సర్వఋతువులందు సమ్మానితుడవుతాడు.

ఇచ్చటి గుప్పెడు ధూళి విశిష్ట బ్రహ్మలీనతా వ్యవస్థలో శివాలయం వంటిది. పచ్చిక బయళ్ళలోని ఒక్కోముల్లు స్వర్గపు గరికలాంటిది. ఇది సర్వవిగ్రహారాధకుల హృదయ కేంద్రం. ఇదే ఆద్యంతం తత్పరవశుల ప్రియ పుణ్యక్షేత్రం.

**ఇబాదత్‌ఖానా – ఏ – నాకూ సియాన్ అస్త్**
**హమానాకాబా – ఏ – హిందూస్తాన్ అస్త్ – 47**

ఇది శంఖదారుల పూజా మందిరమంటారు. కాని నా దృష్టిలో ఇది హిందుస్తాన్ కాబా. 'తూర్' పర్వతంపై ప్రజ్జ్వలించిన పరమేశ్వరుని ఆద్యంతాగ్ని జ్వాలా ప్రతిరూపమే ఈ నగర ప్రతిమలందు ప్రకాశిస్తున్నది. పరమేశ్వరుడు దిష్టి తగలకుండా కాపాడుగాక.



పలుద్విపదలందు గంగాతీరంలోని సుందరాంగనలను బహు విధముల వర్ణించినాడు. బనారస్ తన అందాన్ని అలంకరించు కోవటానికి ఉదయాస్తమయములందు తన చేతి అద్దంలాగా గంగ ప్రకాశిస్తుందనటం సముచితం. అతి సుందరమైన దేవకన్య వదనం వంటి రూపం గల కాశీ ప్రతిబింబాన్ని పొందటానికి ఆకాశం, సూర్యుడనే అద్దాన్ని మేలిమి బంగారంతో వినిర్మించుకొంది.

వర్తమానంలో జరుగుతున్న అకృత్యాలను గూర్చి కవి ఒక తత్త్వజ్ఞానిని అడుగుతాడు. ఇప్పుడు లోకంలో మంచితనం, నమ్మకం, ప్రేమ, దయ, శాంతి, ధర్మనిష్ఠ రోజురోజుకు కనుమరుగవుతుంది. నిర్లజ్జ పెరిగిపోతుంది. సత్యధర్మ విశ్వాసాలు నామ మాత్రంగానే ఉన్నాయి. తెలివిగా మోసగించటం మాత్రం విరివిగా కన్పిస్తుంది.

**పిదరాహతిశ్నా – ఏ–ఖూన్ –ఏ–పిసరాహా**
**పిసరాహా దుశ్మన్ – ఏ–జాన్–ఏ పిదరాహా – 75**

తండ్రి తనయుని రక్తపిపాసిగాను, తనయుడు తండ్రి ప్రాణశత్రువుగాను మారిపోతున్నారు. అన్నదమ్ములు కయ్యానికి కత్తులు దూస్తున్నారు. ఐక్యత ఆరుదిశల నుండి ముఖం చాటు చేసికొని పారిపోతుంది. (ఆరుదిశలు – నలుదిశలు మరియు నేలనింగి) ఇట్టి ప్రళయ సూచనలన్నీ ప్రస్ఫుటమవుతున్నాయి. అయినా గాని ప్రళయం ఎందుకు రావటం లేదో ఆశ్చర్యంగా ఉంది. దయచేసి ప్రళయమార్గానికి అడ్డుకున్నది ఎవరో తెలపండి అని కవి ఆ తత్త్వవేత్తను అడుగుతున్నాడు. అప్పుడు ఆతడు నవ్వి కాశీవైపు సైగచేస్తూ ఈ వైభవోపేతమైన నగరమే దీని మూలకారణమని తెలుపుతాడు. అందం, ఐశ్వర్యం, అద్వితీయం అయిన ఈ నగరానికి నష్టం, నాశనం చేయటం సహించలేక, ఇష్టం లేక స్వయంగా పరమేశ్వరుడే ప్రళయ ఆగమానాన్ని నివారిస్తున్నాడు.

**బులంద్–ఉఫ్‌తాదః తమ్‌కీన్ –ఏ–బనారస్**
**బువద్ బర్ ఔజ్ – ఏ–అవ్–అన్దేశా నారస్ – 81**

బనారస్ మహోన్నత్యం, పరమవైభవం, ఘనతాధిక్యంను గూర్చి మానవకల్పన సహితం దాని శిఖరాన్ని చేరుకోలేక విఫలమవుతుంది.

ఈ విధంగా బనారస్‌ను బహువిధముల ప్రశంసిస్తూ తుదకు తన ఆధ్యాత్మిక భావాలను, భక్తితత్పరతను ప్రకటిస్తాడు. 'లేదు' అనే భావము నుండి గడచి, దానిని విడిచి అల్లాహ్ తప్ప వేరెవరు లేడని సమ్మతించి నినదించండని ప్రబోధిస్తూ మంగళ సత్యాన్ని పలుకుతూ మస్నవీని ముగిస్తాడు.

**జి 'ఇల్లా' దమ్ జన్–ఓ – తస్లీమ్ 'లా' శో**
**బిగో అల్లాహ్ – ఓ – వర్థ – ఏ – మాసివా శో – 108**

మంచితనం, నమ్మకం, ప్రేమ, దయ, శాంతి, లజ్జ, సత్యం, ధర్మం, వంచనారాహిత్యం, తండ్రీ తనయుల అనురాగం, అన్నదమ్ముల అనుబంధం ఈ లోకంలో అలరారాలని గాలిబ్ విశ్వశ్రేయస్సును కాంక్షిస్తున్నాడు.

'తూర్' పర్వతంపైన ప్రజ్వలించిన అల్లాహ్‌జ్యోతియే వారణాసి విగ్రహాలందు ప్రకాశిస్తుందనడం మూలాన సర్వలోక స్రష్ట ఒక్కడే అనే సమైక్యభావనను కల్గిస్తూ మతసామరస్యాన్ని గాలిబ్ మరింతగా పెంపొందిస్తున్నాడు. ఈ విధంగా విశ్వశాంతిని చేకూర్చటానికి ఈ మస్నవీ సమర్థమయినదనటం సత్యసమీచీనం.

**ఉపయుక్త గ్రంథాలు**

1. గాలిబ్, చిరాగ్–ఏ–దైర్ (ఉర్దూ అనువాదం – అఖ్తర్ హసన్), హైదరాబాద్, ఇండియన్ లాంగ్వేజస్ ఫోరం, 1974

2. సాధిఖ్ –చిరాగ్–ఏ–దైర్, హిందీ అనువాదం, న్యూఢిల్లీ, రాజకమల్ ప్రకాశన్ – 2020

3. Kuldip Salil, Lamp of the Temple, English Translation, Gurugram, Hindi Pocket Books, 2021

4. యస్. సదాశివ, మీర్జాగాలిబ్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురణ, 1969

5. యస్. సదాశివ, ఉర్దూ సాహిత్య చరిత్ర (అనువాదం) హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1963

❖ ❖ ❖ ❖ ❖

## ఆడపిల్ల పుడితే ... హర్షించేదెవరు..?

**పోలయ్య కూకట్లపల్లి**
**హైదరాబాద్, ఫోన్ : 9110784502**

తల్లి ... తనకు
ఒక కూతురు పుట్టిందని...
విరబూసిన చామంతి పువ్వని
చిరునవ్వులు చిందిస్తుంది ...

తండ్రి ... తన తల్లి మళ్ళీ
తనకు కూతురుగా జన్మించిందని..
జ్ఞాపకాల వసంతమని
మెరిసే ముత్యమని మురిసిపోతాడు...

ఆడపిల్ల పుడితే...?
కొందరు మా యింట
మహలక్ష్మి వెలసిందని...
మా యింటికి దీపమని...
మా కంటికి వెలుగని...
ప్రసన్నవదనులై హర్షిస్తారు..!

ఆడపిల్ల పుడితే ...?
కొందరు నిరుపేదలు
మోయలేని భారమని...
గుండెల మీద కుంపటని..
కొండంత త్యాగం చేసి ...
అడిగినంత కట్నమిచ్చి...
అత్తారింటికి ఆశతో పంపినా
ఆడపిల్లలకన్ని అగ్ని పరీక్షలేనని...!

అత్తామామలు..
ఆడపడుచులు ఆశబోతులైతే...?
భర్త పిరికివాడైతే మూగజీవైతే..?
కాపురంలో కట్నాల కారుచిచ్చు రేగితే
కాళ్ళ పారాణి ఆరకముందే కాటికే నని...

వయసొచ్చిన ఆడపిల్ల
ఇంట్లో బందీగా ఉంటే...?
లోకులు కాకులౌతారు..?
చెవుల్ని పొడుస్తారు
గుండెల్ని పిండి చేస్తారు...!

పేదరికం తమకు శాపమని...
తమకిక పెళ్ళి రాతన్నది లేదని
ఆ బ్రహ్మ మా నుదుట కల్యాణం
గీత వ్రాయడం మరచాడని
రాత్రింబవళ్ళు కుమిలిపోతారు..
కొమ్మల్లో చిక్కుకున్న గాలిపటాలై
ఫ్యాన్ రెక్కలకు వేలాడుతారు..!

ఆపై తల్లీదండ్రుల బ్రతుకు..
అమావాస్య రేయిలా అంధకారమే
ముందు జీవితం.. ముళ్ళబాటే...
కన్నవారికి ఈ కడుపుకోత...
తీర్చేదెవరు...
ఇక ఆడపిల్ల పుడితే....
హర్షించేదెవరు?

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గండ్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

(గత సంచిక తరువాయి)

**పుస్తకేషు చ యా విద్యా పరహస్తేషు యద్ధనమ్**
**ఉత్పన్నేషు చ కార్యేషు న సా విద్యా న తద్ధనమ్** – 130

(సమయేతు పరిప్రాప్తే న సా విద్యా న తద్ధనమ్ ) అని పాఠాంతరము – చాణక్య నీతి.

పద్యానువాదం

పుస్తకములందు జ్ఞానము పొందకున్న
పరుల చేతిలో నున్నట్టి స్వంత ధనము
అవసరమువేళ నవిచేతి కందబోవు
అరసి పొత్తము విత్తము పరుల కీకు

**అర్థం :** పుస్తకము విద్యయున్ను , ధనమున్ను, స్త్రీలను వొకరి చేతికి యిస్తే తన వ్యవహారానకురాదు గనుక యిస్తే నిష్ఫలమనిన రీతి.

**ప్రథమేనార్జితం విద్యా ద్వితీయేనార్జితం ధనమ్**
**తృతీయేనార్జితం ధర్మం చతుర్థే కిం కరిష్యతి – 131**

పద్యానువాదం

బాల్యమందున విద్యల బడయ వలెను
పడుచు వయసున ధనము సంపాదనమును
నిండు వయసున ధర్మము నిలుప జూడు
ముసలి వయసున చేయంగ వశము గాదు

**అర్థం :** మానవుడు ప్రథమ వయసున సకల విద్యలను అభ్యసించేది, రెండవ వయసున ధనము గడించేది, మూడో వయసున ధర్మకార్యములు ఆచరించేది, నాలుగో వయసున యేమి చేయలేడనిన రీతి.


**ఏకమక్షరం విద్యా గురుశిష్యా విధీయతే**
**పృథివ్యానార్జితం ద్రవ్యం యత్వాఋణం భవేత్ – 132**

పద్యానువాదం

పూని గురువు శిష్యునకును జ్ఞానభిక్ష
అక్షరమ్మైన చాలును అదియె మేలు
గొప్ప సంపద లెన్నైనకూడబెట్టి
గురువు కిచ్చిన తీరదా గురువు ఋణము

**అర్థం :** గురువు శిష్యులు వొక అక్షరమైనా ఉపదేశించును. ఆ గురువు తల్లి దండ్రి దైవమని తెలిసినా, తల్లి దండ్రుల రుణం యంత ధనమిచ్చినా తీరదు.అందు వలన గురువుకు శిష్యుడు ఎంత ధన మాన ప్రాణములు యిచ్చి నా తీర్చుకోలేడనిన రీతి.

**ఆమోద మిత్రవతేన ఆపత్కాలాని వర్జతే**
**అవేళ మాగతీ కాలే దీర్యాదేబన నాసినీ – 133**



పద్యానువాదం

పుస్తకములందు జ్ఞానము పొందకున్న
పరుల చేతిలో నున్నట్టి స్వంత ధనము
అవసరమువేళ నవిచేతి కందబోవు
అరసి పొత్తము విత్తము పరుల కీకు

**అర్థం :** పుస్తకము విద్యయున్ను, ధనమున్ను, స్త్రీలను వొకరి చేతికి యిస్తే తన వ్యవహారానకురాదు గనుక యిస్తే నిష్ఫలమనిన రీతి.

**ప్రథమేనార్జితం విద్యా ద్వితీయేనార్జితంధనం**
**తృతీయే నార్జితం ధర్మం చతుర్థే కిం కరిష్యతి – 134**

పద్యానువాదం

మొదటి పాతిక వయసున చదువ వలయు
పిదప పాతికయేండ్లలో విత్తమరయు
మరల పాతికలోన ధర్మములు చేయు
ముదిమియందేమి చేయంగ గలవు నింక?

**అర్థం :** మానవుడు ప్రథమ వయసులో సకల విద్యలను అభ్యసించేది. రెండవ వయసున ధనము గడించేది, మూడో వయసున ధర్మకార్యములు చేసేది, నాలుగో వయసున యేమి చేయలేడనిన రీతి.

**ఆమోద మిత్రవతేన ఆపత్కాలాని వర్జతే**
**అవేళ మాగతీ కాలే దీర్యాదేబన నాసినీ – 135**

పద్యానువాదం

మిత్రుని వలనె కన్పించు శత్రునిగని
పదని కాలములందున విడువ వలయు
కుండ నెత్తిన నొడుపుగా నుండజేసి
వేళ గమనించి నేలపై విసరినట్లు

**అర్థం :** తన పగవారిని ఆపత్కాలమునందు వర్జించేది. తనకు జయమై యాచపాత్రమీది కడవవేశిన రీతి పగవాన్ని విడిచెదననిన రీతి.

**యేకమప్యక్షరం నదాతారం యః గురుం నమన్యతే**
**శ్వాన యోని శతం గత్వా అంత్య చండాల జాయతే – 136**

పద్యానువాదం

ఒక్క అక్షరమేనేర్పు ఒజ్జనైన
గురువుగానొప్పు కున్నట్టి నరుడు పిదప
కుక్క జన్మంబు వడయును వందమార్లు
పిదప చండాలుడంచును పిలువబడును

**అర్థం :** ఒక అక్షరం చెప్పిన గురువునైన యెవ్వడు మన్నించక వుండునో వాడు నూరు మార్లు కుక్క యోనులందు పుట్టి కుజశాఖలో నుండును. ఆ వెన్క చండాలుడౌనని రీతి.

**అపరీక్షా నకర్తవ్యం కర్తవ్యం సుదక్షయేత్**
**పశ్చాద్భవతి సంతాపం స్ర్బాహ్మణీచ కులీనవః – 137**

పద్యానువాదం

నిజము సుపరీక్ష చేయక నేరమనుచు
శిక్ష వేయుట తప్పగు చేటు గలుగు
మనసు పశ్చాత్తాపమునందు మసలు చుండు
సద్గుణవతిని శిక్షించి చంపినట్లు

**అర్థం :** తప్పు తెలియనిది శిక్ష వేయరాదు. లేనిది పరీక్ష చేస్తే పశ్చాత్తాపమౌను. అది యెట్లన్నను బ్రాహ్మణ స్త్రీ ముందు నిజం చెప్పి చిచ్చు చొచ్చిన రీతి.

**జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీః జిహ్వాగ్రే మిత్ర బాంధవాః**
**జిహ్వాగ్రం బంధనం ప్రాప్తిః జిహ్వాగ్రే మరణం ధ్రువం– 138**

పద్యానువాదం

మనుషులకు సంపదలు గల్గు మాటతోడ
మంచిమిత్రులు బంధువుల్ మాటతోనె
మంచి యంతయు నిలుచును మాటతోడ
మాట తోడనె మనిషికి మరణమగును

**అర్థం :** యీ భూమియందు నాలుకతోనే లక్ష్మిని పొందును. నాలికతోనే మిత్రబాంధవులు, నాలిక వలననే కట్టుబడును. నాలిక వలననే మృతుండౌనని రీతి.

**ఉత్తమం కులవిద్యానాం మధ్యమం కృషి వాణిజం**
**అధమం సేవకా వృత్తిః మృతం భారోపజీవనం – 139**
(ఉత్తమా కులవిద్యాయా, మధ్యమా కృషివాణిజాత్
అధమా సేవకా వృత్తిః మృత్యుః చౌర్యోపజీవనమ్ – హితోపదేశం

తరతరాలుగా వస్తున్న కుల విద్య వల్ల జీవించుట ఉత్తమ పక్షము, వ్యవసాయ వాణిజ్యములచే జీవించుట మధ్యమము, సేవక వృత్తి అధమము, ఈ మూడూ గాక దొంగతనము మొదలైన పరమ నింద్య కర్మలచే జీవించుట మరణముతో సమానము – హితోపదేశము )

పద్యానువాదం

ఉన్న కులవృత్తి పాటించుటుత్తమమ్ము
మరియు కృషియు బేపారముల్ మధ్యమమ్ము
అన్య సేవనమగు బ్రతుకధమమగును
ముల్లెమూటలు మోయుట మృత్యు సమము
(చౌర్య వృత్తిని బ్రతుకుట చావు సమము )


అర్థం : ఎవ్వరెవ్వరు కులవిద్యల వల్ల బ్రతుకుట ఉత్తమం, వ్యవసాయ వాణిజ్యములు మధ్యమం, శావకా వృత్తి అధమం, కట్టె ముల్లె మోసిన బ్రతుకు మృతుండౌనని రీతి. (సశేషం)

❖ ❖ ❖ ❖ ❖

**శిలాక్షరం**

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2025


# చిల్లర దేవుళ్ళు నవల – మరపురాని పాత్రలు


✍ **డా. ఎల్. సుజాత,** తెలుగు అధ్యాపకులు, విశ్వవిద్యాలయ మహిళా కళాశాల, వరంగల్.
ఫోన్ : 9440281016

తొలి నవలతోనే సుప్రసిద్ధ నవలాకారుడిగా పేరు తెచ్చుకున్న రచయిత దాశరథి రంగాచార్యులు. తన జీవితమే సాహిత్యంగా సాగించి తెలుగు సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లో రచనలు చేశారు. వీరు 24 ఆగస్టు 1928న వెంకటమ్మ, వెంకటాచార్య దంపతులకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని, చిన్న గూడూరు గ్రామంలో జన్మించారు. సోదరుడు దాశరథి కృష్ణమాచార్యుల నుంచి ప్రేరణను ప్రజా ఉద్యమాల నుండి స్ఫూర్తిని చిన్ని వయస్సులోనే అందుకున్నారు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషలలో రంగాచార్యుల గారికి ప్రావీణ్యం కలదు. తెలుగు తప్ప మిగతా పై భాషలన్నింటిలో అనువాదాలు చేశారు. బాల సాహిత్యం కథలు, కథానికలు, నాటకాలు, గేయ కవిత్వం వంటి వివిధ ప్రక్రియలలో రచనలు చేసినారు. ఈ ప్రక్రియలన్నింటిలో బాగా పేరు ప్రఖ్యాతులు తెచ్చిన ప్రక్రియ మాత్రం నవల. వీరు మొత్తం ఎనిమిది నవలలు వ్రాశారు. అందులో మొదటి నవల చిల్లర దేశుళ్ళు. ఈ నవల 1964వ సంవత్సరంలో వ్రాయబడింది. 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉత్తమ నవలా బహుమతిని పొందింది.

**నేపథ్యం :** ఈ నవలా నేపథ్యం చిన్నగూడూరు గ్రామమందే. ఎక్కువ పాత్రలు ఆ గ్రామంలోనివే. సారంగపాణి పాత్ర తమ గ్రామంలోని దంతాలపల్లి వేంకటాచార్యులు. వీరు వయోలిన్ విద్వాంసులుగా ఆ గ్రామంలో ఉండేవారు. రామారెడ్డి దొర ఆ గ్రామంలోని దొరే. వారి గడియే నవలలో అచ్చు గుద్దుకుంది. నవలలో మరొక పాత్ర ఆడబాప వనజది కూడా దాశరథి ఇంటికెదురుగా ఉన్న పిచ్చమ్మ అనే ఆడబాపది. ఈ నవలలో వాతావరణం ఊరు, పండుగలు, దసరా, తామరపూలు, చావడి దాదాపు అన్ని చిన్న గూడూరుకి సంబంధించినవే. నవలలోని సంఘటనలు తెలంగాణలో ఎక్కడ ఒకచోట జరిగినవే, కథ కొంత కల్పితం అయినా సంఘటనలు మాత్రం యదార్థాలు. ఈ విషయాన్ని ఇంటర్వ్యూలో దాశరథి రంగచార్యులు గారు స్వయంగా చెప్పినారు.

చిల్లర దేవుళ్ళు నవల 1937–38 నాటి, పూర్వపు తెలంగాణ భూస్వామ్య వ్యవస్థను సామాన్య ప్రజల అగచాట్లను తెలియజేస్తుంది. నిజాం పరిపాలనా కాలంలో తెలంగాణా ప్రాంతంలో నెలకొని ఉన్న సాంఘిక పరిస్థితులను చిత్రించింది నవల. ఆ కాలంలో ప్రజలు తలరాతకు కర్తృత్వం వహిస్తూండిన దొరలు, అధికారులే ఇందులోని చిల్లరదేవుళ్ళు. ఈ అధికారుల సుఖ సంతోషాలకు, భోగవిలాసాలకు ఉపకరించడం మాత్రమే నిరుపేద బ్రతుకుల ఫలము. నిస్సహాయులైన




వారి పట్ల, స్త్రీ పట్ల అమానుష ప్రవర్తన, మతవిద్వేష శక్తుల విజృంభణ వారి సామాన్య రాజకీయ జీవితమునందేకాక, ఆర్థిక, నైతిక జీవితములందు ప్రవేశించిన విధానం, ఆనాటి పాలకుల కనుసన్నల నర్తించిన అధికారులై స్వార్థములో మానవత్వమును మరిపించే స్థితిని కన్నులకు కట్టినట్లు సమగ్రంగా విశ్లేషించారు దాశరథి రంగాచార్య చిల్లర దేవుళ్ళు నవలలో.

**ఇతివృత్త పరిచయం:** చిల్లరదేవుళ్ళు నవలకు భూమిక తెలంగాణ ప్రాంతంలోని ఒక గ్రామం. ఆనాటి ప్రజల భయభక్తులలో కొలిచిన నీచమైన మహనీయులే జమీందార్లు, పటేల్, పట్వారీలు, ఇతర స్థానికక నాయకులు. నైజాం ప్రభువు దేవుడైతే, ఈ అల్పమైన ప్రభువులే చిల్లర దేవుళ్ళు. వీరు చేసిన దౌర్జన్యాలు, దుర్మార్గాలు, దోపిడీలు నవలలోని ప్రధాన ఇతివృత్తం. ఆ గ్రామానికి సప్తాంగాలనబడే రెడ్డి, కరణం, రైతు, కోమటి, చాకలి, మంగలి, మాలమాదిగలు నవలలోని ముఖ్యపాత్రలు.

రామిరెడ్డి ఆ గ్రామంలో దేశ్‌ముఖ్ దొర. వెంకట్రావు పట్వారీ వీరిద్దరికి అభిప్రాయ బేధాలున్నా ప్రజలను దోచుకోవడం, హింసించడంలో వంటి విషయాలలో ఇద్దరు ఒకటౌతారు. పోలీసు అధికారి అమీన్, తాసిల్దార్‌లు కూడా వీరికి తోడవుతారు. రామారెడ్డి దొర నివాసం ఊరి మధ్యలో ఒక అందమైన గడీ. అందులో దొర, దొరసాని, వీరి కూతురు మంజరి, వీరితో పాటు ఆడబాప వనజ ఇతర ఆడ బాపలు కూడా ఉంటారు. రామారెడ్డి దొర సంగీత ప్రియుడు. అందుకే సంగీత విద్వాంసుడు సారంగపాణి విజయవాడ నుండి బ్రతుకు దెరువు నిమిత్తం వచ్చినపుడు అతనికి గడిలోనే ఆశ్రయం కల్పిస్తాడు. సారంగపాణి దొరకూతురు మంజిరికి, నారయ్య కూతురు సీతకి కరణం వెంకట్రావు కూతురు తాయారుకు సంగీతం

పాతాలు చెప్పుకొని బ్రతుకుతుంటాడు. సారంగపాణి దొర గడీలో వుంటూ దొరకు సన్నిహితుడుగా మెలుగుతుంటారు.

నవలలో లంబాడీల భూమి సమస్య కీలక పాత్ర వహిస్తుంది. లంబాడీలను కరణం వెంకట్రావు వారికి ఇవ్వాల్సిన భూమి, డబ్బులు ఇవ్వకుండా తప్పించుకొంటాడు. అది గ్రహించిన లంబాడీలు వెంకట్రావు మీదికి దాడి చేయబోగా వారిని పోలీసుల చేత కొట్టించి, చిత్రహింసలు పెట్టిస్తాడు. తత్ఫలితంగా లంబాడి భీక్య అతని భార్య లక్ష్మీ చనిపోతారు. వుల్టా హత్యనేరం వారిమీదనే మోపుతారు. ఇది సహించలేని లంబాడీలు కరణాన్ని అదును చూసి హత్య చేస్తారు.

నవలలో దొర చింతకాయల దొంగతనం చేసిన చాకలి పీరిగాడిని దొరకబట్టబోతే పారిపోతాడు. కొంతకాలానికి వెతికి పట్టించి, తెప్పించి బాగా కొడ్తాడు. ఆ దెబ్బలకు తాళలేక అతడు చనిపోతాడు.

మత మార్పిడి నవలలో మరో ముఖ్యమైన విషయం. నిజాం పాలనలో 'ఇత్తేహదుల్ముసల్మాన్' సంస్థవారు హరిజనులను ముస్లిం మతంలోకి మార్చుకునేవారు. అలా మార్చబడిన క్రొత్త తురకలను ఆర్య సమాజం వారు తిరిగి హిందు మతంలోకి దొర అనుమతితో నరేందర్‌జీ మార్చేవారు. ఈ నరేందర్ రచయిత దాశరథి గారి మిత్రులు. గ్రంథాలయం ఉద్యమం, ఆంధ్రమహాసభ ప్రస్తావనలు కూడా నవలలో కన్పిస్తాయి. పీరిగాడు చింతకాలయ దొంగతనం విషయంలో దొరచేత దెబ్బలు తిని చనిపోవడంతో హత్యనేరం నుండి తప్పించుకునే క్రమంలో దొర తన స్వార్థం కోసం పాణిని పావులాగా వాడుకోవాలని ప్రయత్నించడము పాణి గ్రహిస్తాడు. వీరిద్దరి మధ్య సంఘర్షణ జరగడంతో పాణిని గ్రామం వదిలి వెళ్ళిపోతాడు. మద్రాసు వెళ్ళి సినిమాలకు పాటలు పాడే ప్రయత్నంలో ఉంటాడు. గ్రామంలో మంజరి ఆరోగ్యం క్షీణించడం. దొరకు గొంతు క్యాన్సర్ రావడంతో చికిత్సకోసం మద్రాసు వస్తారు. అక్కడ దొరకు పాణికి దొర కుటుంబం కంటబడటం, పాణి తనకు బంధువు అన్న విషయం బయటపడుతుంది. చివరి దశలో దొరలో కొంత మార్పు, పశ్చాత్తాపం కనబడుతుంది. చికిత్సలేని జబ్బు అవడంతో రామారెడ్డి మరణిస్తాడు. ఇది నవలలోని ఇతివృత్తం.

**పాత్రలు :** నవలలో ముఖ్యమైన పాత్రలు-మంజరి, వనజ, ఇందిరమ్మ, తాయారు, మంగమ్మ మొదలగు స్త్రీ ప్రత్యక్ష పాత్రలు సారంగపాణి రామారెడ్డి దొర, కరణం వెంకట్రావు, అమీను, నారయ్య, మాడపాటి హనుమంతరావు, నరేందర్, పీరిగాడు మొదలగు పురుష ప్రత్యక్ష పాత్రలు. ఇవేకాక గౌండ్ల పుల్లి, సీత, భీక్య భార్య లక్ష్మివంటి మరికొన్ని పాత్రలు కథా సందర్భానుసారంగా వచ్చి పోతుంటాయి.

**సారంగపాణి :** చిల్లరదేవుళ్ళు నవలలో కథానాయకుడు సారంగపాణి. ఈ పాత్రను ఆదర్శంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. రచయిత. అతనికి సంగీత సాహిత్యాలు నేర్చుకునే జీవనం ఉంటుంది కానీ కావలసిన డబ్బు లభించక కోస్తా ప్రాంతం నుండి తెలంగాణకు వస్తాడు. రామారెడ్డిదొర గడికి చేరుకుంటాడు. రామారెడ్డి దొర, వెంకట్రావులు అధికారం పేరుతో వారు చేసే దౌర్జన్యాలు, అన్యాయాలు అతనిలో ఏవగింపును కలిగిస్తాయి. అయినా నిశ్శబ్దంగా ఉండిపోతాడు. వనజపట్ల అనురాగంతో, మంజరి పట్ల ప్రేమతో రామారెడ్డి దొర మీద గౌరవంతో మెలుగుతాడు. సంగీతం మాస్టారుగా, చదువుక్ను వ్యక్తిగా అందరి అభిమానాన్ని పొందుతాడు.

కరణం, పాణికి ధనవ్యామోహాన్ని చూసి తన కూతురు తాయారును పెళ్ళి చేసుకొమంటాడు. దానిని పాణి సున్నితంగా తిరస్కరిస్తాడు. సారంగపాణి, రామారెడ్డిదొరతో పీరిగాడి హత్య విషయంలో బేధాలు, అభిప్రాయ తలెత్తడంతో పాణి గడి వదిలి మద్రాసుకు వెళ్ళిపోతాడు. చివరకు దొరకుటుంబానికి అతడే ఆశ్రయం కల్పిస్తాడు. కొందరు కళా విమర్శకులు కళలూ, సారస్వతం భూస్వామ్య వ్యవస్థలోనే పుష్పించి వికసించినాయని చెబుతుంటూరు. కాని ఆ కళలవైనం మాటున జరిగిన మానవతా హత్యను దమనకాండను గుర్తిస్తే జుగుప్స కలుగక మానదేమో! అని అంటారు హరి (హరి పురుషోత్తమరావు).

సంగీత సాహిత్యాలలో కోస్తా ప్రాంతాలలో అభివృద్ధి ఉన్నట్లు చెబుతారు కాని అటువంటిది అక్కడ ఏమి కన్పించదు, మనిషికి మూడు పూటల సరియైన అన్నం దొరికినప్పుడే సంగీతం కాని, సాహిత్యం కాని, ఇతర కాని కళలు బయటకి వస్తాయి. తన ప్రాంతంలో సంగీత సాహిత్యాలు నేర్చుకొని ప్రశాంతంగా ఉండగలిగే జీవనం ఉంది. కాని కావాల్సినంత అదనపు డబ్బు లేదనే అనుమానం నవలలోని సారంగపాణి పాత్రల వల్ల కలుగక మానదు. అలాంటి వ్యక్తి ఎక్కువ ధన వ్యామోహంతో తెలంగాణకు వస్తాడు. తెలంగాణలోని వ్యక్తులకు కళల పట్ల అనురాగం ఆసక్తి ఉన్నప్పటికి కూడా కావల్సిన వనరులు కాని, అటువంటి మైండ్‌సెట్ గాని, ఆనాడు కన్పించదు. అదే సమయంలో కళలపట్ల, సంస్కృతి పట్ల అనురాగం కన్పిస్తుంది. అలా ఉండడం వల్లనే సారంగపాణిని తన ఇంట్లో తీసుకవచ్చి పెట్టుకుంటాడు. రామారెడ్డి దొర వెంకట్రావు కూడ తన కూతురిలో సంగీతం నేర్పిస్తాడు. ఈ విషయాలను బట్టి చూస్తే భూస్వామ్య వ్యవస్థ యొక్క మూర్ఖత్వంవల్ల వాటి వైపు పూర్తిగా మొగ్గుచూపడానికి ఇష్టపడడం లేదు అనే విషయం రామారెడ్డిదొర పాత్ర వల్ల తెలుస్తుంది. కోస్తాలోని వారికి నేర్చుకొనే సౌలభ్యం ఉ ంది గాని ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితి లేదు. తెలంగాణాలో ఫ్యూడల్ వ్యవస్థ యొక్క అహంకార ధోరణి వల్ల ఆ కాలంలో కళ అంతగా అభివృద్ధి చెందలేదు. కళల పట్ల ఆసక్తి ఉన్నప్పటికి వనరులు సృష్టించలేకపోయారు. రామారెడ్డిదొర గడీ నుండి బయటకి వచ్చేసిన పాణి విజయవాడకు వెళ్ళకుండా నేరుగా మద్రాసుకు వెళ్ళడం బట్టి చూస్తే తన ఊరిలో జీవనోపాధి లేకపోవడమే అన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఈ నవల ద్వారా పాణి మద్రాసుకు వెళ్ళి సినిమా పాటలు పాడే అవకాశం కొరకు ఎదురు చేస్తాడు.

**వనజ పాత్ర :** చిల్లరదేవుళ్ళు నవలలో వనజ పాత్ర చాలా ముఖ్యమైనది. నవలలోని స్త్రీ పాత్రలన్నింలటిలోను ఎక్కువ నిడివి ఉన్న పాత్ర వనజది. ఆనాటి తెలంగాణాలోని దొరలగడీలలో దుర్భరమైన జీవితాన్ని అనుభవించిన ఆడబాపల బతుకుల సజీవన ప్రతీక వనజ పాత్ర. వనజ పుట్టుక నుంచి అడుగడుగునా భూస్వామ్య వ్యవస్థ చేసిన గాయాలతోనూ, మచ్చలతోను గడిపింది. క్షణం క్షణం మరణించే విధివంచితులకు, చిత్రహీనులకు మరో రూపం వనజ వనజ పాణిని ప్రేమిస్తుంది. కాని తను దాసి, ఆడబాప అంటే సుమారు వేశ్య. వేశ్య తనకు డబ్బు అవసరం ఉంటేనే తనను అమ్ముకొటుంది. కాని తన బ్రతుకు వేశ్యకంటే కడుహీనమైందని బాధపడుతుంది. దొరగడీలకు వచ్చే దొరలకు ఇష్టం ఉన్నా లేకున్నా తనను అర్పించేయాల్సిందే. ఇటువంటి జీవితం గల తను సంగీత సంపన్నుడు అయినా పాణిని ప్రేమించే అర్హత లేదనుకొని అతన్ని అన్నగా భావిస్తుంది. తన దు:ఖాన్ని అతనితో పంచుకుంటుంది. ఆత్మీయుడిగా భావిస్తుంది. పాణి దొర గడీ విడిచివెళ్ళిపోతే మంజరి దగ్గరికెళ్ళి విలపిస్తుంది. వనజ మద్రాసులో పాణిని చూసి చాలా సంతోషపడుతుంది. నిస్సహాయ స్థితిలో ఉన్న రామారెడ్డి దొర కుటుంబానికి తోడు దొరికినాడని భావిస్తుంది.

రామారెడ్డి, పాణి సంగీతం నేర్పించే నెపంతో తన కూతురును ఎక్కడ ప్రేమిస్తాడేమోనని భయంతో వనజను అస్త్రంగా ప్రయోగిస్తాడు. వనజను పాణికిచ్చి పెళ్ళి చేయాలని అనుకొని వనజకు తెలియజేస్తాడు. వనజ ఈ మాటను పాణితో చెప్పి నవ్వుతుంది అంతే తప్ప దానిమించి పెద్దగా తను ఏమి స్పందించదు. ఈ నవ్వు వెనకాల తన జీవిత అగాథాల తాలూకు భయంకర రహస్యాలు ఉండడము మంజరీ తన ప్రేమకు వనజ అడ్డస్తుందని భావించి, పాలగ్లాసు పడవేసిందనే నేపంతో వనజను కొట్టినప్పుడు మౌనంగా ఉండి పోతుంది. మంజరి ఆరోగ్యం క్షీణిస్తే రామారెడ్డి దొర వనజను గొడ్డును బాదినట్లు బాదుతుంటే తన కర్మ అని భరిస్తుంది. తనకు అడ్డువచ్చిన కారణంగా పాణి కూడా దెబ్బలు తిన్నందుకు దుఃఖిస్తుంది. వనజ తన తల్లి చరిత్రను పాణితో చెబుతూ తన పుట్టుకకు కారణం రామారెడ్డిదొర అనే విషయాన్ని తెలియజేస్తుంది. రామారెడ్డిదొర కాన్సర్‌తో మరణించినపుడు నాన్నా అని మీద పడి ఏడుస్తుంది. తన జీవితం ఇన్ని సంఘర్షణలను అనుభవించడానికి కారకుడు రామారెడ్డి దొర. అయినా కూడా ఆ కుటుంబం బాగును కోరుకునే సహృదయం గొప్ప పాత్రగా కన్పిస్తుంది నవలలో వనజ పాత్ర.

తెలంగాణాలోని ఆనాటి భయంకరరమైన ఒక సామాజిక ఆచారాన్ని వనజ పాత్రద్వారా చిత్రించారు రచయిత. మూగ మనసులో మానవతను అంతర్లీనంగా దాచుకున్న వాస్తవ జీవితానికి ప్రతిరూపం వనజ. నవలలో దాశరథి రంగాచార్యులు మనసును మించిన మనిషిగా ఎదిగినట్లు సహజంగా చిత్రించారు. ఈ పాత్రను తనను గరించిన ప్రశ్న తనదే, జవాబు కూడా తనదే. ఆశపడుతుంది



కోరుకుంటుంది. వనజ పాత్రను రంగాచార్యులు పాఠకుల మనస్సులను కదిలించే విధంగా తీర్చిదిద్దారు. తన ఏడు నవలలోని అన్ని పాత్రలకంటే వనజ పాత్ర అంటేనే ఎక్కువ ఇష్టం ఉన్నట్లు ఒక ఇంటర్వ్యూలో తెలియజేశారు. ముదిగంటి సుజాతారెడ్డిగారు 'ముసురు' (ఆత్మ కథ)లో ఈ ఆడబాప వ్యవస్థను తన మామగారి స్నేహితులు వెలమదొరల ఇండ్లల్లో ఈ ఆచారం 1760–70 వరకు కూడా కొనసాగిస్తున్నట్లు తెలియజేసారు. ఆడబాపల అవస్థలను స్వయంగా చూసిన సుజాతారెడ్డి తన ఆత్మకథలో, మలపు తిరిగిన రథ చక్రాలు అనే రచనలలో తెలియజేసారు.

**కరణం వెంకట్రావు :** నవలలో చిత్రించబడిన పాత్రలలో వెంకట్రావు పాత్ర ఒకటి. ఊరిని దొచుకోవడంలో రామారెడ్డి తర్వాత పేర్కొనతగిన వాడు, విలువలేని జీవితానికి సింబాలిక్ వెంకట్రావు పాత్ర. తన సుఖం కోసం గౌండ్ల పుల్లిని లొంగదీసుకొని ఆమె భర్త గౌండ్ల పీరిగాడిని హత్య చేసి, శవాన్ని కూడా దొరకకుండా మాయం చేస్తాడు. ఇతని క్రౌర్యానికి భార్య మంగమ్మ పిచ్చిది అవుతుంది.

వెంకట్రావు తన భార్య మంగమ్మను ఏవిధంగానైతే మోసగిస్తాడో అదే తరహాలో తను చేసిన పాపపు పనికి ప్రతిరూపం అయిన కూతురు తాయారు అలాగే చేస్తుంది. ఆమె చేసిన పనికి పిచ్చివాడు అవుతాడు. ఇంట్లోనుండి గెంటివేయబడి 'హ హ. . . దగా, అంతా దగా, అని గంతులు వేస్తాడు. మంగమ్మ కూడా కేకలు వేస్తూ వచ్చి అతనితోపాటు గంతులు వేస్తుంది.

లంబాడీల భూములను దోచుకొని అమీన్ చేత వారిని కొట్టిస్తాడు. భీక్యాను, అతని భార్య లక్ష్మిని అమీను చేత చంపించి ఆ హత్య నేరాన్ని తిరిగి లంబాడీల మీద పెట్టి చివరికి వారి చేతిలోనే హత్యకు గురిఅవుతాడు. ఇటువంటి భూతగాదాలు మొండ్రాయి, జనగాం వంటి ప్రాంతాలలో కన్పిస్తాయి.

ఆనాటి కాలం నుండి నేటి వరకు కూడా బడాబాబులు నేరాలను, హత్యలను యథేచ్ఛగా చేస్తూ అమాయకుల మీద, అసహాయుల మీద నెట్టివేయడం ప్రస్తుతం కూడా కొనసాగుతునేవుంది స్వాతంత్ర్యం వచ్చినా, రాజ్యాంగం హక్కులు కల్పించినా, చట్టాలు వచ్చినా మనదేశంలో పేదవాళ్ళ వారికి చుట్టాలు అవుతున్నాయి.

దుర్మార్గులకు కాస్త వెనక ముందు అయినా దుర్మార్గులకు శిక్ష మాత్రం తప్పదు అనే విషయాన్ని కరణం పాత్ర ద్వారా తెలియజేస్తాడు రచయిత.

**రామారెడ్డిదొర :** నవలా రచయితలు, వ్యాసకర్తలు చాలామంది నవలలోని నాయికా నాయకుల గురించి ఎక్కువగా వ్రాస్తారు. వీరి గురించి చర్చించేటప్పుడుగాని, మాట్లాడేటపుడుగాని మనకు రావల్సిన సమాచారము పూర్తిగా రాదు. ఈ పాత్రలలో మంచి లక్షణాలే ఉంటాయి. కనుక మనం వాటిని మాత్రమే ఎక్కవగా చర్చిస్తాము. అయితే సమస్య ఎక్కడ పుడుతుంది? సమస్యకు కారణం ఎవరు? అన్యాయం ఎక్కడ జరుగుతుంది అనే కోణంలో చూసినట్లయితే సమగ్రమైన విషయాలు చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. ఆ కోణంలో నుంచి రామారెడ్డి పాత్రను చర్చిద్దాం.

'చిల్లరదేవుళ్ళు' నవల రచనా ముఖ్య ఉద్దేశం రామారెడ్డిదొర లాంటి భూస్వాములు వల్ల ఆగం అయిన బతుకులగురించి తెలియ జేయడం. దేశ్‌ముఖ్‌లు గ్రామ పెద్దలుగా వుండి ఆనాటి అనేక సమస్యలకు, దు:ఖాలకు, అన్యాయాలు జరగడానికి వీరు పోషించిన మహత్తర పాత్రలను చిత్రించడం.

మనుధర్మశాస్త్రం శూద్రులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను నిరాకరించింది. ఇది అలాగే కొనసాగుతూ వచ్చింది. చరిత్రలో ఎంతోమంది పాలకులు రాజ్యపాలన చేశారు. అనేకమంది పాలకులు మారినారు. కాని సామాన్య, పేదప్రజల బతుకుల గురించి, వారి మంచిని గురించి ఆలోచించిన పాలకులు చాలా తక్కువమంది కన్పిస్తారు. తెలంగాణను పాలించిన నైజాం రాజులు భూస్వామ్య వ్యవస్థను పెంచి పోషించారు. దొరలకు, పట్వారి, పటేలు వంటి నాయకులకు ఎల్లవేళలో తమ అధికారంతో కాపాడుకుంటూ వచ్చారు. దీనితో ఈ చిల్లరదేవుళ్ళ ఆగడాలకు అడ్డు అదుపు లేకుండాపోయింది. నవలలో ఇటువంటి వ్యవస్థకు ప్రతినిధి రామారెడ్డి దొర పాత్ర.

గ్రామానికి రామారెడ్డి దొరనే ప్రభువు దేశ్‌ముఖ్, అన్నీ అతనే. గ్రామంలోని వివిధ కులాలవారు దొర గడీలో ప్రతినిత్యం ఊరికే పనిచేసి పెట్టాలి. ఈ వెట్టిచాకిరికి ప్రధానంగా గ్రామ వృత్తులవారు, దళితులు ఎక్కువగా బలయ్యేవారు. దొరలకు కోపం వచ్చినప్పుడు, ఇష్టం వచ్చిన అసభ్య పదజాలంతో వీరిని దూషించేవారు. దొరకొట్టినా, తిట్టినా, చంపివేసినా ప్రశ్నించకూడదు. ఏవరైనా తన ముందు చేతులు కట్టుకొని 'బాంచెన్ దొర కాల్మోక్తా' అని వంగి మాట్లాడాలి.

రామారెడ్డి పొలం వైపు వెళ్తున్నపుడు చింతకాయల చెట్టు వద్ద, అతని దృష్టికి వ్యక్తి పరుగెత్తడం కన్పిస్తుంది. దొర పిలిచినా పలకకుండా పరుగెత్తుతాడు. అది చూసి ఆగ్రహించిన రామారెడ్డి ఉరుము ఉరిమినట్లుగా కేక వేయగా ఆ చెట్లను, పొలాన్ని కాపలా కాస్తున్న జ్యోతిగాడు భయపడుతూ దగ్గరకి వస్తే 'దొంగతనం జరిగింది. ఏం చేస్తున్నావ్' అని గొడ్డును బాదినట్లు బాదుతాడు. నిజం ఏమిటంటే అని దొరవారి చింతచెట్లు కావు.

తాను నిలవమంటే నిలువకుండా పారిపోయిన చాకలి పీరిగాడిని కన్పిస్తే చితకబాదాలన్నంత కోసం, అందులో తాను ఆగుమన్నా ఆగకుండా పారిపోయిన పీరిగాడిని బ్రహ్మయ్య చూడటం, తన అధికారానికి గండి పడినట్లు, తన మాటలకు విలువలేనట్లు, తన ఆజ్ఞను ధిక్కరించినట్లుగా భావిస్తాడు. ఇదే తన దొరతనానికేదో అవమానం జరిగినట్లు ఉడికిపోతాడు. ఊళ్ళో ఎవ్వరితో కూడా జరిగినదాన్ని గురించి ప్రస్తావించడు.

ఈ విషయాన్ని తన ఆప్తుడిగా తలచిన సారంగపాణితో చెబుతాడు. మృదుస్వభావి అయిన పాణి **'చింతకాయల దొంగతనం చాలా చిన్న విషయం, అందుకు పీరిగాడిని కొట్టడం వల్ల ప్రయోజనం లేదని'** సలహా ఇస్తాడు. సలహా నచ్చని దొర **'బోడిముండకు దండం పెడ్తే నావలెనే ఉండుమని దీవించిందట. ప్రభుత్వం వారి గౌరవం నీకెట్ల ఎరుకైతదని'** తిట్టుకుంటూ వెళ్ళిపోతారు. ఆ తర్వాత పీరిగాడిని పట్టి తీసుకువచ్చి గడీముందే చావబాదుతాడు. **'దొర చంపకుండ్రి, పిల్లలు గలోణ్ని'** అని మొత్తుకున్న విడిచిపెట్టడు. చివరకు దెబ్బలు తాళలేక అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోతాడు. ఈ దెబ్బకు గ్రామంలో తననెదిరించి ఎవ్వరూ బ్రతకలేరని, తనకు భయపడ్తూ అనుక్షణం లొంగి ఉండాల్సిందేనన్న హెచ్చరికను ప్రకటింస్తాడు.

పీరిగాడు చచ్చిపోయిన తర్వాత సూర్యుడు అస్తమించాడు, చీకట్లు వ్యాపించాయి. సహజంగా జరిగే ఈ పరిణామాన్ని పీరిగాడు చనిపోయిన తర్వాత అని చెప్పడంలో, రామారెడ్డి దొర చేసిన హత్య, అతని పతనానికి నాంది పలకబోతుందే విషయాన్ని సూచన ప్రాయంగా తెలియజేశారు రచయిత దాశరథి రంగాచార్యులు.

ఆకాలంనాటి దొరల పెత్తందారీతనానికి, నిరంకుశత్వానికి నవలలో మరో ఉదాహరణ రాచరిక వ్యవస్థకు అధికార చిహ్నంగా, ఒక లాంఛనంగా భావించే నాటి ఒక క్రూరమైన ఆచారం. దొరగాడి బండి నడుస్తూంటే దాని ముందు మనిషి పరిగెత్తించడం. ఒకసారి దొర, దొరసాని బండిలో వెళ్తున్నప్పుడు బండిముందు పరుగెత్తుతున్న ఐలిగాడికి ఆరోగ్యం బాగా లేక మెల్లగా పరుగెత్తుతాడు. దొర వేగంగా పరుగెత్తుమని ఆర్డర్ జారీ చేసాడు. కడుపునొప్పితో బాధ పడుతున్నాని చెప్పినా పట్టించుకోకుండా ఇంకా వేగంగా పరుగెత్తమనడంతో ముందుకు కదలలేక ఐలిగాడు పడిపోతే దొరవచ్చి అతన్ని బాగా కొడతాడు. వాడు అక్కడే ప్రాణాలు విడిచిపెడతాడు. ఆనాటి దొరల కర్కశత్వానికి ఇది ఒక మచ్చుతునక.

సారంగపాణి పట్నం నుండి గాజుబిందెను తీసుకువస్తాడు. వాటిని పట్టుకొని వస్తుంటే అవి చిత్రంగా ఉండడంతో జనం చూద్దానికి తెచ్చిన వారి వెంట వస్తారు. గడీ గేటు ముందున్న రెడ్డిగారిని చూసిన జనం పామును చూసిన మనుసులా ఆగిపోతారు. ఈ సంఘటనను బట్టి గమనిస్తే రామారెడ్డి దొర ప్రజల దృష్టిలో పామువంటి ప్రమాదకరమైన వ్యక్తిగా, వారు భావిస్తున్నారని తెలుస్తుంది.

జీతగాడు గాజుబిందెలు మోసుకొని వచ్చి బల్లమీద పెడ్తుండగా ఒకటి చేయి జారి క్రిందపడ్తుంది. అందుకు ఆగ్రహించిన దొర వాడిని కొట్టి, ఫుట్‌బాల్‌ను తన్నినట్లు తంతే రెండున్నర గజాల అరుగుమీద నుండి కింద పడ్తాడు. పేదవాడు దొర దృష్టిలో తన దొడ్లో ఉండే పశువులకన్నా హీనంగా చూసే ఆయన తత్వాన్ని తెలుపుతుంది ఈ సన్నివేశం. అలాంటి గాజు బిందెలు మరెన్నైనా కొనే స్థోమత ఉన్నా జీతగాడిని చితకబాదడం దొరలకు చెల్లుబాటు అవుతుందని ఈ సన్నివేశం ద్వారా ఎరుకవుతున్నది.

సారంగపాణితో తన భార్య, బిడ్డ ఫోటోలను తీయించవద్దని, తానే స్వయంగా దింపాలని అనుకుంటాడు. దొరతనం అడ్డురావడం తో, తన అహం దెబ్బతింటుందని విరమించుకుంటాడు. నాటి దొరల విలాస జీవితానికి ఇది ఒక ఉదాహరణ. వనజ తల్లి ఆడబాపగా మారడానికి కారణం రామారెడ్డి దొర. అతని వల్లే ఆమె తల్లి అవుతుంది. వనజ దొర రక్తం పంచుకున్న బిడ్డ, అయినా ఆమెను గడీల ఆడబాపగా చేస్తాడు. ఇక్కడ దాసి కూతురుగానే చూస్తాడు. కానీ మానవ హృదయంతో ఏమాత్రం ఆలోచించడు. వనజ ఆడబాపగా అవస్థలు పడుతున్నా పట్టించుకోడు.

మంజరికి వీణ నేర్పించాలంటే పాణికి తన కూతురు మంజరికి మధ్య వనజను రంగంలోకి దించుతాడు. పాణి ఎక్కడ మంజరిని ప్రేమిస్తాడని భయంచేత వనజకిచ్చి పెళ్ళి చేయాలనుకుంటాడు. ఎప్పుడు వనజమీద సదభిప్రాయాన్ని వ్యక్తం చేయని దొర తన స్వార్థకోసం **'వనజ చురుకైన పిల్ల అందమైన పిల్ల తన రక్తం గదా. ఎంతైనా ఆడబాపగా చేసి తప్పుచేశా'**నని బాధపడుతాడు. ఏది చేసినా దొర తన సంతోషం కోసమే చేస్తాడు.

వనజ పాణిని ప్రేమిస్తుందనుకొని మనసులో లేనిపోని ఆలోచనలతో మానసికంగా కృంగిపోతుంది. మంజరి ఆమె ఆరోగ్యం క్షీణిస్తుంది. అందుకు వనజ కారణం కాకున్నా ఇష్టం వచ్చినట్లు కొడాతాడు దొర. పాణి అడ్డుపడితే అతన్ని కొడతాడు. దొరకు కోపం వస్తే మనిషి కాదు. రామారెడ్డి దొర ఆడపిల్ల వనజను కొట్టినందుకు బాధపడతాడు. కాని పాణి విషయంలో అంతస్తునుంచి దిగి, అహాన్ని చంపుకొని అతికష్టంగా **'నువ్వీ గడిలో ఒకనివైనవు –నాకెందుకో నువ్వంటే గుంజుతుంది. నీ మీద కావాలని చేయి చేసుకోలే'** దంటాడు. అయితే పాణి బ్రాహ్మణుడు, సంగీత విద్వాంసుడు అవడం చేత కులం మీద, కళలల మీద ఉన్న గౌరవం రామారెడ్డిదొర చేత ఈ మాటలను అన్పిస్తాయి. అంతేకాని మనిషిని మనిషిగా చూడాలని ఉద్దేశంతో మాత్రం కాదు.

చాకలి పీరిగాడిని చంపినందుకు కేసు అవుతుందని భయపడి అతని భార్య పుల్లిని పిలిపించి కొంత డబ్బు ఇచ్చి లొంగతీసుకుంటాడు. కూతురు మంజరి ఆరోగ్యం బాగాలేక పోవడం, హత్యకారణంగా తాను జైలుకు వెళితే భార్య, బిడ్డ  పరిస్థితి ఏమైతుందనే చింత




మొదలుతుంది రామారెడ్డిదొరకు. ఈ ఆపద నుండి తనను అమీను మాత్రమే కాపాలగలడనీ, అతనికి కరణం దగ్గర మనిషి అని కరణాన్ని పిలిపిస్తే అతను రాడు. అవసరం తనది కాబట్టి దొరనే కరణం ఇంటికి వెళ్తాడు. కరణం తన కూతురు తాయారును పాణికిచ్చి పెళ్ళిచేస్తే కేసు తప్పిస్తానంటాడు. అందుకు ఇష్టం లేకున్నా తనను తాను కాపాడుకోవడానికి వేరే మార్గం లేక ఒప్పుకుంటాడు. దొర ఈ విషయాన్ని పాణితో చెబుతాడు. దానికి పాణి తీవ్రంగా వ్యతిరేకించడంతో దొర అహం దెబ్బతింటుంది. ఇంట్లోనుండి వెళ్లిపోమంటాడు. పాణి గడీ నుండి వెళ్లేముందు మంజరి ఆరోగ్యం గురించి చెప్పబోతే చెంప చెళ్ళుమనిపిస్తాడు దొర. **'మొనగాడు నీతులు చెప్పుతాండు'** అని గది దాటి వెళ్ళిపోతాడు. పాణి గ్రామం వదిలి వెళ్ళిపోతాడు.

ఆ తర్వాత పాణిగదిలో చచ్చిపడి వున్న పీరిగాణ్ని, దొర కాల్తొ తంతున్న ఫోటోను చూసిన రెడ్డి వెంటనే మాదార్యాబ్‌ను పిలిపించి పంతులు పరారయ్యిండు అని ప్రచారం చేయిస్తాడు. దొర తప్పు తనమీద రాకుండ ఉండడానికి ఎంతటి ఎత్తయినా వేయగలడు. ఎవర్ని అయినా హింసించగలడు అనే విషయం ఈ సన్నివేశం ద్వారా వ్యక్తమవుతుంది.

మంజరి ఆరోగ్యం, పీరిగాడిని చంపుఫోటో కేసు జైలు ఇవన్నీ తను చేసిన పాపాలకు శాపం అని భావిస్తాడు. మానసికంగా కృంగిపోయి జబ్బు చేసి రక్తం కక్కుతాడు. ఇది తెలిసిన జనం దొరను చూడటానికి ఎవ్వరురారు. బండి కట్టడానికి సమ్మతించరు. దొరసాని ఇందిరమ్మ పెద్దగుమస్తా పిచ్చయ సాహుతో దొరను పట్నంకు తీసుకొని బయలుదేరుతుంది. ఇది చూసిన జనం **'ఇంత పాపం ఊర్కే పోతుందా'** అని తలుపులు పెట్టుకుంటారు.

నవలలోని రామారెడ్డి దొర, కరణం వెంకట్రావు, పోలీసు, అమీను తాసిల్దారు మొదలైన అధికారులు అందరు సామాన్యులను ధనం, అధికార బలంతో దొచుకున్నవారే. ఆ కాలానికి ఈ కాలానికి చిల్లర దేవుళ్ళు రూపాలు మారినాయి. కాని పరిస్థితులు అలాగే ఉ న్నాయి. ఒక రకంగా చెప్పాలంటే అప్పటి కంటే ఇప్పుడే అనేక రకాల కొత్త దోపిడీలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయి. నాయకులు అధికారుల పేర్లతో స్వాతంత్ర్య భారతంలో కూడా భూస్వామ్య వ్యవస్థ

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (46) హైదరాబాద్ ఆగస్టు : 2025

లక్షణాలను ప్రదర్శిస్తున్నారు. చట్టపరంగానే అన్యాయాలు, అక్రమాలు సాగిస్తున్నారు. ఈనాటి చిల్లరదేవుళ్ళు ధనం, పదవి, అధికార మదంతో వీటిని అమలుపరుస్తున్నారు. వీటికి ఉదాహరణ కంచికచర్ల కోటేశు హత్య, మంథని నిమనుకర్ హత్య తంజావూరులో జరిగిన సామూహిక హరిజన సజీవదహనకాండ అని చెప్పవచ్చు. కులం, మతల పేరుతో ఇటువంటి హత్యలు నేటికాలంలో చిల్లర దేవుళ్ళు బలం, బలగం సహాయంతో యథేచ్ఛగా సాగిస్తున్నారు.

**శైలి – శిల్పం :** రంగాచార్యులు అతిదారుణాలైన విషయాలన్నింటిని అతి సహజంగా చూపినారు. ఏ పాత్రను గురించి చెప్పినా ఏ విషయాన్ని వర్ణించినా, గర్హించినా ఆయా పాత్రల సంభాషణల ద్వారా నే కనబరిచారు. ఒక సారంగపాణి తప్ప మిగతా పాత్రలందరు తెలంగాణ మాండలిక భాషలోనే మాట్లాడినారు. ఈ మాండలికాన్ని ఆయా పాత్రలకు ఉపయోగించడం చేత నవలకు సహజత్వం చేకూరి తెలంగాణ మాండలికంపై రచయితకున్న ఆసక్తి వెల్లడవుతుంది. విషయాన్ని వేదన పాత్రల సంభాషణలతో జరిగి అక్కడక్కడ పాత్రలు ఉపయోగించిన సామెతలు నిశితములయి నుడికారపు సొంపును గుమ్మరించారు. ఔచిత్య శోభితములై పాఠకునికి విసుగుని కలిగింపక ఆసక్తిని పెంచినారు. నీ కాల్మొక్త బాంచను దొర, నా తోలొలిచి చెప్పులు కుడ్త, బాంచను నీగులాపొల్లమైపుడ్త, హరే మీరెక్కడి తురకర్లా?, ఈకల్పెట్టుకుంటె నెమిలైతాదా కాకి, దొరేం తలకొట్టి మొలుస్తాడా, రక్తంలో నిప్పుపెట్టడం వంటి సామెతలు పాత్రలను బట్టి ఉపయోగించారు. తస్వీర్, ఖీమత్, ఎహత్యాలుగ, పైసు, చెక్కరొచ్చింది, ముకద్దమే, పాసీ, ఖతల్, ఇత్తలా, ఏత్‌రాజ్, తామీల్, కమ్జోర్, ఎత్మాన్ మొదలగు ఉర్దూ పదాలు ఈ నవలలో చాలా కన్పిస్తాయి. నవలలో చిత్రించిన జన జీవితం, మట్టివాసన నవలకున్న ఇతివృత్త బలం – శిల్పసంపద అని చెప్పవచ్చు.

ఆస్తి, అధికారంతో కూడిన అహంకారం అన్ని అనర్థాలకు మూలం. అవి మనిషిని పశువుగా మారుస్తాయి. ప్రజా ప్రతినిధులుగా చెప్పుకుంటున్నా రాజకీయ నాయకులు, గ్రామ పరిపాలన, రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దోచుకుంటున్న దొంగలు, కాంట్రాక్టర్లు, వివిధ శాఖలలో పనిచేస్తూ లంచం తీసుకుంటున్నా లంచగొండ్ల నవలలోని ఆ చిల్లర దేవుళ్ళకు వీరంతా వారసులుగా నేడు వివిధ రూపాలలో కొనసాగుతున్నారు ఈ చిల్లరదేవుళ్ళు. కాలం మారింది రూపాలు మారినాయి. పరిస్థితులు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. కుల, మత, వర్గ భేదాలు రూపుమాపి మానవతా దృక్పథం వైపుకు అందరూ పయనించినప్పుడు దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

❖ ❖ ❖ ❖ ❖

## వెనక్కి తిరిగిన కాలం

**పద్మపుత్ర మల్లికార్జున్ కర్నె**

**ఫోన్ : 9640038408**



కోతి నుండి మనిషిగా మారడానికి
ఈ సుదీర్ఘ నడక ఎంత కాలం పట్టిందో!

మనిషి నుండి కోతిగా మారమని
ఈ చిన్న డ్రగ్స్ గుళిక చెప్పింది
మత్తులో తూలుతున్న పాదాలు
రోడ్డు పట్టాలు తప్పిన చక్రాలకింద పడి
జీవం కోల్పోయిన జాతులెన్నో!

ఈ నరజాతి చరిత్ర
ఆద్యంతం రక్తంతో తడిచిన దారే
కడుపుకి లేక చేతికి అంటిన రక్తంలో
ఆరని వేడి, పూటకో రుచి మరిగిన రేపటి దారి ఎదురైంది

ఈ సుదీర్ఘ ప్రయాణానికి మత్తు తోడై
మరో వింత పాలపుంత ప్రపంచానికి దారి నేసింది
ఆ దారిలో నేరం ఆహారంగా మారి
చరిత్రలో ఎన్నడూ చూడని వింతలు చూపాయి

కాలం చెల్లిన కాలజ్ఞానం
ఇంకో కొత్త ప్రతిని రాయమంది
కాలంతో నడిచే అడుగులు కాలానికే పరుగులు నేర్పాయి
అదెంత దూరమో! తెలియదు కానీ
అడుగడుగునా అరాచకవాదమే......

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (47) హైదరాబాద్ ఆగస్టు : 2025

# చారిత్రక కావ్యరాజం – శ్రీ శివ భారతం


✍ **డా. శంకర్ అనంత,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (పార్ట్-టైం), తెలుగు శాఖ, డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. ఫోన్ : 9640 640 765

**వ్యాస సంగ్రహం :** శ్రీ శివ భారతం గడియారం వేంకట శేషశాస్త్రి గారి అద్భుత కావ్యం. తెలుగు సాహిత్యంలో చారిత్రక కావ్యాలకు విశిష్ట స్థానం ఉంది. చరిత్రను లేదా చారిత్రక పురుషుల జీవితాలను ఆధారంగా చేసుకుని రచించబడిన కావ్యాలలో గడియారం వేంకట శేషశాస్త్రి రచించిన "శ్రీ శివ భారతం" ప్రత్యేక గుర్తింపు పొందినదిగా నిలిచింది. ఇలాంటి కావ్య విశేషాలు, రచనావశ్యకత, శైలి, పాత్రచిత్రణ వంటి అంశాలను తెలుసుకోవచ్చు.

**1. కావ్య పరిచయం :** శ్రీశివ భారతం గడియారం వేంకట శేషశాస్త్రి గారి విలక్షణ కావ్యం. తెలుగు సాహిత్యంలో చారిత్రక కావ్యాలకు విశిష్టస్థానం ఉంది. చరిత్రను, లేదా చారిత్రక పురుషుల జీవితాలను ఆధారంగా చేసుకుని రచించబడిన కావ్యాలలో గడియారం వేంకట శేష శాస్త్రి రచించిన "శ్రీ శివ భారతం" ప్రత్యేక గుర్తింపు పొందినదిగా నిలిచింది. మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజు జీవిత నేపథ్యంగా తెలుగులో ప్రబంధ లక్షణాలతో వచ్చిన 8 ఆశ్వాసాల ఆధునిక ప్రబంధం. జాతిలో స్ఫూర్తిని నింపిన శివాజీ మహారాజు జీవిత చరిత్రలు మరాఠీ, సంస్కృతము, ఆంగ్లము మరియు అనేక భారతీయ భాషలలో వచ్చాయి. మొదటిసారిగా తెలుగులో కావ్యరూపంలో శ్రీ గడియారం వేంకట శేష శాస్త్రి గారు సుమారు 2500 గద్య పద్యములలో 1943లో రచించారు. భారతదేశం యావత్తూ స్వాతంత్ర్య సమరం ఉవ్వెత్తున సాగుతున్న కాలం. దేశమంతటా కవులందరూ తమ తమ కర్తవ్యంగా జాతిని ఉత్సాహ పరిచే, చైతన్యపరిచే సాహిత్యాన్ని తమవంతు కర్తవ్యంగా అందించారు. ఈ క్రమములో మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదురించి నిలిచి హైందవ రాజ్యాన్ని స్థాపించిన శివాజీ చరిత్రను మనకందించి తద్వారా బ్రిటీష్ వారిపై పోరాటానికి తెలుగుజాతిని జాగృతం చేయుటకు అన్నట్లుగా శాస్త్రి గారు ఈ కావ్యాన్ని రచించారు. శాస్త్రి గారు ఈ కావ్యాన్ని కేవలం చారిత్రక దృక్పథం తోనే కాక రాజకీయ, ధార్మిక, తాత్విక అంశాలను ఎన్నింటినో ఈ కావ్యంలో ప్రస్తావించారు.

**2. రచయిత గురించి :** గడియారం వేంకట శేషశాస్త్రి గారు (1845-1916) తెలుగు భాషలో నిష్ణాతులు. ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన వీరు సంస్కృతం మీద ప్రగాఢ పట్టు కలిగిన కవి, విమర్శకులు, పండితులు, అవధాని. ఆయనను ఆధునిక కాలంలో ఉన్న అత్యుత్తమ కావ్య రచయితలలో ఒకరిగా పేర్కొనవచ్చు. వారి రచనలలో భక్తి, శౌర్యం, సంస్కృత శైలి, భారతీయ సంప్రదాయాల వాసన స్పష్టంగా కనిపిస్తుంది. వీరు ఎన్నో అవధానాలు చెసి **అవధానన పంచానన** బిరుదున్నప్పటికీ వీరు శివభారత కవిగానే ప్రసిద్ధి చెందారు. మహాభారత కవిత్రయంలోని తిక్కనను అమితంగా ఇష్టపడ్డారు శాస్త్రిగారు.

**"హరిహరనాథ శాంత మధురాకృతి లోపలి చూపునన్ పురా**
**చరిత తపఃఫలం బుభయసత్కవిమిత్రత వెల్గ ధ్యానత**
**త్పరుడయి భారతాగమము పల్కెడు తిక్కన వాక్కువెంట త**
**త్క్రమున తాండవించు వరదాయిని లేఖిని నే భజించెదన్".** అంటూ తిక్కన కవితా మార్గంలోనే నడిచారు.




**3. శ్రీ శివ భారతం విశేషాలు – ఇతిహాస నేపథ్యం :** ప్రతికూల పరిస్థితిల్లో శిరసు వంచి, అనుకూల పరిస్థితుల్లో శిరసు నెత్తిన అపార రాజనీతి విశారదుడు, సమరాంగణ సార్వభౌముడు ఛత్రపతి శివాజీ. అట్టి మహా పురుషుని జీవితాన్ని ఈ కావ్యంలో ఆవిష్కరించారు శాస్త్రి గారు. 'శివభారతం' ప్రధానంగా వీర రస కావ్యం. కరుణ, భీభత్సం, అద్భుతం వంటి అంగ రసాలు కూడా ఈ కావ్యంలో కనిపిస్తాయి. ప్రతి పద్యంలో ఓజోగుణం ప్రత్యక్షమవుతుంది. తెలుగువారిలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తి కలిగించిన చారిత్రిక కావ్యరాజం శ్రీ శివ భారతము. శివాజీ గారి పరాక్రమం, ధర్మరక్షణ, మతపరమైన తాత్వికత, గురుభక్తి, భక్తి భావం ఇవన్నీ ఇందులో ప్రముఖంగా వర్ణించబడ్డాయి. ఇది ఒక చారిత్రక వ్యక్తిత్వాన్ని ఆధారంగా చేసుకుని పౌరాణిక రచనగా తీర్చిదిద్దిన అరుదైన ప్రయత్నం. ఈ కావ్యం ద్వారా భారతీయ సంస్కృతి, హిందూ ధర్మ పరిరక్షణలో శివాజీ పాత్రను కవిత్వం ద్వారా అర్థమయ్యేలా

చేస్తుంది. శాస్త్రీయ పాండిత్యం భక్తి, చారిత్రిక స్పృహ కలగలిపి శాస్త్రీయ పాండిత్యంతో రచించిన నాణ్యమైన కృతి శ్రీ శివభారతం.

**4. శైలి, రచనా విధానం :** శ్రీ శివ భారతం కావ్యం శ్లోకాల రూపంలో, ముఖ్యంగా సంస్కృత కవితా శైలికి అనుగుణంగా రచించ బడినది. కానీ తెలుగు భాషాభిమానులు కూడా దీన్ని అర్థం చేసుకునేలా సరళంగా రచించబడింది. ఇందులో కవిత్వంతో పాటు ఆధ్యాత్మికత, చారిత్రికత, భారతీయ విలువలు వినిపిస్తాయి.

**5. శ్రీ శివ భారతం లోని ముఖ్య పాత్రల విశ్లేషణ :** అ) ఛత్రపతి శివాజీ మహారాజు – ప్రధాన నాయకుడు

శివాజీ మహారాజు ఈ కావ్యంలో ధర్మపరిరక్షకునిగా, వీరయోధుడిగా, భక్తునిగా చిత్రించబడ్డారు. ఆయన వ్యక్తిత్వం మూడు ముఖ్యాంశాలతో రూపుదిద్దుకుంది. ధర్మపరిరక్షణ, మతం, సంస్కృతి, సమాజాన్ని కాపాడాలనే ధృఢ సంకల్పం కల వ్యక్తిగా శివాజీ పాత్రచిత్రణ ఉన్నది.

**"ధీరాగ్రేసరమూర్తి హైందవధరిత్రీ భాగ్యసత్యాపన**
**ప్రారంభుండు దయాగుణాంబుధి మహారాష్ట్రాన్వయో త్తంసుడౌ**
**నత వీరక్షత్రియమౌళి భవ్యభరతోర్వీ ధర్మరక్షార్పిత**
**శ్రీరమ్యుండు భవాని భక్తుడు శివాజీరాజు సామాన్యుడే!"**

**"ఆతని చరితము హైందవ**
**జాతి పరాయణము భావి జగదభ్యుదయ**
**స్ఫీతము ధర్మో పేతము**
**నీతిపథము నిగమసూక్తి నిభమై వెలయున్"**

అంటూ శివాజీ గొప్పదననాన్ని వివరిస్తాడు. వారి దృష్టిలో శివాజీ భారతీయుల తపఃఫలముగా జన్మించిన అపర శివుడు. మహమ్మదీయుల క్రూర పాలనచే ఇబ్బంది పడుతున్న హిందూ జాతి నుద్ధరించుటకు పరమేశ్వరుడు తన ప్రమథ గణంలో నుండి పంపిన మహా ప్రమథుడు శివాజీ. పతితమై, భ్రష్టమై, స్ఫూర్తి రహితమై, నిస్తేజమైన యీ పురాతన జాతిలో ధర్మావేశమును కలిగించి, మట్టి నుండి మహావీరమణులను సృష్టించిన అద్భుత వ్యక్తి అతడు. భవానీ దయాదత్త కరవాలఖేలా పునస్సంపాదిత రాజ్యలక్ష్మి మహోదయుడైన మహాపురుషుడతడు. ఆ శివవీరుని విజృంభణము నెంత చక్కని ఉపమానములతో రచయిత ఈ పద్యములో వివరిస్తాడు.

**"కార్తవీర్యుడు గొన్న కపిలధేనువు దేర**
**రణభీము భార్గవరామునట్టు**
**లేకచక్రపురంబు నెరియించు బకుగెల్వ**
**ద్విరదాయుత సేము భీమునట్టు**
**లాదితేయుల గెల్చి అమృతకుంభము దేర**
**తతవిపక్ష దిధక్షు తార్క్ష్యునట్టు**
**లమర సామ్రాజ్యాపహర్తయౌ బలిద్రొక్క**
**మాయావతార వామనుని యట్లు"**

పరశురాముని వలె, భీమునివలె త్రివిక్రమునివలె విజృంభించెడి శివాజీ మహావీరుని చరిత్ర అనన్య సామాన్యమైనది. అంతటి హిందూ సామ్రాజ్య ప్రతిష్ఠాపకుడైన ఒక ధీరోదాత్తుని కథ కావ్యముగా తీర్చి శేషశాస్త్రిగారు ధన్యులైనారు. ఇలా కావ్యంలో శివాజీ బాల్యం నుండి సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని ఒక్కొక్క దుర్గాన్ని చెపట్టి ఒక్కొక్క శత్రువును మట్టుబెట్టి చివరకు హైందవ రాజ్య ఛత్రపతిగా ఎదిగిన ప్రతి సందర్భాన్ని శాస్త్రి గారు కళ్ళకు కట్టినట్లు వివరించారు.

**ఆ) జిజియాబాయి – శివాజీ తల్లి :** ఈ కావ్యంలో మరో పాత్ర జిజియాబాయి. ఈమె శివాజీ తల్లి, ధీరగంభీరమైన ఆమె వ్యక్తిత్వాన్ని రచయిత అద్భుతంగా తీర్చిదిద్దారు. జిజియాబాయినే శివాజీ వ్యక్తిత్వ నిర్మాణానికి మూలాధారం. కేవలం జిజియా వల్లనే శివాజీ ఒక ఉన్నత మైన వ్యక్తిత్వం కలిగిన నేతగా ఎదిగాడు. ఆమె భక్తి, ధర్మనిష్ఠ, మరియు తనయుడిని యోధుడిగా తీర్చిదిద్దినది. శివాజీని చిన్ననాటి నుండే రామాయణ, మహాభారతాల కథలు చెప్పి, ధర్మాన్ని మనసులో నాటింది. ఆమె ద్వారా శివాజీకి ఆధ్యాత్మిక చైతన్యం మరియు ధైర్యం సంక్రమించింది. కేవలం శివాజీ విషయంలోనే కాకుండా తన తండ్రి లుకాజీని ఎదురించే సందర్భంలో జిజియాబాయి వ్యక్తిత్వాన్ని మనం పరిశీలించవచ్చు. ఒకసారి తన భర్తపై కత్తి శతృత్వాన్ని చూపిన తండ్రిని ధిక్కరించుచు ఆమె పల్కిన పల్కులను గమనిస్తే ఆమె అసామాన్య వ్యక్తిత్వం మనకు కనబడుతుంది.

**"కెవ్వున హుంకరించి యడికించెద, వాయుధమెత్త నుంటివీ**
**వెవ్వరి పైన? నీ యెడద కింత వివేకము చాలదయ్యెనే?**
**గువ్వలుగూడ గాన్పులను గూరిమిబెంచు జగంబునందు నీ**
**నెవ్వడవయ్య? యాదరణ కెక్కరె యల్లుడు నాడుబిడ్డయున్."**

అంటూ గువ్వలు కూడా తన పిల్లలను కాపాడుకుంటాయి నీవెవ్వడవయ్యా బిడ్డను, అల్లుణ్ని చంపాలనుకుటున్నావు అని తండ్రిని నిలదీస్తుంది.

**"కనికరమింతలేని కొటికాడవు నన్నిటు పెంచనేల, పు**
**ట్టినయపుడే గళమ్ముటమటించిన బోవదే? వెంటనంటియి**
**య్యనువున వేటలాడమనసయ్యెనె? కన్నునిసుంగు మ్రింగు వ**
**ర్తనమది సర్పజాతికి గదా యొకమానవుడిట్లు సేయునే?"**

అంటూ తన వాక్చాతుర్యముచే తండ్రి కరిగిపోవునటులు చేసి అతని మనసు మార్చిన ధీమంతురాలు జిజియా. ఈ విధముగా తాను తలపెట్టిన ఏ పనినైనను పట్టుదలతో సాధించగల అద్భుత వ్యక్తి జిజియాబాయి. ఆమె పెంపకము వలననే శివాజీ అంతటివాడై నాడనిన అసత్యము కాదు. ఎంతటి కష్టమునైనను సహించు ధైర్యము, అన్యాయము నెదుర్కొను సాహసము ఆమె వలననే శివాజీ పొందినాడు.

**ఇ) సమర్థ రామదాసు – గురువు పాత్ర :** ఈ పాత్ర శివాజీకి ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలిచి, శివాజీకి జ్ఞాన మార్గాన్ని చూపుతాడు. ధర్మం కోసం శత్రువులతో యుద్ధం చేయడంలో ఏ పాపమూ లేదని చెప్పి శక్తి కలుగజేస్తాడు. ఈతని ద్వారా గురుపాద సేవ, వైరాగ్య సూత్రాలు, రాజధర్మ బోధన ఇవ్వడం మొదల్గనవి తెలుసుకొని శివాజీ జీవిత మార్గాన్ని ఉన్నతంగా మలచుకుంటాడు. ఈ పాత్రలో భక్తి రసానికి తోడు శాంత రసం, వీర రసం మేళవించి ఉంటుంది. గురువుగా వారి పాత్రను శాస్త్రి గారు అత్యంత గౌరవంతో, తాత్వికతతో చిత్రించారు.

**ఈ) షాహజీ భోస్లే – శివాజీ తండ్రి :** ఈ షాహజీ భోస్లే పాత్ర కావ్యంలో పరిమితమైనదే అయినా, శివాజీ కుటుంబ నేపథ్యం, రాజకీయ పరిణామాల్లో అతని పాత్ర ముఖ్యంగా ఉంటుంది. ఆయన ఒక మొఘల్ సామ్రాజ్యంలో పని చేసే రాజపుత్రుడు. శివాజీ ఎదుగుదలలో ఆయన రాజకీయ నేపథ్యం సహకరించింది. ఈ పాత్రలో కవిని గమనిస్తే, నిష్క్రియ రాజసత్వానికి ప్రతినిధిగా, శివాజీ కంటే భిన్నమైన ధోరణిగా శాస్త్రి గారు చిత్రించినట్లు తెలుస్తుంది.

**ఉ) దాదోజీ కొండదేవ్ – శివాజీ బాల్యపు మార్గదర్శి :** దాదోజీ కొండదేవ్ ఒక చరిత్రపూర్వ రాజ్యాధికారిగా మాత్రమే కాక, శివాజీ గారి బాల్యపు సంస్కారగురువు, విధేయుడు, శిక్షకుడు. ఆయనను తండ్రి షాహజీ భోస్లే తమ కుమారుడిని పరిపూర్ణ రాజుగా తీర్చిదిద్దడానికై దాదోజీ కొండదేవ్ వద్దకు పంపిస్తాడు.

దాదోజీ కొండదేవ్ శివాజీకి సైనిక విద్య, తంత్ర విద్య, రాజధర్మం, కూటనీతీ శాస్త్రం లాంటి అంశాల్లో బలమైన పునాది వేశారు. అలాగే దాదోజీ కఠినమైన నియమశీలత, క్రమశిక్షణతో కూడినది. శివాజీకి బాల్యంలో ఉన్న అల్లరి, ఉత్సాహాన్ని సరైన దిశగా మలిచే బాధ్యత ఆయన తీసుకుని శివాజీకి ధైర్యం, నిబద్ధత, ప్రజల పట్ల బాధ్యత వంటి విలువలు నేర్పిన వ్యక్తిగా ఈ కావ్యంలో చిత్రితమయ్యాయి. దాదోజీ పాత్రలో శాంతరసం మరియు వీరరసం సమపాళ్లలో కనిపిస్తాయి. శాస్త్రి గారు ఆయనను ఒక రాజ్య గురువు లాగా, మరొక వైపు తండ్రి వలె బాధ్యత గల శిక్షకునిగా తీర్చడం విశేషం. ఆయన మాటలు తాత్వికత, నియమశీలతకు ప్రతీకలు. **"నెమ్మదిగా, ధైర్యంగా నడవాలి. రాజమార్గం ఆయుధాన్ని మించిన ఆయుధం విజ్ఞానమే"** అనే అర్థంలో పలికే భావాలు కనిపిస్తాయి. చివరగా శివాజీ యొక్క నాయకత్వ లక్షణాలకు మూలంగా దాదోజీ శిక్షణ నిలిచిందని రచయిత నొక్కి చెబుతారు. ఈ పాత్ర ద్వారా రచయిత ఒక గురువు పాత్ర ఎంత ముఖ్యమో స్పష్టంగా చూపారు.

ఇంకా శ్రీ శివ భారతం తానాజీ, లుకాజీ, మరియు మొఘల్ అధికారుల పాత్రలు ఒక నిర్దిష్ట ధర్మవిచారణ ఆధారంగా నిర్మించ బడ్డాయి. శివాజీ – ధర్మయోధుడు, సమర్థ రామదాసు – ఆధ్యాత్మిక మార్గదర్శి, జిజియాబాయి – మాతృధర్మం, మొఘల్ అధికారులు – అధర్మ శక్తులు అనే విధంగా ప్రతి పాత్రకు తాత్విక స్థాయిలో అర్థం ఉంది. ఇలా ఈ కావ్యంలో పాత్రలు కేవలం వ్యక్తులు కాదు – అవి ఆధ్యాత్మిక భావాలను, సంస్కృతిని, సామాజిక శక్తులను సూచించే ప్రతీకాత్మక రూపాలు.

**5. ఉపసంహారం :** శ్రీ శివ భారతం కేవలం ఓ కావ్యం కాదు – అది ఒక మహనీయ చరిత్రకు, భారతీయ భావజాలానికి, ధర్మ నిష్టకు సాహిత్య రూపంలో అర్పణ. గడియారం వేంకట శేష శాస్త్రి గారు దీనిలో చూపిన ఆధ్యాత్మికత, శిల్ప సౌందర్యం, కవితా నైపుణ్యం తెలుగు సాహిత్యంలో ఈ గ్రంథాన్ని అమూల్యంగా నిలిపాయి.


# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# మనోహరాచారి కథలు – మానవత్వపు వారధులు

**డా. ముత్యంపేట గంగాధర్,** తెలుగు ఉపాధ్యాయులు, ఫోన్ : 97041 18352

మానవీయ గుణాలు గల కథలు రాసిన కటుకోజ్వల మనోహరాచారి స్వస్థలం పెగడపల్లి మండలం, ఎల్లాపూర్ గ్రామం. వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావటంతో కోరుట్లలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. మనోహరాచారి ప్రవృత్తిరీత్యా కవి, కథ రచయిత, చిత్రకారుడు, గేయ రచయిత, గాయకుడు, నాటకకర్తగా మరియు తెలంగాణ తెలుగు పాఠ్యపుస్తక రచయితగా, రాష్ట్ర ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యాలను నేర్పించడంలో అగ్రేసరులు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రచయితలలో తనదైన శైలిలో తొలి, మలితర రచయితల స్ఫూర్తితో రచనలు చేస్తూ సాహిత్య క్షేత్రంలో మానవత్వపు సొబగులు వెదజల్లుతున్న గొప్ప రచయిత. అందులో భాగంగా మనోహరాచారి ఏకలవ్య (బుర్రకథ) వినాయక చవితి (భజనకీర్తనలు) సుమమాల (భక్తి గీతాలు) మందార మాలిక, అక్షర అభిమతం (కవిత సంపుటి) నవ్వుతున్న నేలతల్లి, సుదూర తీరాలు, వారధి లాంటి కథా సంపుటాలు రాసారు. ఎం.ఫిల్ పరిశోధనా గ్రంథం డాక్టర్ డింగరి రామాచార్య జీవితం సాహిత్యాపై పరిశీలన చేశారు.

కటుకోజ్వల వారి కథల సంపుటులలో వారధి మూడోది. కథల్లో శిల్పాన్ని, సమాజ సంఘర్షణను, గ్రామీణ పాత్రలను సన్నివేశ సంభాషణను పందిరి మీద బీరతీగలా అల్లుకుపోతూ పాఠకుల్ని కథల్లో ఏదో ఒక పాత్రలో లీనం చేసే సహజసిద్ధ కథలు. ప్రతి కథ కూడా ఏదో ఒక సందేశాత్మక ముగింపుతో తనదైన ముద్ర వేస్తాడు. వారధి కథాసంపుటిలో 15 కథలున్నాయి. ఈ కథ సంపుటితో మనోహరాచారి చేయి దిరిగిన గొప్ప కథకునిగా సాహిత్య లోకంలో తన చిరునామా లిఖించుకున్నట్లే. ఇందులో విశేషం ఏమిటంటే ఈ కథలు అన్ని కూడా వివిధ పత్రికల్లో ప్రచురించబడినవి మరియు పలు పురస్కారాలకు, బహుమతులకు ఎంపిక కాబడినవి.

**వారధి కథలు విశ్లేషణ**

ఈ కథల సంపుటిలో మొదటి కథ **"ఆప్తుడు".** భావోద్వేగం కలిగించే చక్కని కథ. కథకునికి కాలేజీలో గణితం చెప్పిన లెక్చరర్ వెంకట్రాములు గారు వృద్ధాప్యదశలో కనిపించారు. ఆర్టీసీ బస్సులో టికెట్‌కు సరైన డబ్బులు లేకపోవడంతో కండక్టర్ బస్సు నుంచి దిగిపొమ్మని ఆగం బట్టించడంతో కాల్జారి కిందపడి తొంటిఎముక పగులు చూపడంతో రోడ్డు పక్కన నొప్పితో విలపిస్తుంటాడు. అదే దారిలో పోతున్న సాంబన్న అనే వ్యక్తి రోడ్డుపై వెళుతున్న కారును ఆపి వెంకట్రాములను హాస్పిటల్‌కి తీసుకువెళ్లుతారు. సాంబన్న వెంకట్రాములు ఆచూకి తెలుసుకొనేటప్పుడు వెంకట్రాములు భార్య చనిపోయిందని, కొడుకు పట్టించుకోవడం లేదు అని తెలిసింది. హాస్పిటల్ ఖర్చులు కారులో తీసుకువెళ్లిన అనామికమైన వ్యక్తి పెట్టుకోవడం ఏంటి అని చివరకు వెంకట్రాములు గట్టిగా నిలదీసే సరికి కథకుడు అసలు విషయం చెప్పుతాడు. గురువును తండ్రిగా భావించి కథకుడు, తన భార్య జ్యోతిర్మయి సేవలు చేశారు. కథలో గ్రామీణ భాషలో పాత్రలతో చక్కగా పలకరించారు. కథ పేరుకు తగినట్లుగానే ఉంది. గురువుకు ఆప్తుడు శిష్యుడే.


లోభితనం మూర్ఖత్వంతో కలిగిన పాత్ర గల రెండవ కథ **"పాత్రులు"** పరంధాములు పేదవారికి, నిర్భాగ్యులకు అన్నం పెట్టడం, భిక్ష వేయడము అంత నచ్చదు. పరంధాములు కూతురు పెళ్లి చేస్తున్నపుడు భోజనాల సమయంలో బంధువులను కాకుండా బిచ్చగాళ్లను, అన్నం కోసము అర్జించి అన్నార్థులను రానివ్వకుండా కట్టె చేతబట్టి కాపుగాసాడు. పురోహితుడు ఎన్నిసార్లు పిలిచినా పెళ్లి మండపంలోకి రాలేదు. పురోహితుడు పరంధామయ్యకు కనువిప్పు కలిగించాడు. నీవు పిలిచిన నీ బలగమంతా తినటానికి రాలేదు. వారు భోజనానికి అర్హులు కాదు. నిజమైన అర్హులు నువ్వు కట్టెతో ఎవరినైతే తరిమావో వారే నిజమైన అర్హులు అని చెప్పి ఆయనకు జ్ఞానోదయం కలిగించాడు. నిజానికి వారి కాలనీలో హనుమాన్ గుడికి విరాళము ఇవ్వమని ఎన్నిసార్లు కాలనీవాసులు అడిగినా దయానిధి లాంటి పెద్దవారు వచ్చిన ఒక్క రూపాయి కూడా విదల్చని పరంధామయ్య అన్నదానం కోసమై డబ్బులు ఇవ్వడం చాలా గొప్ప విషయంగా ఆయనలోని పరివర్తనకు నిదర్శనమైనటువంటి కథ.

మూడవ కథ **"ఆత్మనివేదన"** హృదయాన్ని కదిలించి వేసిన సంఘటనలు కలిగి ఉన్న కథ. వడ్రంగి వృత్తి చేసి రామబ్రహ్మం శ్యామల గార్ల కొడుకు రఘురాం ఇద్దరు కూతుళ్లు. వీళ్ళని బాగా చదివించి ఉన్నతమైన స్థితిలో నిలబెట్టినటువంటివాడు. కన్న తల్లిదండ్రులు అవసాన దశలో పట్టించుకోకుండా చనిపోయిన తర్వాత రకరకాల పిండి వంటకాలు చేసి రాంబ్రహ్మం గారి ఫోటో ముందు పెట్టి మొక్కే విధానాన్ని తెలియజేశారు. ఆయన ఆత్మగా వచ్చి జరుగుతున్న తంతు చూసి చాలా ఆశ్చర్యపోయాడు. బతికి ఉన్నప్పుడు బుక్కెడు పెట్టలేదు ఈ కార్యక్రమం ఏమిటి ...? సమాజంలో జరుగుతున్న సంఘటనలను చాలా చక్కగా చిత్రీకరించారు. **"భాగ్యశ్రీ"** కథలో ఒక వ్యక్తి అభివృద్ధి చెందకు ముందు ఎలా ఉన్నామో , ఉన్నత స్థాయి వచ్చినప్పుడు కూడా మన ఉన్నతిని ఆశించిన వారితో కూడా పాత పద్ధతిలోనే ఉండలేని వారికి ఈ కథ కనువిప్పులాంటిది. కథకుడు జ్యోతిర్మయిని ప్రేమించి పెళ్లి చేసుకుని వారి తల్లిదండ్రుల

నుండి కాదనుకొని సొంత కాపురం పెట్టి గ్రూప్-వన్ స్థాయి ఉద్యోగం పొందుతాడు. డబ్బు ఆశతో వేరే పెళ్లి చేసుకోవాలనే ఆలోచనలు జ్యోతిర్మయిని దూరం చేసుకోవాలని అనుకుంటూ ఉంటాడు. ఇంతలో తన బాల్యమిత్రుడు అభినవ్‌కి నిశ్చితార్థం జరుగుతుంది. అయితే కథకుడు అభినవ్ ఇద్దరు డిగ్రీ మిత్రులు. అభినవ్ తాను డిగ్రీలో ఉండగా మాట ఇచ్చిన రమ్యను పెళ్లి చేసుకుంటాను అనడంతో ఎప్పుడో ఇచ్చిన మాట కోసం ఇప్పుడు కలెక్టర్ అయి ఉండి పేద ఇంటి అమ్మాయిని చేసుకోవడం ఏంటి అని కథకుడు అడిగినప్పుడు..? అభినవ్ రమ్య కలిసిన తర్వాతే అదృష్టం వచ్చింది. కావున ఆమెనే నాభాగ్యశ్రీ అంటాడు. అప్పుడు కథకునికి కనువిప్పు కలిగి తన కోసం అన్ని వదులుకున్న జ్యోతిర్మయి మరి నాకేం కావాలి..? అంతకంటే ఎక్కువనే కదా..! తొందరగా వెళ్ళి నాపాలిట భాగ్యశ్రీ జ్యోతిర్మయికి క్షమాపణలు చెప్పాలనుకునే చక్కని కథ.

రక్తసంబంధం వారికి మరియు ఇతరులకు సాయం చేసే గుణం లేని భూపతి పాత్ర గల కథ **"మనిషి తనం".** సొంత చెల్లెలు కొడుకు వెంకటేష్‌కు బ్యాంకులోన్‌కు ష్యూరిటీ సంతకం పెట్టలేని కఠినాత్ముడు. హరినాథ్ అనే వ్యక్తి రోడ్డుపై లిఫ్టు అడిగితే చూసుకుంటూ వెళ్ళాడు కానీ బండి ఆపలేదు. హరినాథ్ భూపతితో తన భార్య పురిటి నొప్పులతో బాధపడుతుందని చెప్పినా బండి ఆపకుండా కనికరం లేకుండా వెళ్ళిపోతాడు. ఇంతలో వేరే ఒక్కరు హరినాథ్‌కు లిఫ్ట్ ఇవ్వడం వల్ల వెళుతున్న అదే దారిలో యాక్సిడెంట్ అయి రోడ్డు పక్కన తల పగిలిన వ్యక్తి చనిపోయే దశలో ఉంటాడు. అది చూసి హరినాథ్ వెంటనే దిగి హాస్పిటల్‌కి తీసుకువెళ్లి ప్రాణాలు కాపాడు తాడు. తన భార్యను హాస్పిటల్‌కి తీసుకొని పోవల్సివున్నా, ఒక వ్యక్తి ప్రాణాలు పోతాయని తోటి వారికి సహాయం చేసే గుణం కలిగినటువంటి వ్యక్తి హరినాథ్. నేను లిఫ్ట్ ఇవ్వని వ్యక్తి నన్ను హాస్పిటల్‌కి తీసుకువచ్చాడా అని అతనితో ఏం మాట్లాడాలో అని లజ్జాతో సిగ్గుపడిపోతాడు భూపతి. మనం ఎంత కష్టాల్లో ఉన్న మనతో సాధ్యం అయ్యేవరకు ఇతరులకు సహాయం చేయాలి అనేది ఈ కథ ద్వారా గ్రహించవచ్చు.

హిందూ సామ్రాజ్య స్థాపన హైందవ ధర్మానికి ప్రతీక అయిన శివాజీ యొక్క గొప్పతనాన్ని తెలియజేసే కథ **"శీలసంపద".** పరమతస్తుల స్త్రీలను, పరస్త్రీలను తల్లిగా, తోబుట్టువుగా చూసే గొప్ప గుణం కలిగిన వాడు శివాజీ. సైన్యాధిపతి సోన్దేవుడు కళ్యాణదుర్గం సుల్తాన్ అయిన మౌలానా అహ్మద్‌ను ఓడించి, అతని కోడల్ని బంధించి శివాజీ దగ్గరికి తీసుకొస్తాడు. అప్పుడు శివాజీ స్త్రీలను బంధించరాదు చాలా పెద్ద తప్పు చేశావని నిందిస్తాడు. అలాగే సోన్దేవునికి ఎక్కడి నుండి తీసుకొచ్చావో ఈ స్త్రీని పవిత్రంగా ఆమె యథాస్థానానికి చేర్చాలి అని చెప్పుతాడు. శివాజీ చేసిన పని యావత్ హిందూధర్మాన్ని, సంస్కృతిని, సాంప్రదాయాలకు ప్రతీకలాంటిది.




**"వెలుగు"** కథలో రఘునాథాచారి అనే పిల్లవాడు బడి నుండి ఇంటికి వస్తున్న దారిలో కొంత అడవి బాట ఉన్నది. అప్పుడు పిల్లవాడిపై ఎలుగుబంటి దాడి చేస్తుంటుంది. పిల్లవాడిని కాపాడేదశలో ఎలుగుబంటితో పోరాడి హరినాథ్ ఓ కన్నును కోల్పోతాడు. హరినాథ్ భార్య రాజేశ్వరి అరవడంతో చుట్టుపక్కల ఉన్న రైతులు ట్రాక్టర్లో తీసుకొని హాస్పిటల్‌కి వెళ్తారు. హరినాథ్ బాగా చదివి పట్నంలో డాక్టర్ అవుతాడు. రఘునాథచారి వృద్ధాప్యంలో రెండో కన్ను కూడా కనిపించదు. అందువల్ల రాజేశ్వరి హాస్పిటల్‌కి తీసుకెళ్తుంది. అక్కడ డాక్టర్ పెద్ద హాస్పిటల్ తీసుకువెళ్లాలని లేదంటే ఉన్న కన్ను కూడా పోతుందని చెప్తాడు. రాజేశ్వరి తన జీవన విధానం అంతా డాక్టర్‌కు చెప్తుంది. దానిని తెలుసుకున్న హరినాథ్ తాను పెట్టిన ట్రస్టు ద్వారా చివరికి తన కన్నును ఇచ్చి ఆపరేషన్ చేయించడం గొప్ప త్యాగం గల కథ.

**"అంగడి"** అనే కథలో గంగరాజు అనే వ్యక్తి చెప్పుల దుకాణం నడుపుతుండేవాడు. ఇతనికి లక్ష్మీనారాయణ అనే టీచర్ మంచి మిత్రుడు. ఒకరోజు వారసంతనాడు బాలమ్మ వీరమల్లు డోలు చర్నాకోలతో భిక్షాటన చేస్తున్న సమయంలో గంగరాజం దుకాణం దగ్గర అడగడం మొదలుపెట్టారు. అయితే గంగరాజం ఒక్కరూపాయి ఇస్తే వారు తీసుకోకుండా 10 కావాలని పదేపదే పట్టుబట్టి విసిగిస్తారు. దుకాణంలోకి సంత కావడం వల్ల ఎక్కువ గిరాకీ రావడంతో అటూ ఇటూ మనసున పట్టకుండా చేస్తున్న వీరమల్లు దంపతులపై గంగరాజం చెప్పు విసురుతాడు. ఆ విసిరిన చెప్పు డోలుకు తగిలి అది పగిలిపోవడం దానితో గొడవకు దారి తీస్తుంది. వీరిద్దరికీ లక్ష్మీనారాయణ నచ్చచెప్పటానికి ఎంత ప్రయత్నం చేసిన వినకుండా పోలీస్ స్టేషన్‌కి పోతారు. స్టేషన్లో ఉన్న ఎస్ ఐ శశిధర్ గంగరాజం దగ్గర 10000 వసూలు చేసి వీరమల్లుకు 500 ఇచ్చి ఇద్దరికి రెండు దెబ్బలు వేసి పంపిస్తాడు. ఇలా ముందే జరుగుతుందని లక్ష్మీనారాయణ చెపినా వారు వినలేదు. కాబట్టి ఏ విషయాన్ని కూడా స్టేషన్ దాక

పోకుండా సమస్యను ఎక్కడికక్కడే పరిష్కరించుకోవాలనేది ఈ కథ చెప్పిన చక్కని నీతి.

**"జాతర"** అనే కథలో రఘురాంకి సాఫ్ట్వేర్ ఉద్యోగం రావడం వల్ల బెంగళూరులో స్థిరపడిపోయాడు. తన సొంత ఊరు మంచిర్యాలకు దగ్గరున్న గ్రామానికి రఘురాం కొడుకు భానుమూర్తి అతని భార్య వైజయంతి వీరికి ఇద్దరు పిల్లలు పల్లెటూరుకు రావాలని భానుమూర్తికి ఎప్పటి నుండో కోరిక ఉండేది. శివరాం కూతురు గాయత్రి పెళ్లి ఉండడం వల్ల అన్న కొడుకుగా భానుమూర్తి వైజయంతి గ్రామంలోకి రావడం ఆ పెండ్లి జరగగానే ఆ గ్రామంలో మహంకాళి అమ్మ జాతర ఉండడంతో చూడ్డానికి పిల్లలు అందరూ ఊరిలోనే ఉన్నారు. ఆ జాతర రోజున మహంకాళికి గొర్రెలు, మేకలు, కోళ్లతో పాటుగా దున్నపోతులను బలి ఇవ్వడం. ఆ రక్తంతో అన్నాన్ని కలపడం అనేది ఆనవాయితీగా వస్తుంది. దీనికి భానుమూర్తి అడ్డు చెప్పి పశువులను ఇలా ప్రతి సంవత్సరము మనం బలి ఇచ్చుకుంటూ పోవడం వల్ల మనకు వర్షాలు పడడం లేదు. ఇలాంటి జంతుబలులను నిషేధించి చక్కనైన తీయని పదార్థాలతో పాలాభిషేకాలతో చేస్తే పచ్చని పంటలు పండుతాయి అని వారికి హితబోధ చేస్తాడు. **"బాసట"** అనే కథలో రామేశం అనే వ్యక్తి పట్వారిగా ఉద్యోగం చేసి రిటర్మెంట్ అవుతాడు. రామేశం కొడుకు శంకరం ఇతని భార్య సురేఖ వీరికి ఇద్దరూ పిల్లలు. శంకరం కొడుకు నరేంద్ర, కూతురు సుష్మ. నరేందర్ ఉద్యోగం బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. క్రిస్మస్ హాలిడేస్ కోసం ఆగమేఘాల మీద ఇంటికి వస్తాడు. నరేందర్ ఇంటికి వచ్చేసరికి తాతయ్య రామేశం ఇంట్లో కనిపించడు. అతన్ని వృద్ధాశ్రమంలో చేర్పిస్తారు. ఈ విధానం నరేందర్కు నచ్చక తల్లిదండ్రులకు తెలియకుండానే తాతయ్యను బెంగళూరుకు తన దగ్గరికి తీసుకువెళ్లడం అనేది బాసట కలిగినటువంటి గొప్ప నిర్ణయం. నిజానికి నరేంద్ర అంత గొప్ప ఉద్యోగం సాధించడానికి ప్రతి విషయంలోనూ వెనుకనుండి ప్రోత్సహించినటువంటి వ్యక్తి రామేశం. దాన్ని దృష్టిలో ఉంచుకొని కొడుకు కోడలు కాదన్నా మనమడే బాసటగా నిలిచి బెంగళూరు తీసుకపోవడం చాలా గొప్పఎత్తుగడ. నేటి ప్రపంచానికి ఒక కనువిప్పు లాంటి కథ.

ప్రతి కథలో మధ్యతరగతి జీవన విధానం కనిపిస్తుంది. మానవత్వ విలువలు, కృతజ్ఞతా భావం, పరోపకారం ప్రేరేపించే కథలు. ప్రతి కథలో చక్కని ఎత్తుగడ కలిగినవి సాహిత్య ప్రక్రియలో కథ అనేది సమాజానికి పట్టిన రోగానికి ఆకుపసరు మందు లాంటివని నిరూపించే కథలివి. ఈనాటి కాలంలో ఏలాంటి కథలు రాయాలో, పాఠకులకు ఎలాంటివి అవసరమో తెలిసిన కథకుడు మనోహరాచారి. ముఖ్యంగా మన కన్నుల ముందు కదలాడుతున్న మనుషుల పాత్రలను, పరిచయమున్న వ్యక్తులను, తాను పుట్టి పెరిగిన ప్రాంతీయతను, గ్రామాలను, వ్యక్తులను దృష్టిలో పెట్టుకొని కథల్లో ఇమిడ్చిన నటమనోహరుడు. ఈ కథాసంపుటిలోని భాష వ్యవహారిక, పత్రిక భాషను, పల్లెలోని పాత్రలకు సందర్భానుసారంగా సామెతలు, జాతీయాలు, మాండలిక పదాలు ప్రయోగించారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన మనోహరాచారి కథల్లో మానవత్వపు పరిమళాలు వీస్తున్నాయి. వారధి కథల సంపుటి కథాసాహిత్యంలో అగ్రస్థానంలో నిలబడింది.

❖ ❖ ❖ ❖ ❖

---

**"ఉద్ధరేదాత్మనాఽఽత్మానం నాత్మానమవసాధయేత్ ।**
**ఆత్మైవహ్యాత్మనోబంధు: ఆత్మైవ రిపురాత్మన: ॥"**

**(భగవద్గీత 6-4)**

అందరూ తమను తామే ఉద్ధరించుకోవాలి. వారిని వారు అధోగతిని పొందించుకోకూడదు. ఇంద్రియాలను జయించుకునే ప్రయత్నం చేస్తే తనకు తానే బంధువు అవుతాడు. అదేవిధంగా జయించక పోతే తనకు తానే శత్రువు అవుతాడు.

ఈ లోకంలో పుట్టిన అందరూ ఏవో కర్మల కొరకు మాత్రమే పుడుతుంటారు. పుట్టిన ప్రతివారు తప్పనిసరిగా తామున్న స్థితి నుండి ఉన్నతస్థితివైపు ఎదగడానికి మాత్రమే ప్రయత్నించాలి. ఎవరో వచ్చి తమను ఉద్ధరించే అవకాశం లేదు. తమ కర్మల ప్రకారమే ఎవరైనా తమ చుట్టూ చేరుతారు. అయినా తమకున్న పుణ్యం వల్లనే వారు తమకు ఉపయోగపడతారు. అందువల్ల అనవసరమైన విషయాలపై మనసు కేంద్రీకరించకుండా, ఉన్నతశక్తిపై దృష్టి సారించినప్పుడు మాత్రమే తమను తాము ఉద్ధరించుకునే అవకాశం కలుగుతుంది.

మన చుట్టూ ఎప్పుడూ ఏవో సమస్యలు ఉంటూనే ఉంటాయి. సమస్యలను చూస్తూ, ఇంద్రియాలకు లోలత్వము పొందుతూ స్వల్ప సంతోషాలకు పొంగిపోవడం, చిన్న బాధలకే కుంగిపోవడం వల్ల ఎదగడం కష్టం. అసలు సమస్యలు ఎందుకు వస్తుంటాయి? తమకే అనేక రూపాల్లో కష్టాలు వస్తుంటాయని ఎందుకు మనం భావిస్తున్నాం? ఇవి మనని వేధిస్తున్న ప్రశ్నలు. తట్టుకునే శక్తి ఉన్నంతవరకు ఏదీ సమస్య కాదు. తట్టుకునే శక్తి లేనప్పుడు మాత్రమే ఏ విషయమైన సమస్యగా భావించడం జరుగుతుంది. ఒక చిన్నపిల్లవాడికి ముల్లు గుచ్చుకుంటే బాగా ఏడుస్తాడు. అదే కొంత పెద్దవానికి గుచ్చుకుంటే అంత ఎక్కువగా బాధపడడు. ఇద్దరికీ జరిగిన నొప్పి ఒక్కటే అయినా చిన్నపిల్లవానికి తట్టుకునే శక్తి ఉండకపోవడం వల్ల ఏడవడం జరుగుతుంది. అందుకే మన ప్రయత్నం ద్వారా మనం అన్ని సమస్యలను తట్టుకునే శక్తిని పెంచుకోవాలి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (53) హైదరాబాద్ ఆగస్టు : 2025

# రస రమ్యం - శ్రీరామ శతకం

**సుప్పని సత్యనారాయణ,** కామారెడ్డి. ఫోన్ : 949262 6910

**శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే!!**

ఆదికవి వాల్మీకి మొదలుకొని, రామాయణ కావ్య రచనను, రఘురాముని దివ్య చరితను కొనియాడని కవులు లేరంటే, అది అతిశయోక్తి కానేరదు. అందులో కొందరు కీర్తనలతో, కొందరు పద కవితలతో, మరికొందరు కథలతో, మరికొందరు హరికథలతో, ఇంకొందరు పద్యాలతో, స్తుతులతో, కీర్తించడం జరుగుతూ వస్తోంది. అలా కవులే కాక, గాయక మహాశయులు కూడా, ఆ సీతారాముని దివ్య చరిత్రను పలు విధాలుగా ఆలపిస్తూ, తాదాత్మ్యం చెందడం అనేది జరుగుతోంది. ఈ పరంపర కేవలం ఒక యుగానికి, లేదా కాలానికి మాత్రమే పరిమితం కాకుండా ఈసృజన సాహితీ స్రవంతిలా కొనసాగుతూ వస్తోంది.

ఇదే పద్ధతిలో తన ఇష్టదైవమైన శ్రీరాముని వైభవాన్ని ఏ విధంగా కీర్తిస్తే పరిపూర్ణత సిద్ధిస్తుందో తెలియక, ఏకంగా శతకమాలికనే అల్లి ఆ కోదండ రామయ్య గళసీమను అలంకరింపజేసి, శ్రీరాముని పైన తనకు గల అవ్యాజమైన ప్రేమను చాటుకున్న పద్య కవి, రచయిత, తెలుగు అధ్యాపకులు, సిహెచ్. భూమయ్య కవి గారు.

**భద్రగిరి వాస! మము బ్రోచు భక్తకల్ప!**
**భవ్య గుణధామ! శ్రీరామ! దివ్య నామ!!**

అనే సుందర మకరందమైన మకుటం పద్య పాదాలకు మరింత శోభను చేకూర్చింది. ప్రతిపద్య చమత్కృతి అన్న ఆర్యోక్తికి పర్యాయపదంగా 108 సీస పద్యాలతో అలరారే ఈ శతకానికి, సుప్రసిద్ధ సాహితీ దిగ్గజాలు ఆచార్య కసిరెడ్డి గారు, కంది శంకరయ్య గారు, దోరవేటి గారు, తల్లోజు యాదవాచార్యులు గారు, మహా రెడ్డి మహిపాల్ రెడ్డి గారు, అవుసుల భాను ప్రకాష్ గారు, వడ్ల రాజయ్య వంటి ముఖ్యులు, విపులమైన పీఠలను అందించి కావ్య గౌరవాన్ని మరింత పెంచారు.

సాహితీ మిత్ర మండలి (నారాయణఖేడ్) పక్షాన ప్రచురితమైన ఈ శతకం, శతక సాహితీ చరిత్రలోనే ఒక గొప్ప స్థానాన్ని ఏర్పాటు చేసిందని చెప్పవచ్చు. "నానృషిః కురుతే కావ్యమ్" అని వేద వాక్యాన్ని అనుసరించి, ఋషితత్వం అలవడితేనే కవితా సాధన సాధ్యమవు తుంది. లేదంటే లేదు. అందునా పద్య సాహిత్యం పై ఎనలేని అభిమానాన్ని సంపాదించుకొని ప్రేమను కూడగట్టుకోవడం ఒకవంతైతే, పద్య రచనకు శ్రీకారం చుట్టడం ఒక సాహసం. ఆ పద్యాన్ని సుందర మనోహరంగా, అపురూపమైన శిల్పంగా చెక్కడం మరో సాహసం. ఈ ప్రయత్నంలో సఫలీకృతులై శ్రీరాముని కృపా




కటాక్షమును అపారంగా పొందిన వారు శ్రీ భూమయ్య కవి గారు.

ఇక శ్రీరామ శతకాన్ని తడిమి చూస్తే ఏ పద్యాన్ని పలకరించిన పరవశించడమే పాఠకుని వంతు అవుతుంది.

**సీ. ఎవ్వాని నామమ్ము నెదలోన దలపగ**
**బాధలన్ని దొలగి భాగ్యమలరు!**
**నెవ్వాని చరితమ్ము నిష్టమున పఠింప**
**భయమొంది మృత్యువు పారిపోవు!**
**అట్టి దైవమునకు సరి యవనిలేరు**
**నమ్మి కొలిచిన రాముని నాకమబ్బు!!**........(3వ పద్యం)

అంటూ రాముని దివ్య నామాన్ని స్మరించినంత మాత్రాన స్వర్గమే వరిస్తుంది తప్ప, మరే నరకము దరిచేరదని చెబుతారు. ఆ రాముని నామాన్ని నిష్టతో పఠించడం వలన ఏకాగ్రచితంతో మననం చేయడం వలన, మృత్యువు సైతం భయంతో దూరమైపోతుంది. అలాంటి గొప్ప నామాన్ని స్మరించడం మానవాళి కర్తవ్యం అనే భావన, రచయిత చెప్పిన ఈ మూడవ పద్యం వల్ల గోచరిస్తుంది.

లోకంలో అడుగంటిన మానవత్వం గురించి చెబుతూ, మానవీయత కరువైపోయిందని, అమానవీయ విధానాన్ని సమూలంగా రూపుమాపమని ఆ రఘురాముని వేడుకుంటూ,

**"ఒకవిల్లు చేబూని యొకపత్ని చేబట్టి,**
**రాజ్యమేలితివయ్య రామచంద్ర!**
**మానవత్వం నేర్పగా మహికి నీవు,**
**మరల రావయ్య మా తండ్రి మమ్ము దిద్ద !!**

..మంటూ శరణువేడుతాడు రచయిత.

తన చుట్టూ ఉన్న సమాజాన్ని క్షుణ్ణంగా ప్రతినిత్యం గమనిస్తున్న రచయిత, ఇక్కడ జరిగే దుర్మార్గాలను, అన్యాయాలను చూసి చలించిపోతూ, తనలో తాను మధనపడుతూ, కవి హృదయంతో స్పందించిన తీరు ప్రతిపాఠకుడిని ఉత్తేజితులను చేస్తుంది.

సీ. పరకాంతలను జూచి పరవశించునొకడు
ముచ్చటాడుచు కొంపముంచునొకడు!
పేదవారల సొమ్ము ప్రియమార కాంక్షించి
దొంగ బుద్ధి కలిగి దోచు నొకడు!
మాయ మాటలు చెప్పి మందిని ముంచుచు
కన్నవారల నింట గానడొకడు!
ధర్మవంతునివోలె ధరలోన వెలిగిన
దాన గుణము లేని హీనుడొకడు!!

బుద్ధిహీనులై సాగిరి పుడమియందు
చక్కదిద్దగా రావయ్య సౌమ్య హృదయ!!.......(21వ పద్యం)


ఈ విపరీత వైఖరిని మాన్పించడం మానవులకు సద్బుద్ధిని ప్రసాదించి, వారిని సన్మార్గంలో నడిపింపజేయడం, అది కేవలం నీకు మాత్రమే సాధ్యమవుతుంది రామా! కవి ఇక్కడ ఏ విధమైన సమాజాన్ని కాంక్షిస్తున్నాడో మనకు తేటతెల్లం అవుతుంది. అన్యాయ అక్రమాలు లేని మానవుల నడవడికను, ఈ జగానికి ఎప్పుడు వెలుగునిస్తుందని పూర్తిగా విశ్వసించేవాడు. కాబట్టి ఆర్ద్ర హృదయంతో శ్రీరామునికి తన నివేదనను ఇంత గొప్పగా అందించగలిగాడు.

లోకంలో ఈ పద్ధతితో చెలరేగే వారు కొందరైతే, మరికొందరు **"ఎదుటి వారి కొరకే ఏ నీతి జెప్పినన్, తాను పాటించడు ధరణి యందు"** ఇలా అయితే కళ్ళకు కనిపించేదంతా దయనీయమైన దుస్థితే తప్ప, దయాదృష్టి రవ్వంతైనా కానరాదు. అప్పుడు .."**దైవ మెట్లు బ్రోచు? జనులు దారి తప్ప..**" కుండ ఉన్నప్పుడే దైవం కరుణించేదనే పరమ సత్యాన్ని, రచయిత చక్కగా ప్రకటించాడు.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**


శ్రీ సింహాద్రి నారసింహ శతక కృతికర్త అయిన శేషప్ప కవి గారి ప్రభావం, రచయిత భూమయ్య గారిపై అపారంగా ఉన్నట్టు ఈ శతకంలోని ప్రతి పద్యం చెప్పకనే చెబుతుంది. ఏ పద్యాన్ని తాకిన కవిలోని ఆర్తి బాధ సమసమాజ నిర్మాణం కోసం తాను తపించిన తీరు, సహృదయుల హృదయానికి హత్తుకుంటుంది. అందుకే సవినయంగా ఆ కోసల రామునితో-

సీ. వేద పఠనమేను విధిగ జేయగలేదు
చదువులే చక్కగా చదువు లేదు!
గ్రంథ రాజము లేవొ ఘనముగా తెలియవు
పరికింపగా నాకు ప్రజ్ఞ లేదు!...........( 48వ పద్యం)


అంటూ తన వినయ భక్తి తత్పరతను శ్రీరాముని ముందు ఉంచుతాడు. రచయిత మనిషి ఈ లోకంలో తనకు జన్మనిచ్చింది అమ్మానాన్నలైతే, విద్యాబుద్ధులను ప్రసాదించింది మాత్రం గురువులు మరియు అధ్యాపకులు. వారు మన ఉన్నతికి ఎదుగుదలకు ఎంతగా ఉపకరిస్తారో అది మాటల్లో చెప్పలేనిది. అలాంటి...

దేశికేంద్రుని బోధ దివ్య వైభవమని
దలచిన శిష్యుడు ధాత్రి వెలుగు!
పెద్దల మాటలే చద్ది మూటలనుచు
భావనమ్మును జేయు భాగ్యమబ్బు!...........(87వ పద్యం)

అంటూ గురువుల పెద్దల ప్రాశస్త్యాన్ని తెలియజేస్తాడు.

భక్తి తత్వానికి పరాకాష్టగా నిలిచిన ఈ శతకం, శతక సాహిత్య చరిత్రలో ఒక మేలిమి వరంగా భాసిల్లుతుందని చెప్పవచ్చు. తనువు నిల్చు వరకు తనివితీరగ నీదు, సేవ జేసెద రామ చిత్తమలర!! అనే భావన ప్రతి పాఠకుని హృదయంలో కలుగుతుంది అనేది దాచనక్కర్లేని నిజం.

అలాంటి ఈ శతకం కేవలం భక్తి తత్వానికే కాక, భావితరానికి ముఖ్యంగా యువతరానికి ముందుకు నడిపించడంలో ఎంతో దోహదకారిగా ఉంటుంది. అలాగే పండిత పామర జనరంజకమై పది కాలాలపాటు అలరారుతుంది. రచయిత శ్రీ భూమయ్య గారు ఇంత గొప్ప శతకాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా మరిన్ని ఉత్తమోత్తమమైన కావ్య సంపుటాలు వెలువరించి, సమాజ హితానికి దోహదకారిగా నిలుస్తారని, అందుకు ఆ శ్రీరాముడు తగిన బలాన్ని చేకూర్చాలని కోరుతూ, వారికి హృదయపూర్వక శుభాభివందనములు.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2025

# పదనకొండవ శతాబ్దము నా౦టి తెను౦గు భాష

**ఘట్టమరాజు,** బెంగుళూరు. ఫోన్ : 9954082076

**"డిగ్రీలు లేని పాండిత్యంబు వన్నెకు
రాని యీ పాడు కాలాన బుట్టి"**

వైదుష్యానికి తగ్గ స్థానమానాలు చరిత్రకారులైన మల్లంపల్లి సోమశేఖర శర్మగారికి లభించలేదని విశ్వనాథ సత్యనారాయణగారు వాపోయేరే కాని ఆ మాటల్లో ఆయన ఆత్మవేదన కూడా నిండి నిబిడీకృతమై వుందని ఆ ఇద్దరి ప్రతిభాపాటవాలు ఎరిగిన వారెవరైనా వూహించగలరు. కాని 1914లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి యమ్.ఏ. తెలుగు, 1928లో అక్కడి నుండే **'పదనకొండవ శతాబ్దము నా౦టి తెను౦గు భాష'** అనే సిద్ధాంత గ్రంథానికి గాను పిహెచ్.డి. పట్టాలు సంపాదించిన ప్రజ్ఞానిధి డా. చిలుకూరి నారాయణ రావు గారు. జీవితాంతం డిగ్రీకళాశాల సేవకే పరిమితమైనా పిసరంత పరితాపం కూడా పొందని స్థితప్రజ్ఞులు. తెలుగులో మొట్టమొదటి పిహెచ్.డి.పట్టా పొందిన ఈ బహుభాషావేత్తకు అటు మద్రాసు విశ్వవిద్యాలయంలో కాని, ఇటు ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో కాని ఉద్యోగం లభించి వుంటే తెలుగు భాషాసాహిత్యాలు వెలుగుజిలుగులు సంతరించుకొని వుండేవి. ఆయన గరిడీలో చదువుసాములు నేర్చిన యువత ఎంతో ప్రబుద్ధత సంపాదించుకొని కాకలు తీరి వుండేది. **"ఏమి సేయవచ్చు, గాలమెవ్వరి నెంత సేసునో"** అని అన్న తాళ్ళపాక అన్నమాచార్యుల వాళ్ల మాటలతో వూరట పొందాల్సిందే కదా!

'పదనకొండవ శతాబ్దము నా౦టి తెను౦గు భాష'- చిలుకూరి నారాయణరావు గారి పదమూడేళ్ల కఠోర పరిశ్రమ సుఫలం. డా. చిలుకూరి వారి వాఙ్మయ సేవ గురించి అవధానం నాగరాజరావు గారు 1985-90ల మధ్యావధిలో పరిశోధన కావించి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుంచి యం.ఫిల్., పిహెచ్.డి. డిగ్రీలు పొందిన విద్వాంసులు. వీరి సంపాదకత్వంలో ఈ సుకృతి మనకు లభిస్తుండటం ముదావహం. ఇక విద్వన్మణి, సాహిత్య సురుచి సంపన్నులైన ఎమెస్కో సంపాదకులు డి. చంద్రశేఖరరెడ్డి ఈ విలువైన సిద్ధాంత గ్రంథానికి చక్కని 'ముందుమాట' రాయడం పసిడికి పరిమళం అద్దినట్లే !

చిలుకూరి నారాయణరావుగారి సిద్ధాంతగ్రంథం 1928లోనే అనంతపురంలోని పప్పూరి రామాచార్యులగారి శ్రీ సాధన ముద్రాక్షర శాలలో ముద్రితమై మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పింప బడిందని తెలుస్తుంది. డా. చిలుకూరి నారాయణరావుగారు కొద్ది మార్పులతో తమ పరిశోధన గ్రంథాన్ని 1937లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ప్రచురించిన 'ఆంధ్ర భాషా చరిత్రము' రెండవ సంపుటంలో 1328 నుండి 1581దాకా 254 పుటల్లో ఒక భాగంగా పేర్కొన్నారు. ఈ బృహత్ గ్రంథం (1750 పుటలు) లో వెలువడ్డ ఈ 'పదనకొండవ శతాబ్దము నా౦టి తెను౦గు భాష' అధ్యాయం డా. చిలుకూరి వారి సిద్ధాంత గ్రంథం అన్న సంగతి తెలిసినవాళ్లు కూడా ఏకొద్దిమందో? 1928లో పుస్తకరూపంగా వెలువడ్డ ఈ సిద్ధాంత గ్రంథం,1937లో 'ఆంధ్రభాషాచరిత్రము'లో ఓ భాగంగా వెలువడ్డ ఈ రచన ఓ ప్రత్యేకమైన, అందమైన రీతిలో తెలుగుభాషా సాహిత్యప్రియులకు ఎమెస్కో బుక్స్ సంస్థ అందజేస్తున్న వైనం చరిత్రాత్మకమైనదే సుమా!

డా. చిలుకూరి నారాయణరావు గారి 'పదనకొండవ శతాబ్దము నా౦టి తెను౦గు భాష' 288 పేజీల భాషాశాస్త్రీయ పరిశీలనా కృతి. 240 పేజీల్లో తెలుగు భాషా పరిశీలన అనుశీలన జరిగితే, నన్నయ భారతం ఆదిపర్వం, ద్వితీయాశ్వాసంలోని,120పద్య గద్యాల గరుడోపాఖ్యాన పాఠ పరిష్కరణ 36 పేజీలు (241-276) మొదటి అనుబంధంగానూ, పదనకొండవ శతాబ్దంలోని నందంపూడి, కోరుమిల్లి, ర్యాలి - కుందుయి, మలియపూణ్డి శాసనాల అధ్యయనం 11 పేజీలు (277-288) రెండవ అనుబంధంగానూ వెలసిన అపురూపమైన పరిశోధనా గ్రంథమిది.

ఈ పరిశోధనా గ్రంథంలో డా. చిలుకూరి వారు నన్నయభట్టు ఆంధ్ర మహాభారతంలోని ఆది, సభాపర్వాల్ని, అరణ్యపర్వంలోని కొంత భాగం ఆకరంగా తీసుకొని తెలుగుభాషా స్వరూపాన్ని నిర్ధారించడానికి ప్రయత్నించారు. అంతేకాదు, ఆయన నన్నయ కాలం నాటి శిలా, తామ్ర శాసనాల్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించి తన పరిశోధనను తలస్పర్శిగా సాగించారు. గరుడోపాఖ్యానం పాఠపరిష్కరణ చేసేటప్పుడు 94 వ్రాతప్రతుల్ని లోతుగా పరిశీలించారు.

ఈ పరిశోధన వ్యాసం 16 అధ్యాయాలుగా విభజించబడింది. వర్ణములు, వర్ణ ఉచ్చారణము, సంధి, విభక్తి, ఔపవిభక్తి, విభక్తి, సర్వనామ, సంఖ్య, స్త్రీవాచక, తద్ధిత, క్రియ, అవ్యయ, ప్రకీర్ణకాలుగా వర్గీకరింపబడ్డ ఈ పరిశోధనా గ్రంథం డా. చిలుకూరి వారి విస్తారమైన విషయసేకరణ, లోతైన పరిశీలన, స్పష్టమైన విశదీకరణకు ఆటపట్టని చెప్పవచ్చు.

డా. చిలుకూరి వారు నన్నయ భాషలోని సంధి, విభక్తి, క్రియల ప్రయోగాల్ని పరిశీలించేటప్పుడు చిన్నయసూరి సూత్రాల్ని ఆధారంగా తీసుకొన్నారు. ఒక సూత్రాన్ని చెప్పి, దానికి ఒకటో, రెండో ఉదాహరణలు మాత్రమే ఇవ్వకుండా ఎన్నో ప్రయోగాల్ని పేర్కొనడం

గమనార్హం. డా. రావుగారు **'సంధి'** ప్రకరణంలో ఇత్వసంధి ప్రయోగాల్ని పరిశీలిస్తూ 'ఇది'శబ్దం 263 సార్లు ప్రయోగింపబడిందని, అచ్చుపరంగా 73సార్లు సంధి లేదని ఉదహరించారు. (పేజీ:36) **'స్త్రీ వాచకములు'** ప్రకరణంలో 'దాఁసికాఁడు, నేర్పుకాఁడు, సంగడి కాఁడు' వీటికి 11వశతాబ్దంలో మాహతీరూపాలు కనపడలేదని చెప్పడం డా. చిలుకూరివారి సూక్ష్మతమ పరిశీలనా దృష్టికి తార్కాణం. (పేజి:137)


డా. చిలుకూరి వారు కన్నడం, తమిళం, మరాఠీ భాషా పరిజ్ఞానం కూడా కలవారు. ఇక ఆయన సంస్కృత, ప్రాకృత భాషా పటిమ కూడా ప్రశంసనీయమైనదే. నన్నయభట్టు (ఆది. 4-260) **'ఆరెకులు'** అని బహువచన రూపాన్ని పేర్కొన్నారని చెప్తూ దీని ఏకవచన రూప మేదో తెలియరావటం లేదన్నారు (పేజి:75). 'శబ్దరత్నాకరము'లో **'ఆరెకుడు'**అన్న పదం వున్నది కాని ఆ ఏకవచన ప్రయోగం తెలుగు కావ్యాల్లో లేదన్నారు. 'ఆరె' పదం మహారాష్ట్రకు, 'ఆరెము' అనేది మరాఠీ భాషకు పేర్లని వారంటారు **"మహారాష్ట్రులు పూర్వకాలమున తలారులుగా నుండుట చేత 'ఆరెకులు' అను శబ్దమునకు తలారులను అర్థము కుదురుకొని యుండును"** (పేజి:75) అన్న డా. చిలుకూరి నారాయణరావు గారి అభిప్రాయం చర్చనీయాంశమే. ఎందుకంటే మహారాష్ట్ర వీరులు పూర్వం కాకతీయ, విజయనగర రాజులసేనలో 'తలవర, మహాతలవర' పేర్లతో సైనికాధికారుల, సేనాపతుల పదవులు అలంకరించిన వీరవరులు. కాలక్రమంలో ఆపదమే 'తలారి'అనే తక్కువ లేదా చిన్న ఉద్యోగస్థానానికి కూడా వాడబడింది. శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద'లో 'తల బక్షచ్చట గ్రుచ్చి బాతువులు కేదారంపు కుల్యాంతర స్థలి నిద్రింపంగ జూచి యారెకులుషస్నాత....' అన్న ప్రయోగం కనపడుతుంది. ఆంధ్రదేశం లోని గ్రామ, పట్టణ పాలన వ్యవస్థల్లో 'తలారి' పని చేసేవాళ్లు చాలామటుకు బోయవారే. మన రాష్ట్రంలో బోయలు సంస్థానాధీశు లుగా, పాళెగార్లుగా, సంస్కృతాంధ్ర భాషాపోషకులుగా వర్ధిల్లిన ఉ దాహరణలెన్నో వున్నాయి. ఈ తలార్లు, బోయలు కర్నాటకలో కూడా వీర యోధులుగా ప్రసిద్ధికెక్కినవాళ్లే. చిలుకూరివారు **"11వ శతాబ్దపుఁ దెనుగు భాషలో సంబోధనము నందు ఓ, ఓయి, ఓరి, ఓసి'- అనునవి కానరాలేదు"** (పేజి:98) అని చెప్పడం వారి సూక్ష్మేక్షికకు నిదర్శనం. అలాగే 'సర్వనామ ప్రకరణము'లో **"ఉత్తమ పురుషైక వచన మందు 'ఏను' అనునదియే కాన్పించుచున్నది. 'నేను' అని కొన్ని ముద్రిత ప్రతుల యందున్నను, వ్రాతప్రతులలో 'ఏను' అనియే యున్నది"** (పేజి:104) అని ఆ పరిశోధకాగ్రణి గమనించి పేర్కొనడం స్తుత్యమే. మహాభారత పరిష్కర్తలు, ముద్రాపకులు తెలిసో, తెలియకో చేసిన ఈ దిద్దుబాట్లు ఆ కాలం నాటి తెలుగు భాషా స్వరూపాన్ని మార్చినాయన్న సంగతి గమనించాల్సిన సంగతే. డా. చిలుకూరి **'నన్నయలోని సంఖ్యావాచకములు'** ప్రకరణంలో **'ఒకరుఁడు'** అనుటకు బదులుగా **'ఒకఁడు'** అని ముద్రిత భారతంలో కనపడుతున్నదని అంటూ, నన్నయభట్టు 'ఒకరుఁడు' అని మహత్తులోనూ, 'ఒకఁడు'అని అమహత్తులోనూ వాడాడనీ అంటూ, నన్నయభారతంలోని అపపాఠాల్ని వేలెత్తి చూపారు (పేజి:112). పరిశోధక ప్రవీణులు **'క్రియలను గూర్చిన కొన్ని విశేషములు'** ప్రకరణంలో తెలియచేసిన విషయాలు ఎంతో విలువైనవి (పేజి : 216-225).

చిలుకూరి వారు అనుబంధము -1లో 'గరుడోపాఖ్యానము'లోని 120 పద్యగద్యాల పాఠపరిష్కరణను తర్వాతికాలంలో ప్రకాండ పండితులు చేసిన ఆంధ్రమహాభారత పరిష్కరణ పథకాల్లో ఎంత వరకు గమనించారోలేదో పరిశీలించాలి.

డా. చిలుకూరి నారాయణరావు పదకొండవ శతాబ్దపు తెనుగు భాషా స్వరూపాన్ని నన్నయ భారతం ఆధారంగా పరిశీలించడంతో పాటు ఆకాలం నాటి శాసనాల భాషను కూడా సునిశితంగా పరిశీలించి వాడుకొన్నారు. నన్నయ భాషకు, శాసన భాషకూ గల సామ్యాల్ని పేర్కొన్నారు. భారతముద్రిత భాషలోని వ్యత్యాసాల్ని ఉ దాహరించారు. అంతేకాదు, కన్నడ, తమిళ భాషాపదాలతో పోలుస్తూ వాటి వ్యుత్పత్తుల్ని మన దృష్టికి తెచ్చారు.

డా. చిలుకూరి వారి ఈ సిద్ధాంత వ్యాసం తర్వాతి భాషాపరిశోధకు లకు లభించి వుంటే వాళ్లకెంతో ప్రయోజనకరంగా వుండేది. అయినా ఇప్పుడు మించిపోయిందేమి? ప్రాచీనకవుల కావ్యాల వర్ణనాత్మక వ్యాకరణం గురించి పరిశోధించే పరిశోధకులకు ఈ సుకృతి సిద్ధాన్నం కాగలదంటే అతిశయోక్తి కాదు. తాళ్ళపాక అన్నమాచార్యుల **"తలపు గలిగితేను దవ్వు లేమి చేరువేమి?"** అన్న సుభాషితంతో రాబోయే భాషా పరిశోధకులకు స్వాగతం చెప్దాం.

**(పదనకొండవ శతాబ్దము నాఁటి తెనుఁగుభాష.రచయిత: డా. చిలుకూరి నారాయణ రావు. పేజీలు: 288. వెల: రూ. 300/-. ప్రతులకు: ఎమెస్కో బుక్స్. లి. 33-22-2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ - 520004. ఆం.ప్ర. ఫోన్: 0866-2436643. ఇంకా అన్ని ప్రసిద్ధ పుస్తక విక్రయశాలలు.**



# శతక నైవేద్యం

✍ గడ్డం సులోచన, ఫోన్ : 7702891559

సాహిత్య ప్రక్రియలలో శతకానికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. వేల సంవత్సరాల నుండి నేటికీ నిత్య నూతనమై విలసిల్లుతున్న ప్రక్రియ శతకం.

శతకం అంటే నూరు పద్యాల రచన. కానీ సాధారణంగా 108 పద్యాలు రాయడం సాంప్రదాయంగా వస్తుంది. ఈ పద్యాలన్నీ ముక్తకాలు. అంటే ఏ పద్యానికా పద్యం స్వతంత్ర భావాన్ని కలిగి ఉంటుంది.

ఈ సాంప్రదాయాన్ని పాటిస్తూ ఈ మధ్యనే రెండు శతకాలు ప్రచురించారు డా. తూర్పు మల్లారెడ్డి గారు.అందులో ఒకటి **యాదగిరివాస! లక్ష్మీశ! అఖిల పోష!!** అనే అందమైన మకుటాన్ని అమర్చిన **"శ్రీ యాదగిరి నరసింహ శతకము".** భువనగిరి లో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కళాశాలలో వీరు ఉపన్యాసకులుగా, రీడర్‌గా, ప్రిన్సిపాల్‌గా పనిచేసి, అక్కడే పదవి విరమణ పొందారు. భక్తి విశ్వాసాలతో **"దైవమై నాకు సర్వమై ధరణి పైన/ కాచుచుంటివి నిరతము కరుణతోడ..."** అంటూ యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహుడికి అక్షర నైవేద్యంగా శతకాన్ని అంకితమివ్వడం వసివాడని పద్యపుష్పార్చన.


ఇందులో యాద ఋషివృత్తాంతము, యాదగిరీశుని వర్ణన, యాదాద్రి వైభవము, పలునామాలతో స్వామిని కీర్తించడం కనిపిస్తుంది. **తూర్పున నుదయ కాంతులు తోచుచుండె / మేలుకో స్వామి జగములేలుకొనగ...**అంటూ, నీ ఆజ్ఞ తోడ శతకాన్ని రాస్తున్నా భారమంతా నీదేనని, ఆ నారసింహుని రూపాన్ని మదినిండా నింపుకొని తూర్పు కాంతుల తేటగీతులతో పద్య ధారా ప్రవాహమై, భక్తి భావ పరిమళమైనాడు కవి.

గజేంద్రమోక్షము, కుచేలోపాఖ్యానము, ధృవుడు, ప్రహ్లాదుడు మొదలైన ఘట్టాలను సూక్ష్మంలోమోక్షములా వివరించిన తీరు బాగుంది. మచ్చుకు ఓ పద్యం.

**బాల్యసఖుడు కుచేలుని బాధలరసి**
**అడగకుండానే సంపదలన్నీ యిచ్చి**
**స్నేహ ఘనతను చాటిన చిద్విలాస**
**యాదగిరివాస ! లక్ష్మీశ! అఖిల పోష!!**

ఈ శతకం కేవల భక్తి భావ ప్రధానమే కాదు సామాజిక సృహ కూడా కలిగినది.

**ఎంత ఐశ్వర్యమున్న నదేమి ఫలము**
**దానధర్మముల్ జే యని ద్రవ్యమేల**
**పారలేనట్టి నీరెల్ల పాచి బట్టు...(46)**




**వావి వరసలు మరిచియు వయసు గనక**
**మానభంగాలు చేయు దుర్మార్గులకును**
**కఠిన శిక్షల చట్టాలు కన గవలయు...(48)**

ఇలా సందేశాత్మకమైన పద్యాలు ఎన్నో...

ధనము లేకుండా మనిషి బతకలేడు. గౌరవానికి కారణం డబ్బు. మనుషులు మానవీయతను మానవహితాన్ని మరిచి తిరుగుతున్నారు. రక్తమాంసాలు కరిగించి పెంచి పోషించిన తల్లిదండ్రుల పట్ల దయ చూపడం లేదు. యంత్రాల వాడకంలో భౌతిక సుఖాలు పెరిగి రోగాలు కూడా పెరుగుతున్నాయి. (54, 55, 56, 57) కోర్టులో తీర్పు వచ్చేసరికి వయసు మీరుతుంది. కలికాలంలో ధర్మం న్యాయం క్షీణించింది. విద్య సంతలో సరుకుగా మారింది. పాలు పండ్లు, పసుపు, నీరు గాలి, ఆఖరికి నిజము కూడా కల్తీయే! ఏ వృత్తి చేస్తున్నవారైనా సిగ్గు లేకుండా మోసమే చేస్తున్నారు. (58, 59, 60, 62, 63). ఇలా ఎన్నో రకాలుగా ఈనాడు సమాజంలో ఉన్న రుగ్మతలను, మన చుట్టూ ఉన్న పరిస్థితులను, సమస్యలను, మనం ఆలోచించాల్సిన ఆచరించవలసిన విషయాలనెన్నింటినో, మన ముందుంచింది ఈ శతకం.

**ఏమి యాశల మనసిది? ఈశ్వరుండ!**
**తీరుచుండగా కోర్కెలు పెరుగుచుండు**
**చాలు చాలింకా నీ నామజపమునిమ్ము...** అని భక్తి వైరాగ్య తాత్విక చింతనతో కవి వేడుకున్నాడు.

ఎవరికైనా కావలసింది మనశ్శాంతియే కదా! భౌతికమైన ప్రేమలు, బంధాలు, అనేకమైన మనోవ్యాధుల నుండి విముక్తి పొందినప్పుడే, మనో పరిణతితో ఆలోచించినపుడే, మనిషి ప్రశాంతంగా ఉండగలడు. అలా ఉండగలగాలంటే భగవంతుని నామ జపమే

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 (58) హైదరాబాద్ ఆగస్టు : 2025

శరణ్యం. ఈ శతకం ఉపదేశిస్తున్నది కూడా అదే!

**శ్రీహరి! అనంత! అచ్యుత! శ్రీనివాస!**
**నారసింహ! నారాయణ! నాదు స్వామి!**
**యనుచు కనురెప్ప మూయనీ అంత్యమందు... (105 )**

అంటూ భక్తి పారవశ్యంలో ఆత్మనివేదన చేసుకుంటున్నాడు కవి.

**స్వార్థ బుద్ధిని తొలగించి సరసిజాక్ష**
**ప్రజల హితము కొరకు నేను పాటుపడెడి**
**బుద్ధినివ్వుము నాకు నీ పుడమి మీద...(89)**
**బతుకు బాటలో సాగెడు పయనమందు**
**ఆశతో నడ్డదారుల అడుగులిడని**
**స్థైర్యమొసగుము నాకిల శౌర్యరూప!...(102)**

ఇలా ఏ స్వార్థం లేని ప్రేమ తత్వాన్ని అలవర్చుకున్న ఆధ్యాత్మిక అంతరంగ హృదయంతో, సామాజిక చైతన్యంతో శ్రీ యాదగిరి నరసింహ శతక గమనం సాగడం గమనించవచ్చు.

మల్లారెడ్డి గారి పద్యాలలో అర్థం కాని కాఠిన్యత ఏది కూడ ఉండదు. అర్థతాత్పర్యముల అవసరమే ఉండదు. ఏ పద్యం అయినా సులభంగా చదివి అర్థం చేసుకోవచ్చు. అన్వయ క్లిష్టత లేని సహజ సుందరమైన ధారాళమైన పద్య శైలి చదువుతున్నప్పుడు పఠితలకు ఆనందం కలిగిస్తుంది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. పద్య ప్రియులకు ఈ శతక పఠనం హృదయోల్లాసమే!

మల్లారెడ్డిగారు ఆగస్టు 2024లో మూడు నెలల కాలం కొడుకుల దగ్గర అమెరికాలో ఉన్నప్పుడు అందరు ఉద్యోగాలకు పోతే, కలిసొచ్చిన కాలాన్ని (పొద్దుబోక పోయ్యేదట) కవిత్వంగా మలచుకొని రెండు శతకాలతో తిరిగి రావడం అక్షరాన్ని ప్రియంగా ప్రేమించడమే.. ఇది హర్షణీయం. అభినందనీయం. ఈ కవి కలం నుండి మరిన్ని మంచి కృతులు రాగలవని ఆశిస్తున్నాను.

❖ ❖ ❖ ❖ ❖

# కన్నీటి పట్టాలు

**బింగి శ్రీకాంత్**
**ఫోన్ : 7893613015**

అతడు పొద్దును
రెండుసార్లు పలకరించి
మంచంపై పడుకున్నాక
నిదుర రాని కళ్లు
రైలు పట్టాలు గీస్తున్నాయి.

బరువెక్కిన ఉక్కు హృదయం
ఉప్పొంగిన ఉప్పునీటి
ఊటలా జాలువారుతూ...

ఆలోచనలన్నీ గుత్తులు గుత్తులుగా
రాలిపోతున్నాయేమో...
కలలన్నీ అందకుండా
అలలు అలలుగా వెనక్కి
జరుగుతున్నాయేమో తెలియదు.

కాని కంటి దారం మాత్రం
అలాగే ప్రయాణం చేస్తుంది
చెక్కిలి కమతాన్ని నలుమూలలా చుట్టుకుంటూ.



అతని బాధ ఏంటో
ఎవరికి చెప్పుకోలేక పోతున్నాడు
ఆ బోగీలో ఒక్కడే
ఒంటరి కొయ్యకు వేలాడుతున్నాడు.

కష్టం పిశాచమా
అతన్ని కౌగిలించుకున్నది నువ్వేనా ?
అప్పు దెయ్యమా అతని కన్నీళ్ళను తాగి
కడుపు నింపుకుంటున్నది నువ్వేనా?
మానవత్వాన్ని తినే భూతమా
మంచి మనుషులను నువ్వు వదిలి పెట్టవా?

నీ వాసన తగిలితే చాలా
మాటలు మోదుగులా రాలిపోతాయి
కన్నీళ్లు కూడా కవిత్వం రాస్తాయి
ప్రతి ఒక్కరి హృదయాన్ని తడిపి ముద్ద చేసి
ఉప్పు చారలు మొఖం మీద ఆరేస్తాయి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 59 హైదరాబాద్ ఆగస్టు : 2025

# వైభవంగా ఆవిష్కృతమైన 'అక్షరాకాశం'

**డా. మంత్రి శ్రీనివాస్,** కవి, అనువాదకుడు. ఫోన్ : 95509 45096

మూసీ సాహిత్య ధార, జాతీయ సాహిత్య పరిషత్, భాగ్యనగర్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గౌరవనీయులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు, జాతీయకవి దేశభక్త ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి గారి అశీతి ఉత్సవం (ఎనభై ఏండ్ల జన్మదిన వేడుకలు) సందర్భంగా తెలుగుశాఖ అధ్యక్షులు, మూసీ మాసపత్రిక సంపాదకులు, జ్యోతిష విద్యా విదార్వంసులు మాన్యులు ఆచార్య సాగి కమలాకర శర్మగారు సంపాదకులుగా కసిరెడ్డి వారి సాహిత్యాన్ని సమాలోచనం చేసిన 'అక్షరాకాశం' గ్రంథావిష్కరణ అంగరంగ వైభవంగా జరిగింది. కేశవ మెమోరియల్ ప్రాంగణంలోని సర్దార్ పటేల్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి, విశ్రాంత సహాచార్యులు, వ్యక్తిత్వ, సమాజ వికాస నిపుణులు, కేశవ మెమోరియల్ విద్యాసంస్థల కార్యదర్శి డా. అన్నదానం సుబ్రహ్మణ్యం గారు అధ్యక్షత వహించగా, కవి, రచయిత, ఆచార్య కసిరెడ్డి గారి ప్రత్యక్ష గురువులు జీవనపర్వాన్ని ఆత్మకథగా అందరికీ స్ఫూర్తిని పంచిన పెద్దలు పూర్వ ప్రాచార్యులు డా. శ్రీపెరంబుదూరు రంగాచార్య గారు ముఖ్యఅతిథిగా విచ్చేసి తమ అమృత హస్తాలతో గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కసిరెడ్డి వెంకటరెడ్డి గారిని తన విద్యార్థిగానే కాదు చిన్ననాటి నుండి సాహితీ పిపాస మెండుగా ఉన్న జ్ఞానిగా, నిరంతరం అక్షర యజ్ఞం చేసిన తపస్విగా అభివర్ణించారు. పాలెం కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆనాటి విద్యార్థులతో తన అమూల్యమైన అనుభవాలను పంచుకున్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన పరిశోధక పరబ్రహ్మ, కవి, విమర్శకులు, నాటకకర్త, బహుగ్రంథకర్త సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి మాన్యులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు గారు మాట్లాడుతూ ఆచార్య కసిరెడ్డి గారి సాహిత్యాన్ని సమగ్రంగా సమాలోచనం చేసిన గ్రంథం ఈ అక్షరాకాశమన్నారు. కసిరెడ్డి గారితో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కలిసి పనిచేయడం ఎంతో ఆనందాన్ని కలిగించిన విషయమన్నారు. ఆయన అందించిన స్ఫూర్తి ఆచార్యత్వం వహించిన అందరికీ దారిదీపం లాంటిదన్నారు. జాతిని జాగృతం చేసిన ఆయన సాహిత్యం అశేష జనుల హృదయాలను దేశభక్తితో నింపిందని, ఆధ్యాత్మిక వెలుగులు పంచిందన్నారు. కసిరెడ్డి వారికి ఈ గ్రంథం జన్మదిన కానుకగా సంపాదకులు అందించారన్నారు.

గ్రంథ సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మగారు ప్రసంగిస్తూ దుబ్బాక కృష్ణస్వామి గారు కసిరెడ్డి గారిపై రాసిన పద్యంతో కసిరెడ్డి వెంకట్ రెడ్డి గారి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. గురుపౌర్ణమి నాడు పుట్టిన కసిరెడ్డి గారు వ్యాసుని జన్మదినోత్సవం నాడు పుట్టి వ్యాసుడంతటి సాహిత్యాన్ని లోకానికి అందించిన ఘనకీర్తి ఆచార్య










కసిరెడ్డి వెంకట్ రెడ్డి గారిదన్నారు. యాభై సంవత్సరాల నుండి ఉపన్యాస ధారను కురిపిస్తున్న ఆయన ప్రాథమిక స్థాయి నుండి ఐఏఎస్‌ల దాకా ఆయన ప్రసంగంలో తమను తాము తీర్చిదిద్దుకుంటున్నారు. జానపదం, చరిత్ర, భాషా, సాహిత్యం, సంస్కృతి మొదలైన అంశాలపై అపారమైన జ్ఞానాన్ని కలిగి విశేషమైన గ్రంథాలను వెలువరించిన ఘనత ఆయనదన్నారు. విరామం లేకుండా తెలంగాణ వ్యాప్తంగా ప్రయాణం చేసి జాతీయవాదాన్ని ప్రసారం చేసిన దేశభక్తులు ఆయన అన్నారు. కార్యకర్తగా, కావ్యకర్తగా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అరవై ఏళ్లుగా తపిస్తున్న జ్ఞానయోగి ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి గారన్నారు. వారి శిష్యులుగా మేము ధన్యులమన్నారు. ఈ గ్రంథాన్ని తీసుకురావడంలో తనకు సహకరించిన డా. బి. మనోహరి గారికి, డా. అట్టెం దత్తయ్యకు, ధూళిపాల అరుణ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.


ఆత్మీయ అతిథిగా హాజరై అమృత స్పందనను తెలియజేసిన చారిత్రక నవలా చక్రవర్తి, రెసిడెన్సీ, వంశధార, తంజావూరు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 10 60 హైదరాబాద్ ఆగస్టు : 2025










విజయం, బసవగీత వంటి అపూర్వ గ్రంథాల కర్త ధార్మికులు ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ విశ్రాంతాచార్యులు ఆచార్య ముదిగొండ శివప్రసాద్ మాట్లాడుతూ కసిరెడ్డి గారు ఆచార్యత్వంతో పాటు పరిపాలనా నైపుణ్యాలను కలిగిన అద్వితీయమైన నిపుణులన్నారు. ఆయనతో కోఠి మహిళా కళాశాలలో పనిచేసిన రోజులను, ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని మురిసిపోయారు. ఆయన సృజించిన సాహిత్యం దేశభవిష్యత్తుకు మార్గోపదేశం లాంటిదన్నారు. మరొక ఆత్మీయ అతిథి పలు చారిత్రక గ్రంథాలు, సాహితీ పుస్తకాల ప్రచురణ భారాన్ని వహించినవారు, రెడ్డి హాస్టల్ సంక్షేమ సారథి శ్రీ కొండా లక్ష్మీకాంతరెడ్డి తన స్పందనను వినిపిస్తూ కసిరెడ్డి గారి గ్రంథాల ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని ఆయనతో కలిసి నడవడమంటే సైన్యంగా నడవడమన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ భాగ్యనగర్ శాఖ అధ్యక్షులు వడ్లూరి ఆంజనేయరాజు గారు సుదీర్ఘ కాలంగా కసిరెడ్డి గారితో దేశ భవిష్యత్ నిర్మాణానికి చేసిన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు.

ఆచార్య కసిరెడ్డి గారి సాహితీ కృషిని, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అభివృద్ధికి, జాతీయవాదాన్ని ముందుతరాలకు అందించడానికి ఆయన చేసిన, చేస్తున్న కృషి ఎనలేనిదని ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య కిషన్ రావు గారన్నారు.


పాలమూరు ముద్దుబిడ్డ, సాహిత్య సంవిధానులు, దేశభక్త డా.పి.భాస్కరయోగి గ్రంథ అంతరంగాన్ని పరిచయం చేస్తూ ఏడు వందల పుటలను దాటి రూపొందిన ఈ గ్రంథం ఆచార్య కసిరెడ్డి గారి బహుముఖీనతను లోకానికి పరిచయం చేసిందన్నారు. యూనివర్సిటీ ఆచార్యులు, పరిశోధకులచే ఆచార్య కసిరెడ్డి గారి నూట ఎనిమిది పుస్తకాల సమగ్ర సమచారం ఈ గ్రంథంలో సమాహితం అయ్యిందని, కసిరెడ్డి వారి జానపద, చారిత్రక, సామాజిక, జాతీయవాద, ఆధ్యాత్మిక జ్ఞాన సంపదను అక్షరాలలో నింపి పాఠకులకు అందించిన గ్రంథంగా ఈ అక్షరాకాశాన్ని కొనియాడారు. ఈ గ్రంథ నిర్మాణంలో శ్రమించిన డా.భిన్నూరి మనోహరి గారిని వారితో పాటు శ్రమించిన పరిశోధకులకు అభినందనలు తెలియజేశారు.

అంతిమంగా ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి గారు తమ ఆత్మీయ స్పందిస్తూ అందరిలోని పరమాత్మకు నమస్కరిస్తూ సమస్త జీవుల్లో పరమాత్మను దర్శించాలని లోకానికి ప్రబోధం చేస్తూ 'అక్షరాకాశాన్ని' రూపొందించడంలో పాలుపంచుకున్న అక్షర సారథులు సంపాదకులకు ఆశీస్సులు అందించారు. పాలెం కళాశాల నుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం దాకా ఆయన ప్రయాణాన్ని గురువులతో, శిష్యులతో అనుభవాలను యాది చేసుకున్నారు. ఈ గ్రంథ నిర్మాణంలో వ్యాసరత్నాలను అందించిన వ్యాసకర్తలకు శుభాశీస్సులు అందించారు. ఈ సంకలన యజ్ఞాన్ని జయప్రదం చేయడంలో చేయూతనందించిన ప్రతీ ఒక్కరిని అభినందనలందించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఆచార్య కసిరెడ్డి వెంకట్ రెడ్డి సాహితీ పురస్కార స్థాపన జరిగింది. ఆయన పేరిట అందించే తొలి పురస్కారాన్ని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు డా.వడ్లూరి ఆంజనేయ రాజు గారికి అందించారు. ఈ సందర్భంగా ప్రముఖులు పురస్కార గ్రహీతకు అభినందనలు తెలిపారు. ఎంతో వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాసాలు రాసిన వ్యాసకర్తలను అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి డా.మంత్రి శ్రీనివాస్ స్వాగతం పలుకగా మావుదూరి సూర్యనారాయణ మూర్తిగారు ముగింపు వచనాలను పలికారు. కార్యక్రమాంతంలో చిరుజల్లుల సవ్వడి మధ్య కమ్మని తేనేటి విందుకు తోడుగా పోషకవర్ధకమైన అల్పాహారాన్ని అతిరథమహారథులు స్వీకరించి నిర్వాహకులను ధన్యులను చేశారు.

❖ ❖ ❖ ❖ ❖



## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా

సంపాదకుడు, మూసీ మాసపత్రిక,

ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,

బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,

హైదరాబాద్-500013.


చందాలకు ఆన్‌లైన్ అకౌంట్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.


అకౌంట్ నెం. 52019740642

IFS Code : SBIN0020083


editormusi@gmail.com





**వేద విజ్ఞాన లహరి (ఉపన్యాస మంజరి)**
ప్రచురణ : యువభారతి
వెల : 100
ప్రతులకు: యువభారతి కార్యాలయం, 3-6-207/1, మక్దూం మార్గం, 15వ వీధి, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500 029.





**మగ్న సంగీతం (కవిత్వం)**
డా. ఎన్. గోపిఎ. మ
వెల : 200
ప్రతులకు: ఎన్. అరుణ, ఇం.నెం. 13-1/బి, శ్రీనివాస పురం, రామంతాపూర్, హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 040- 27037585, 9391028496





**సి. నారాయణరెడ్డి కథా కావ్య సమాలోచనం**
అనుమాండ్ల భూమయ్య
వెల : 400
ప్రతులకు : ఎ. మనస్విని దేవి, ఫ్లాట్ నెం. 519, అపురూప జగపతి హైట్స్, ఆదర్శనగర్, ఉప్పల్, హైదరాబాద్ - 500 039
ఫోన్ : 8897073999





**పగిలిన జీవ కలలు (దీర్ఘ కవితా కావ్యం)**
ఎస్. ఆర్. పృథ్వి
వెల : 50
ప్రతులకు : పి. ఉషారాణి, 104-6-140, ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమహేంద్రవరము - 533 101
ఫోన్ : 9989223245





**వికీపీడియా తెలుగు సాహిత్య వినియోగం**
మ్యాడం అభిలాష్
వెల : 150
ప్రచురణ : బోలిచేతో ఫౌండేషన్
ప్రతులకు: రచయిత, ఇం.నెం. 3-557, జాజాపూర్, నారాయణపేట.
ఫోన్: 8142576346




**మన కథానికలు (తెలుగు కథానికల మీద విమర్శ వ్యాసాలు)**
రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
వెల : 160
ప్రతులకు : డి. నిర్మలమ్మ, ఫ్లాట్ నెం. 303, చంద్రప్రియ రెసిడెన్సీ, ఆదిమూర్తి నగర్, అనంతపూర్ - 515 001.
ఫోన్ : 9440044922




**ప్రపంచీకరణ యుగ కర్షకకవి కొండ్రెడ్డి**
ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
వెల : 200
ప్రతులకు : కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఇం.నెం. 8-150, కొత్తపేట, కనిగిరి, ప్రకాశం జిల్లా - 523 230
ఫోన్ : 99487 74243




**విమర్శా పునర్నవం (రాచపాళెం 70 ఏళ్ళ జీవితం : 50 ఏళ్ళ విమర్శ)**
సంపాదకుడు : కె. నాగేశ్వరాచారి
వెల : 550
ప్రతులకు : రాచపాళెం లక్ష్మీకాంతమ్మ, 5/134, 7వ క్రాస్, భైరవనగర్, జె.ఎన్.టి.యు. వెనుక, అనంతపురం - 515 002.
ఫోన్ : 9494712056

ISSN 2457-0796


# ఎంత బావుంది!

డా. టి. శ్రీవల్లీ రాధిక
ఫోన్ : 94416 44644

మాటలూ చేష్టలూ ఆపేసి నిన్ను చూడడం..
నిన్నే చూడడం ఎంత బావుంది!
అక్కడ కనిపిస్తానూ ఇక్కడ కనిపిస్తానూ
అని చెప్పావట!
అందులో నేనున్నాను ఇందులో నేనున్నాను
అని సూచించావట!
అవన్నీ విన్నారో లేదో
కానీ జనం
అచ్చపుచీకటిలోనూ
అపుడపుడూ నిను కనిపెడతారు!
అప్రయత్నంగా కౌగలించుకుంటారు!

ఒక సుమధుర గానానికి
పరవశంగా తలలు ఊపేవారు
ఒక గొప్ప పాండిత్యాన్ని చూసి
వినమ్రంగా ప్రణమిల్లేవారు
నిష్కల్మషంగా నవ్వేవారూ
నిర్మలంగా చూసేవారూ
బ్రతుకు సుడిగుండంలో
ప్రమత్తులై తిరుగుతున్నా
ఎప్పుడో ఒకసారి
ఏదో ఒక సందర్భంలో
నిర్వ్యాజంగా ఆనందించేవారూ
నిర్మోహంగా కొన్ని క్షణాలు నిలిచేవారూ
అందరినీ అన్నిటినీ చూడటం
ఎంత బావుంది!
నీ వైభవాన్నీ
వ్యాపకత్వాన్నీ
భావించడం అనుభవించడం
ఎంత బావుంది!

# ఒక మథనం తర్వాత ...

డా. తిరునగరి శరత్ చంద్ర
ఫోన్ : 630 987 3682

ఒక ప్రళయం తర్వాత..

నిశ్శబ్దం
నిర్మోహమాటంగా నిద్రలేస్తుంది.
కాసేపు అలా ఉంటుంది.
అంతే..
మళ్ళీ సింపుల్ గా వెనక్కి వెళ్ళిపోతుంది.

ఒక ఆలోచన తర్వాత..

పేపర్ మీద
కవిత నిలబడుతుంది.
శతాబ్దాలదాకా
గాల్లో చేరి వినబడుతుంది.

ఒక బాధ తర్వాత..

కనురెప్పలు తెరుచుకుంటుంది
లోపలి ప్రపంచం..
అది కాస్త నడిచి మళ్ళీ ఆగుతుంది.

ఒక మథనం తర్వాత..

పుట్టుక చస్తుంది. చావు పుడుతుంది.
రెండింటి మధ్యన
కవి ఉదయిస్తాడు.



# SISTER NIVEDITA SCHOOL

Estd: 1989

**THE PLAY SCHOOL**®

Kindergarten Wing of SNS

**Nursery, LKG & UKG**

**CBSE - Senior Secondary School**

Affiliation Code: 3630040

## AMEERPET, HYDERABAD.



36 GLORIOUS YEARS

**We are known for:**

- Innovative teaching pedagogies.
  - Teachers as facilitators.
  - A good conducive classroom atmosphere.
  - Participation in all the interschool and cluster competitions.
- Well-equipped Laboratories for Physics, Biology, Chemistry, Math & Computer Science.
  - Equal emphasis on both scholastic and co-scholastic aspects of education.
- Imbibing core values & morals in the process of character building.
  - Sports – a prime focus of the school.
  - Field trip & picnics
- Interesting activities to make teaching-learning process joyful, and engaging.

**for classes I to XII**



**We have commenced with IIT/NEET coaching classes for class VI to class XII, going to be dealt by well trained teachers of the school.**



### COMMERCE STREAM

Compulsory subjects

**BEA, MEA & English**

Additional Subjects:

Marketing or PHE or NCC or Painting



### SCIENCE STREAM

Compulsory subjects

**MBiPC, MPC, BiPC & English**

Additional Subjects:

PHE or NCC or Painting

"Your Child Deserves **The Best Education**"

*Learn, grow and thrive with caring educators*

- Nurtured by dedicated staff
- Play - Based learning
- Happy and joyful classes
- Creative corner
- Imbibe moral values
- Holistic development



Contact Us for more Info:

**80967 38855**

**VISIT OFFICE FOR ADMISSION**

*For your Child's Bright Future...*

www.snschool.com

Scanned with OKEN Scanner